
శుక్రవారం 26-1-2024



'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 131

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
శుక్రవారం ॥ 26-1-2024


ఫ్యాషన్

మూడు రంగుల ముస్తాబు











దేశీయ స్ఫూర్తి కోసం ఈ రోజు ప్రత్యేకంగా కనిపించాలనుకునేవారు తిరంగా రంగులను ట్రై చేయచ్చు. అయితే, ఆరెంజ్, తెలుపు, పచ్చ మూడు రంగులను ఒకే డ్రెస్‌లో ఉండాలనుకునేవారు కొందరైతే, ఒకే కలర్ కాన్సెప్ట్‌తో స్పెషల్‌గా వెలిగిపోవాలనుకునేవారు మరికొందరు ఉంటారు. అలాగని, గాఢీగా కాకుండా లేత రంగుల ప్రత్యేకతతోనూ మెరిసిపోవాలనుకుంటారు. అభిరుచికి తగినట్టుగా డ్రెస్‌ను ఎంపిక చేసుకునే స్పెషల్ డే కి స్పెషల్ లుక్.

యాక్ససరీస్

ఔట్‌ఫిట్స్‌లో ట్రై కలర్స్‌కి నో చెప్పేవాళ్లు ఇతర అలంకరణలో ప్రత్యేకతను చూపవచ్చు. అందుకు ట్రై కలర్ గాజులు, బ్రేస్‌లెట్స్ మంచి ఎంపిక అవుతుంది. ట్రై కలర్స్‌లో నెయిల్‌పాలిష్ డిజైన్‌నూ ఎంచుకోవచ్చు.





జీన్స్ మీదకు గ్రీన్ కలర్ కుర్తా లేదా లాంగ్ ఓవర్ కోట్, ట్రై కలర్ జాకెట్ ధరించినా చాలు.



పూర్తి వైట్ గాగ్రా చోళీ లేదా మూడు రంగుల కలబోతగా మిక్స్ అండ్ మ్యాచ్ చేయచ్చు.

* * *

వైట్ కుర్తా మీదకు ట్రై కలర్ దుపట్టా ఒక మంచి ఎంపిక అవుతుంది. ప్రత్యేకంగానూ ఉంటుంది.



ఆరెంజ్ కలర్ శారీ, వైట్ కలర్ బ్లౌజ్ లేదా సేమ్ ఆల్ ఓవర్ ఒకే కలర్‌ని ఎంచుకోవచ్చు.



ప్రఖ్యాత డిజైనర్స్ సైతం తమ డిజైన్స్‌లో తెలుపు, పచ్చ, ఆరెంజ్‌ల ఒకే కలర్ కాన్సెప్ట్‌తో డిజైన్ చేస్తుంటారు. సందర్భాన్ని బట్టి మిక్స్ అండ్ మ్యాచ్ కాంబినేషన్ ఔట్‌ఫిట్‌ను మనమే సొంతంగా రీ డిజైన్ చేసుకోవచ్చు.

వంటిల్లు

ఆరోగ్యకారకం

సంక్రాంతి రుచుల తియ్యటి రుచి బయటపడాలనిపిస్తోందా! నోటికి కారంగా, పొట్టకు తేలిగ్గా ఉండే ఆహారం తినాలనిపిస్తోందా. ఉన్నది ఆరు రుచులే... కానీ జిహ్వ మరింత రుచిని కోరుకుంటుంది. నాలుకకు మమకారం మాత్రమే కాదు రుచి కారమూ ఇష్టమే. పోపుల పెట్టెలో దినుసులన్నీ కలిపి రకరకాల కారం పొడులు చేద్దాం.

నువ్వుల పొడి



కావలసినవి: తెల్ల నువ్వులు – వంద గ్రాములు; ఎండు మిర్చి– 10; మినప్పప్పు – అర టేబుల్ స్పూన్; పచ్చి శనగపప్పు – టీ స్పూన్; జీలకర్ర – టీ స్పూన్; ఇంగువ – అర టీ స్పూన్; ఉప్పు– రుచికి తగినంత

తయారీ: ● మందపాటి బాణలిలో నువ్వులు వేసి మీడియం మంట మీద దోరగా వేయించి పక్కన పెట్టాలి. ● మరొక బాణలిలో ఎండుమిర్చి, పచ్చి శనగపప్పు, మినప్పప్పు వేయించి చివరగా జీలకర్ర వేసి దించేయాలి. ఇవన్నీ చల్లారిన తర్వాత మిక్సీ జార్‌లో నువ్వులు, పోపు దినుసులు, ఇంగువ, ఉప్పు వేసి గ్రైండ్ చేయాలి. ఈ పొడిని అన్నం, ఇడ్లీ, ఉప్మాల్లో తినవచ్చు. కూరల్లో కలుపుకోవచ్చు. వేపుళ్లలో పైన చల్లుకోవచ్చు. ఎముకల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కాబట్టి వారంలో కనీసం మూడు రోజులు ఆహారంలో ఈ పొడి ఉండేలా చూసుకోవడం మంచిది.

కొబ్బరి పొడి

కావలసినవి: ఎండుకొబ్బరి తురుము – వంద గ్రాములు; పచ్చి శనగపప్పు – టీ స్పూన్; వేయించిన శనగపప్పు – టీ స్పూన్; మిరప్పొడి– టేబుల్ స్పూన్; జీలకర్ర – టీ స్పూన్; వెల్లుల్లి రేకలు – 4; ఇంగువ – అర టీ స్పూన్; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి.

తయారీ: ● బాణలిలో పచ్చి శనగపప్పు వేసి దోరగా వేగిన తర్వాత వేయించిన శనగపప్పు, జీలకర్ర, వెల్లుల్లి, ఇంగువ,



కొబ్బరి తురుము వేసి కలిపి దించేయాలి. వేడి తగ్గిన తర్వాత అన్నింటినీ మిక్సీ జార్‌లో వేసి మిరప్పొడి, ఉప్పు కలిపి పొడి చేయాలి. ఇడ్లీ, దోశెలు, అన్నంలోకి బాగుంటుంది. వేపుళ్లలో ఒక టేబుల్ స్పూన్ పొడి కలిపితే రుచి ఇనుమడిస్తుంది.

కరివేపాకు పొడి



కావలసినవి: కరివేపాకు– వందగ్రాములు (మంచి నీటిలో శుభ్రం చేసి ఆరబెట్టి ఈనెలు తీసిన ఆకులు); ఎండు మిర్చి– పది; ఆవాలు– అర టీ స్పూన్; పచ్చి శనగపప్పు – టేబుల్ స్పూన్; మినప్పప్పు – టేబుల్ స్పూన్; వేరుశనగపప్పు – అర టేబుల్ స్పూన్; ధనియాలు – టీ స్పూన్; జీలకర్ర – టీ స్పూన్; మిరియాలు – అర టీ స్పూన్; చింతపండు – అర అంగుళం పాయ; వెల్లుల్లి రేకలు – 4; ఇంగువ పొడి– పావు టీ స్పూన్; నూనె – టేబుల్ స్పూన్; ఉప్పు – రుచికి తగినంత.

తయారీ: ● బాణలిలో నూనె వేడి చేసి వేరు శనగపప్పు, ఆవాలు, ఎండు మిర్చి, ధనియాలు, పచ్చి శనగపప్పు, మినప్పప్పు దోరగా వేయించాలి. అవి వేగిన తర్వాత మిరియాలు, జీలకర్ర, కరివేపాకు వేసి వేయించాలి. ఆకులో పచ్చిదనం పోయే వరకు చిన్న మంట మీద వేయించాలి. ఆకు వేగిన తర్వాత చింతపండు, ఇంగువ, వెల్లుల్లిరేకలు, ఉప్పు వేసి దించేయాలి. ● చల్లారే కొద్దీ ఆకు పెళపెళలాడుతుంది. పూర్తిగా చల్లారిన వెంటనే మిక్సీలో వేసి పొడి చేయాలి. రుచి చూసి అవసరమైతే మరికొంత ఉప్పు కలుపుకోవాలి. ఈ పొడి వేడి అన్నం, ఇడ్లీ, దోశెల్లోకి రుచిగా ఉంటుంది. ఆకలి మందగించినప్పుడు, నోటికి ఏదీ రుచించనప్పుడు ఈ పొడి తింటే జీర్ణవ్యవస్థ క్రమబద్ధమవుతుంది.

గమనిక: చల్లారిన వెంటనే పొడి చేయకపోతే ఆలస్యమయ్యే కొద్దీ ఆకు మెత్తబడి పోతుంది. సరిగ్గా మెదగదు.

అవిశె గింజల పొడి

కావలసినవి: అవిశె గింజలు – వందగ్రాములు; ఎండు మిర్చి – పది; ఆవాలు – అర టీ స్పూన్; మిరియాలు– అర టీ స్పూన్; పచ్చి శనగపప్పు – టేబుల్ స్పూన్; మినప్పప్పు – టీ స్పూన్; వేరు శనగపప్పు – అర టేబుల్ స్పూన్; ధనియాలు – టీ స్పూన్; ఇంగువ– అర టీ స్పూన్; కరివేపాకు – రెండు రెమ్మలు; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి.

తయారీ: బాణలిలో అవిశె గింజలను మీడియం మంట మీద వేయించి పక్కన పెట్టుకోవాలి. మరొక బాణలిలో ఎండుమిర్చి, ఆవాలు, ధనియాలు, వేరు శనగపప్పు, పచ్చి శనగపప్పు, మినప్పప్పు, మిరియాలు, కరివేపాకు వేసి వేయించాలి. దినుసులన్నీ చక్కగా వేగి మంచి వాసన వచ్చేటప్పుడు అవిశె గింజలు, ఇంగువ వేసి కలిపి దించేయాలి. వేడి తగ్గిన తర్వాత మిక్సీ జార్‌లో వేసి ఉప్పు కలిపి పొడి చేసుకోవాలి. ఇది పూర్తిగా ఆరోగ్యకారకం. గుండె వ్యాధుల నివారణ, డయాబెటిస్ నియంత్రణకు డాక్టర్లు అవిశె గింజలను సూచిస్తున్నారు. రుచి కోసం చూడకుండా రోజూ ఒక స్పూన్ అన్నంలో లేదా బ్రేక్‌ఫాస్ట్‌లో ఏదో ఒకరకంగా తీసుకోవడం మంచిది.



న్యూస్‌మేకర్
మైథిలీ ఠాకూర్

రామ సన్నిధిలో శబరి గీతం



అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ సమయంలో మంత్రాలు, స్తోత్రాలతోపాటు భక్తి సంగీతం కూడా భక్తులను తన్మయత్వానికి గురి చేసింది. శంకర్ మహదేవన్, సోను నిగమ్ వంటి సీనియర్ గాయకులతో పాటు రామ సన్నిధిలో 'శబరి గీతం' వినిపించిన బిహార్ గాయని మైథిలీ ఠాకూర్ ప్రత్యేక ప్రశంసలు పొందింది. నరేంద్ర మోడీ ఆమె గురించే ప్రత్యేకంగా ట్వీట్ చేశారు. ఆరేళ్ల వయసు నుంచి భక్తి సంగీతాన్ని వినిపిస్తున్న మైథిలీ ఠాకూర్ పరిచయం.

'శబరీ సవారె రాస్తా
ఆయేంగె రామ్‌జీ'...
(శబరి వీధుల్ని అలంకరిస్తోంది
రాముని రాక కోసం)...

అని పాడిన మైథిలీ ఠాకూర్ పాటను ప్రత్యేకంగా మెచ్చుకుంటూ ట్వీట్ చేశారు ప్రధాని మోదీ. బాలక్ రామ్ ప్రాణ ప్రతిష్ఠ సమయంలో మైథిలీ ఠాకూర్ ఈ పాటను యూట్యూబ్‌లో విడుదల చేయడమే కాదు... ప్రాణప్రతిష్ఠ సమయంలో ఆలయప్రాంగణంలో రాముని భజనలు కూడా పాడింది. దేశం మొత్తంలో ఇలాంటి అవకాశం పొందిన అతి చిన్న వయసు గాయని మైథిలి. 21 ఏళ్ల వయసులో ఇంత గుర్తింపు పొందడానికి కారణం ఎడతెగని సాధన, సంగీతం పట్ల ఆరాధనే.

బిహార్ అమ్మాయి

మైథిలీ ఠాకూర్‌ది బిహార్‌లోని మధుబని. తండ్రి రమేష్ ఠాకూర్ భజన గాయకుడు. అందువల్ల బాల్యం నుంచి తండ్రితో పాటు భజనలు పాడేది మైథిలి. ఇంట్లో ఏదో ఒక సమయంలో రామ్‌సీతా కీర్తనలు కొనసాగుతుండేవి. మైథిలిని తన వారసురాలిగా చేయాలని తండ్రికి ఉండేది. అందుకుని పదేళ్ల వరకూ స్కూల్‌కే పంపకుండా సంగీతంలో సాధన చేయించాడు. అయితే మైథిలికి గుర్తింపు మాత్రం వెంటనే రాలేదు.

గెలుపూ ఓటమి

మైథిలి భవిష్యత్తు కోసం ఢిల్లీకి మకాం మార్చాడు తండ్రి. ఢిల్లీలోని బాలభవన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నేరుగా ఆరవ తరగతిలో చేరిన మైథిలి మొదటిసారి స్కూల్ ముఖం చూడటం, అక్కడ ఇంగ్లిష్ రాక అవస్థ పడటం కొనసాగిస్తూనే సంగీతాన్ని సాధన చేసింది. ఢిల్లీలో మైథిలి కచ్చేరీలు చేసినా అందరికీ తెలిసేటంతటి పేరు రాలేదు. ఆ సమయంలోనే అంటే 11 ఏళ్ల వయసులో 'లిటిల్ చాంప్', 'ఇండియన్ ఐడల్ 2' వంటి రియాలిటీ షోస్‌కు వెళ్లి ఫెయిల్ అయ్యి తిరిగి వచ్చింది మైథిలి.



దశ తిరిగింది

2017లో కలర్స్ టీవీలో 'రైజింగ్ స్టార్' అనే సింగింగ్ రియాలిటీ షో మైథిలి దశ తిప్పింది. ఆ షోలో మైథిలి రన్నర్ అప్‌గా నిలిచింది. ముంబైలో ఈ షో చేసి తిరిగి వచ్చాక ఢిల్లీ నుంచే తాను లోకానికి తెలియానుకుంది. వెంటనే సోషల్ మీడియాలో తన పాటలను పోస్ట్ చేయడం మొదలెట్టింది. మైథిలికి ఇద్దరు తమ్ముళ్లు–రిషబ్, అయాచి ఉన్నారు. వారిద్దరు తబలా, డోలక్ వాయిస్తారు. మైథిలి హార్మోనియం వాయిస్తుంది. వీరు ముగ్గురు కలసి పాటల వీడియోలు రిలీజ్ చేయడం మొదలెట్టారు. పెద్ద హిట్ అయ్యాయి. సినిమా పాటలే కాకుండా బిహార్‌లోని జానపద సంగీతాన్ని, పంజాబీ, గుజరాతీ, కేసరియా, బజ్జిక వంటి సంగీత ధోరణులను వీడియోలుగా రిలీజ్ చేసింది మైథిలి. అంతేకాదు భజన సంగీతాన్ని కొనసాగించింది. ఇప్పుడు ఆమెకు యూట్యూబ్‌లో 20 లక్షల మంది సబ్‌స్క్రయిబర్లు ఉన్నారు. ఇన్‌స్టాలో, ఫేస్‌బుక్‌లో లక్షల ఫాలోయెర్లు ఉన్నారు. ఆ ప్రఖ్యాతి మైథిలిని రాముని పాదాల వరకూ చేర్చింది.



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 131

శుక్రవారం 26-1-2024

పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు సాక్షి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | VIJAYAWADA | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

3,67,305 మందికి పునర్జన్మ

ఆరోగ్యశ్రీతో గుండె గుండెకూ భరోసా

పేదల ప్రాణానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద దన్ను

- వివిధ కారణాలతో పెరుగుతున్న గుండె పోట్లు
- పేద, మధ్యతరగతి వారికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద ఉచిత చికిత్స.. ఒక్క గుండె చికిత్సల కోసమే రూ.2,229 కోట్లు వెచ్చింపు
- ఏ ఒక్కరూ కుటుంబానికి దూరం కాకూడదని సీఎం వైఎస్ జగన్ తాపత్రయం
- ప్రొసీజర్లు 1,059 నుంచి 3,257కు పెంపు
- ఏకంగా రూ.25 లక్షల వరకు వైద్యం ఉచితం
- ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా కోసం రూ.13 వేల కోట్ల ఖర్చు
- 40 లక్షల మందికి ఉచితంగా వైద్య సేవలు
- కొత్తగా 17 మెడికల్ కళాశాలల ఏర్పాటు
- నాడు-నేడు కింద ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధి
- 53 వేల మందికి పైగా వైద్యులు, వైద్య సిబ్బంది నియామకం.. ఉద్దానంలో వైఎస్సార్ కిడ్నీ పరిశోధన కేంద్రం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి
- ఫ్యామిలీ డాక్టర్ పేరుతో గ్రామీణులకు మరింత చేరువైన వైద్యం.. వీటన్నింటికీ తోడు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు

12లో



గుండె పోటు అనగానే ఎవరికైనా సరే సగం ప్రాణాలు పోతాయి. మిగతా సగం ప్రాణాలు పోకుండా కాపాడుకోవాలంటే వెంటనే అత్యుత్తమ వైద్యం అందాలి. ఇది జరగాలంటే చేతిలో కనీసం రెండు మూడు లక్షల రూపాయలుండాలి. డబ్బులున్నోళ్లయితే వెంటనే కార్లో వెళ్లి కార్పొరేట్ ఆస్పత్రిలో జాయినైపోతారు. మరి రెక్కాడితే కానీ డొక్కాడని పేదల పరిస్థితి ఏమిటి? ప్రాణాలు పోగొట్టుకోవాల్సిందేనా? ఇదంతా గతం. గత టీడీపీ ఐదేళ్ల దుర్మార్గపు పాలనలో, మనసు లేని పాలకుల హయాంలో ఇలాగే జరిగేది. ఇప్పుడా పరిస్థితి రాష్ట్రంలో ఎక్కడా లేదు. నేనున్నానంటూ 'వైఎస్సార్ ఆరోగ్యశ్రీ' రూపంలో సీఎం వైఎస్ జగన్ గుండె గుండెకూ భరోసా ఇస్తున్నారు. ఇలా ఇప్పటిదాకా వంద కాదు.. వెయ్యి కాదు.. లక్ష కాదు.. ఏకంగా 3.67 లక్షల మందికి పునర్జన్మ ఇచ్చారు. ఇంతటి మేలు ఏపీ మినహా ఏ రాష్ట్రంలోనూ జరగలేదనడం పచ్చి నిజం.



వెంకయ్యనాయుడు
(పద్మ విభూషణ్)



చిరంజీవి
(పద్మ విభూషణ్)

వెంకయ్యనాయుడు, చిరంజీవి 'విభూషణులు'

- తెలుగు తేజాలను వరించిన రెండో అత్యున్నత పౌర పురస్కారం
- బిందేశ్వర్ పాఠక్, పద్మా సుబ్రమణ్యం, వైజయంతిమాలకు కూడా..
- నటులు విజయ్‌కాంత్, మిథున్, గాయని ఉషా ఉతుప్‌లకు పద్మభూషణ్
- మొత్తం 17 మందికి మూడో అత్యున్నత పురస్కారం
- మరో 110 మందికి పద్మశ్రీ పురస్కారాలు.. ఇందులో ఏపీ నుంచి ఒకరు, తెలంగాణ నుంచి ఐదుగురు
- జాబితాలో ఉమా మహేశ్వరి, సోమ్‌లాల్, ఆనందచారి, కొండప్ప, సమ్మయ్య, విఠలాచార్య
- గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్రం ప్రకటన

2లో



మారుమూలనా హల్'సెల్'

గిరిజన ప్రాంతాలకు సమర్థవంతమైన టెలికాం సేవలు.. 400 సెల్ టవర్ల ప్రారంభ కార్యక్రమంలో సీఎం జగన్

అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, ప్రకాశం, ఏలూరు, శ్రీకాకుళం, కాకినాడలో కనెక్టివిటీ

వీటి ఏర్పాటుతో 944 ఆవాసాల్లో 2.42 లక్షల మందికి ప్రయోజనం

మొత్తంగా రూ.3119 కోట్లతో 2,900 టవర్ల నిర్మాణాలు

12లో



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

ఒంటరి బతుక్కి ఓ గూడు దొరికింది



కుటుంబంలో సమస్యల కారణంగా నేను సుమారు 25 సంవత్సరాల క్రితం మా తాత ఉంటున్న శ్రీకాకుళం జిల్లా ఎల్.ఎన్.పేట మండలంలోని తురకపేట గ్రామానికి వచ్చాను. కుమార్తెకు పెళ్లి చేశాను. కూలి పనులు చేసుకుని జీవిస్తున్నాను. ఊరిలో ఐదారు ఇళ్లు మారాను. నాకు ఇంటి స్థలం లేదు. సొంత ఇల్లు లేదని ఎంతగానో బాధ పడేదాన్ని. స్థలం కొనుక్కుని ఇల్లు కట్టుకునేంత ఆర్థిక స్తోమత లేదు. ఇంటి కోసమే ఎప్పుడూ ఆలోచించేదాన్ని. ఈ సమయంలోనే గత ఎన్నికల ముందు జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి స్థలంతో పాటు ఇల్లు ఇస్తామని మాట ఇచ్చారు. ఆయన గెలిచాక ఇచ్చిన మాట ప్రకారం నాకు ఇంటి స్థలం ఇచ్చారు. ఇల్లు కట్టుకునేందుకు నిధులు మంజూరు చేశారు. సబ్సిడీ ధరలకు నిర్మాణ సామగ్రి అందించారు. వాటికి నేను కూలి చేసుకుని దాచుకున్న డబ్బులు జతచేసి ఇల్లు కట్టుకున్నాను. మరో నెల రోజుల్లో గృహ ప్రవేశం చేసేందుకు సిద్ధం అవుతున్నాను. ఓ ఇంటికి యజమాని అయినందుకు చాలా ఆనందంగా ఉంది. ఒంటరి మహిళగా గుర్తించిన నాకు ప్రతినెలా పెన్షన్ వస్తోంది. వైఎస్సార్ చేయూత కింద ఏటా రూ.18,750 వంతున వచ్చింది. వైఎస్సార్ ఆసరా కింద మూడు విడతల్లో రూ.11,000 వచ్చింది. ఇప్పుడు నాలుగో విడత కూడా ఇస్తున్నారు. నా జీవనానికి ఇక ఢోకా లేదు.

– నానుపాత్రుని జయలక్ష్మి, తురకపేట
(సీపాన నాగభూషణరావు, విలేకరి, ఎల్.ఎన్.పేట)

కుటుంబ పోషణకు బెంగ లేదు



మాది రజక కుటుంబం. నేను పదిహేనేళ్లుగా ఇదే వృత్తిలో ఉన్నా. నాకు పదేళ్ల క్రితం పెళ్లయింది. ఇద్దరు కుమారులు. అంతంత మాత్రంగానే వచ్చే ఆదాయం కుటుంబ పోషణకే సరిపోవట్లేదు. పిల్లల చదువులు పెద్ద భారమయ్యాయి. మేము ఎలాగూ చదువుకోలేదు.. పిల్లలనైనా చదివిద్దాం అనే కల కలగానే మిగిలిపోతుందా అని భయపడేవాళ్లం. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ కల నిజం చేసుకునే అవకాశం వచ్చింది. మా కుటుంబానికి ఆర్థిక భరోసా లభించింది. జగనన్న చేదోడు పథకం కింద ఏటా రూ.10 వేలు వస్తోంది. విశాఖపట్నం జిల్లా అడవివరంలోని విజినిగిరిపాలెం గ్రామంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పిల్లలను చేర్పించాం. పెద్దోడు రెండో తరగతి, చిన్నోడు ఒకటో తరగతి చదువుతున్నారు. అమ్మ ఒడి పథకంలో నా భార్య ఖాతాలో ఏటా పదిహేను వేలు వంతున పడుతోంది. పిల్లల చదువుకి ఇబ్బంది తొలగిపోయింది. భవిష్యత్తులో నా పిల్లలు ఉన్నత చదువులు చదువుతారనే నమ్మకం కలుగుతోంది. మాకు ఒక పాత ఇల్లు ఉంది. అందుకే జగనన్న కాలనీ ఇంటికి దరఖాస్తు చేసుకోలేదు. నాలాగే చాలా మంది రజకుల జీవితాల్లో జగనన్న వెలుగులు నింపారు. ఆర్థిక భరోసా కల్పించారు. మళ్లీ ఆయనే సీఎం కావాలని నా ఆకాంక్ష.

– ఈగులవలస అప్పలరాజు, సింహాచలం
(అవసరాల గోపాలరావు, విలేకరి, సింహాచలం)

కిడ్నీ రోగానికి ఉచిత చికిత్స



చిన్న వయసులోనే దేవుడు అతి పెద్ద కష్టాన్నిచ్చాడు. నా వయసు 29 ఏళ్లు. నాకు ఇద్దరు కూతుళ్లు, ఓ కొడుకు. డిగ్రీ వరకు చదువుకున్నాను. అన్నమయ్య జిల్లా మదనపల్లె వీవర్స్ కాలనీకి చెందిన నా భర్త బొమ్మిశెట్టి రవి ప్రైవేట్ కంపెనీలో, నేను మణప్పురం ఫైనాన్స్‌లో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. గత ఏడాది ఫిబ్రవరిలో ఉన్నట్లుండి నాకు శ్వాస సమస్య తలెత్తింది. ఆస్పత్రికి వెళితే.. వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉంది.. పెద్దాస్పత్రికి వెళ్లాలన్నారు. బెంగళూరు బాప్టిస్ట్ హాస్పిటల్‌కు వెళ్లాం. అక్కడ డాక్టర్లు నా రెండు కిడ్నీలు పాడైపోయాయని, డయాలసిస్ చేయించుకోవాలని చెప్పి, వారం రోజుల తర్వాత డిశ్చార్జ్ చేశారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉండటంతో మదనపల్లెలోని చంద్రమోహన్ నర్సింగ్ హోంలో డయాలసిస్ చేయించుకుంటున్నాను. నా ఆర్థిక పరిస్థితి తెలుసుకుని ఆస్పత్రి వారే డయాలసిస్ పింఛన్‌కు దరఖాస్తు చేయించారు. నెల వ్యవధిలోనే పింఛన్ మంజూరైంది. గతేడాది ఏప్రిల్ నుంచి ప్రతి నెలా నాకు రూ.10 వేలు వంతున పింఛన్ వస్తోంది. జగనన్న ఇస్తున్న పింఛన్‌తోనే నా ఆరోగ్యానికి అవసరమైన మందులు, వైద్య చికిత్స చేయించుకుంటున్నాను. కిడ్నీ డోనర్ కోసం పోర్టల్‌లో రిజిస్టర్ చేయించాను. కష్టకాలంలో జగనన్న నా ప్రాణాలు కాపాడుతున్నారు. పెద్ద కూతురు యతిక ఒకటో తరగతి చదువుతోంది. అమ్మ ఒడి పథకం కింద రూ.15 వేలు సాయం అందుతోంది. జగనన్న ప్రభుత్వంలో అర్హత ఉన్న వారందరికీ సంక్షేమ ఫలాలు ఇంటి వద్దే అందించడం సంతోషంగా ఉంది.

– బొమ్మిశెట్టి వసుంధర, మదనపల్లె
(వంశీధర్ సూరమాల, విలేకరి, మదనపల్లె)

వెంకయ్యనాయుడు, చిరంజీవి 'విభూషణులు'

సాక్షి, న్యూఢిల్లీ/ సాక్షి నెట్‌వర్క్: తెలుగు ప్రముఖులను దేశ అత్యున్నత పౌర పురస్కారాలు వరించాయి. ప్రముఖ సినీ నటుడు కొణిదెల చిరంజీవి, మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడులకు దేశ రెండో అత్యున్నత పౌర పురస్కారమైన పద్మ విభూషణ్‌కు ఎంపిక చేసినట్టు కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రకటించింది. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా 2024 సంవత్సరానికిగాను మొత్తం 132 పద్మ పురస్కారాలను ప్రకటించారు. వీటిలో ఐదు పద్మ విభూషణ్, 17 పద్మభూషణ్, మిగతా 110 పద్మశ్రీ పురస్కారాలు ఉన్నాయి. ప్రఖ్యాత భరతనాట్య కళాకారిణి పద్మా సుబ్రమణ్యం, సామాజికవేత్త, సులభ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు బిందేశ్వర్ పాఠక్, అలనాటి బాలీవుడ్ నటి వైజయంతీమాల బాలిని కూడా పద్మ విభూషణ్ వరించింది. పద్మభూషణ్ ప్రకటించిన వారిలో

సుప్రీంకోర్టు తొలి మహిళా న్యాయమూర్తి ఫాతిమా బీవీ, సినీనటుడు విజయ్‌కాంత్, ప్రముఖ బాలీవుడ్ నటుడు మిథున్ చక్రవర్తి, నేపథ్య గాయని ఉషా ఉతుప్, ప్రముఖ బాలీవుడ్ సంగీత దర్శకుడు ప్యారేలాల్ శర్మ తదితరులున్నారు. వీరిలో ఫాతిమా, పాఠక్, విజయ్‌కాంత్ సహా 9 మందికి మరణానంతరం పురస్కారాలు దక్కాయి.

తెలంగాణ, ఏపీల నుంచి ఆరుగురికి..

తెలంగాణ నుంచి ఐదుగురికి, ఆంధ్రప్రదేశ్ నుంచి ఒకరికి పద్మశ్రీ పురస్కారాలు దక్కాయి. వీరిలో తెలంగాణ నుంచి బుర్రవీణ వాయిద్యకారుడు దాసరి కొండప్ప, చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్య, కూరెళ్ల విఠలాచార్య, కేతావత్ సోమ్‌లాల్, ఎ.వేలు ఆనందచారి, ఏపీ నుంచి హరికథా కళాకారిణి డి.ఉమా మహేశ్వరి ఉన్నారు. పద్మశ్రీ గ్రహీతల్లో 34 మందికి 'అన్‌సంగ్ హీరోస్' పేరిట పురస్కారం దక్కింది. క్రీడారంగం నుంచి టెన్నిస్ డబుల్స్ స్టార్ రోహన్ బోపన్న, స్క్వాష్ ప్లేయర్ జోష్నా చినప్ప, హాకీ క్రీడాకారుడు హర్బిందర్ సింగ్ సహా ఏడుగురికి పద్మశ్రీ లభించింది. పురస్కార గ్రహీతల్లో మొత్తం 30 మంది మహిళలున్నారు. దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్నను నాలుగేళ్ల విరామం అనంతరం బిహార్ దివంగత ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్‌కు మంగళవారం ప్రకటించడం తెలిసిందే.



విజయ్‌కాంత్



వైజయంతి మాల



పద్మా సుబ్రమణ్యం



ఉషా ఉతుప్

పద్మ అవార్డుల వివరాలివీ..

పద్మ విభూషణ్ (ఐదుగురికి): వైజయంతిమాల బాలి (కళారంగం-తమిళనాడు), కొణిదెల చిరంజీవి (కళారంగం-ఆంధ్రప్రదేశ్), ఎం.వెంకయ్యనాయుడు (ప్రజావ్యవహారాలు-ఆంధ్రప్రదేశ్), బిందేశ్వర్ పాఠక్ (సామాజిక సేవ-బిహార్), పద్మా సుబ్రమణ్యం (కళారంగం-తమిళనాడు).

పద్మభూషణ్ (17 మందికి): ఫాతిమా బీవీ (మరణానంతరం-ప్రజా వ్యవహారాలు-కేరళ), హోర్మూస్ జీ ఎన్.కామా (సాహిత్యం, విద్య, జర్నలిజం-మహారాష్ట్ర), మిథున్ చక్రవర్తి (కళారంగం-పశ్చిమబెంగాల్), సీతారాం జిందాల్ (వర్తకం-పరిశ్రమలు-కర్నాటక), యంగ్ లియు (వర్తకం-పరిశ్రమలు-తైవాన్), అశ్విన్ బాలచంద్ మెహతా (వైద్యం-మహారాష్ట్ర), సత్యబ్రత ముఖర్జీ (మరణానంతరం-ప్రజా వ్యవహారాలు-పశ్చిమ బెంగాల్), రాంనాయక్ (ప్రజా వ్యవహారాలు-మహారాష్ట్ర), తేజస్ మధుసూదన్ పటేల్ (వైద్యం-గుజరాత్), ఓలంచేరి రాజగోపాల్ (ప్రజా వ్యవహారాలు-కేరళ), దత్తాత్రేయ్ అంబాదాస్ మయలూ అలియాస్ రాజ్ దత్ (కళారంగం-మహారాష్ట్ర), తోగ్దన్ రింపోచే (ఆధ్యాత్మికత-లద్దాఖ్), ప్యారేలాల్ శర్మ (కళారంగం-మహారాష్ట్ర), చంద్రేశ్వర్ ప్రసాద్ ఠాకూర్ (వైద్యం-బిహార్), ఉషా ఉతుప్ (కళారంగం-మహారాష్ట్ర), విజయ్‌కాంత్ (మరణానంతరం-కళారంగం-తమిళనాడు), కుందన్ వ్యాస్ (సాహిత్యం, విద్య, జర్నలిజం-మహారాష్ట్ర)

– పద్మశ్రీ పురస్కారాలకు ఎంపికైన 110 మందిలో గోండా చిత్రకార దంపతులు శాంతిదేవీ పాశ్వాన్, శివన్ పాశ్వాన్ తదితరులున్నారు.

బాధ్యతను పెంచింది

దేశం అమృత కాలం దిశగా అభివృద్ధి పథంలో సాగుతున్న తరుణంలో ప్రకటించిన పద్మ విభూషణ్ పురస్కారాన్ని వినమ్రంగా స్వీకరిస్తున్నా. ఇది నా బాధ్యతను మరింతగా పెంచింది. రైతులు, యువత, మహిళలు సహా నవభారత నిర్మాణంలో భాగస్వాములవుతున్న ప్రతి ఒక్కరికీ పురస్కారాన్ని అంకితం చేస్తున్నా.

– ఎం.వెంకయ్యనాయుడు, మాజీ ఉప రాష్ట్రపతి

పరిచయం అక్కర్లేని పేరు.. వాగ్ధాటికి మారుపేరు.. వెంకయ్య

ముప్పవరపు వెంకయ్యనాయుడు.. దేశ రాజకీయాల్లో పరిచయం అక్కర్లేని పేరు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో కాషాయ దళంలో వివిధ హోదాల్లో పనిచేశారు. వెంకయ్య భారతీయ జనతా పార్టీ అగ్రనేతల్లో ఒకరు. విద్యార్థి సంఘం నేత నుంచి దేశ ఉప రాష్ట్రపతి వరకు ఎదిగిన బీజేపీ నేత. లా చదివిన ఆయన అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. అనేక విషయాలపై లోతైన పరిజ్ఞానం, చక్కటి వాగ్ధాటి ఆయన సొంతం. చట్ట సభల్లోనైనా, సమావేశాల్లోనైనా చమత్కారాలతో, ప్రాసలు, చక్కటి విశేషణాలతో అందరినీ ఆకట్టుకొనే వెంకయ్యనాయుడు.. దేశవ్యాప్తంగా పేరెన్నికగన్న నేత.

1949లో జననం

వెంకయ్యనాయుడు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం చవటపాళెంలో రంగయ్యనాయుడు, రమణమ్మ దంపతులకు 1949 జూలై 1వ తేదీన జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం నెల్లూరు జిల్లాలోనే జరిగింది. నెల్లూరులోని వీఆర్ కళాశాల నుంచి పొలిటికల్ సైన్స్‌లో బీఏ పట్టా పొందారు. తర్వాత విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ నుంచి బీఎల్ పూర్తి చేసి లా పట్టా అందుకున్నారు. వెంకయ్యకు భార్య ఉష, కుమారుడు హర్ష, కుమార్తె దీప ఉన్నారు.

విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లోకి

వ్యవసాయ కుటుంబంలో పుట్టిన వెంకయ్యవిద్యార్థి దశ నుంచే రాజకీయాలకు ఆకర్షితులయ్యారు. ఆర్‌ఎస్‌ఎస్ స్వయం సేవక్‌గా పనిచేశారు. అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ)లో చేరి నెల్లూరు వీఆర్ కాలేజీలో, ఏయూలోనూ విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. 1972 జైఆంధ్రా ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశారు. జైలుకు కూడా వెళ్లి వచ్చారు. విజయవాడ, నెల్లూరులో అనేక ఉద్యమాలు చేపట్టారు. 1978లో తొలిసారిగా ఏపీ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఉదయగిరి నియోజకవర్గం నుంచి 2 సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 1980 నుంచి 1983 వరకు బీజేపీ అఖిల భారత యువజన సంఘం ఉపాధ్యక్షుడిగా సేవలందించారు.

1988 నుంచి 1993 వరకు ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడిగా పనిచేసిన వెంకయ్య.. తర్వాత పార్టీలో వివిధ హోదాల్లో పనిచేసి 1998 ఏప్రిల్‌లో కర్ణాటక నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. పలు పార్లమెంటరీ బోర్డుల్లో సభ్యునిగా, చైర్మన్‌గా పనిచేశారు. 2000 సెప్టెంబర్ నుంచి 2002 జూన్ వరకు కేంద్రంలోని వాజ్‌పేయి ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా సేవలందించారు. 2002 జూలైలో బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నియమితులై 2004 అక్టోబర్ వరకు ఆ పదవిలో కొనసాగారు. 2014లో నరేంద్ర మోదీ కేబినెట్‌లో పట్టణాభివృద్ధి శాఖ, సమాచార, ప్రసారాల శాఖల మంత్రిగా నియమితులయ్యారు.

ఉపరాష్ట్రపతిగా..

వెంకయ్యనాయుడు 2017లో ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. యూపీఏ అభ్యర్థి గోపాలకృష్ణ గాంధీపై విజయం సాధించి దేశ 13వ ఉపరాష్ట్రపతి పదవినలంకరించారు. 2022 ఆగస్టు 10వ తేదీ వరకు ఉపరాష్ట్రపతిగా ఉన్నారు. ఉప రాష్ట్రపతి హోదాలో రాజ్యసభ చైర్మన్‌గా మెప్పించారు.

సమాజ సేవలో..

రాజకీయాల్లో ఉన్నత శిఖరాలను అందుకున్న వెంకయ్యనాయుడు సామాజిక కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంటున్నారు. స్వర్ణభారత్ ట్రస్ట్ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎంత ఉన్నత పదవిలో ఉన్నా, తరచూ తెలుగు రాష్ట్రాలకు వచ్చి సేవా కార్యక్రమాల్లో పాల్గొనే వారు. ఉపరాష్ట్రపతి పదవీ కాలం ముగిసిన అనంతరం మరింత చురుగ్గా సామాజిక సేవలో పాల్గొంటున్నారు.

మెగా విభూషణ్

సాక్షి, హైదరాబాద్: మెగాస్టార్ చిరంజీవి కీర్తికిరీటంలో ఇప్పుడు పద్మవిభూషణ్ చేరింది. సినిమాకి చేస్తున్న సేవలను గుర్తించి 2006లో కేంద్ర ప్రభుత్వం ఆయనకు 'పద్మభూషణ్' పురస్కారాన్నివ్వగా.. ఇప్పుడు 'పద్మవిభూషణ్' ప్రకటించింది. ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా సాధారణ నటుడిగా తెలుగు తెరకు పరిచయమై, తెలుగు సినీ తెరపై ఇంతవరకు ఎదిగిన ఈ 'మెగా విభూషణ్' చిరంజీవి ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరులో 1955 ఆగస్టు 22న జన్మించారు. అసలు పేరు కొణిదెల శివశంకర వరప్రసాద్. సినిమాల్లోకి వచ్చాక చిరంజీవిగా మార్చుకున్నారు.

పునాది రాళ్లతో పునాది.. స్వయంకృషితో 'నంది'

1978 ఫిబ్రవరి 11న 'పునాది రాళ్ళు' చిత్రం చిరంజీవి నటనకు పునాది పడింది. కె. విశ్వనాథ్ దర్శకత్వంలో చేసిన 'స్వయంకృషి' (1987) సినిమాతో చిరంజీవి ఉత్తమ నటుడిగా తొలి నంది పురస్కారం అందుకున్నారు. 'ఆపద్బాంధవుడు' (1992), 'ఇంద్ర' (2002) చిత్రాలకూ నంది అవార్డులు అందుకున్నారాయన. 'రఘుపతి వెంకయ్య'(2016) అవార్డు అందుకున్నారు. 2006లో ఆంధ్రా యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.

తొమ్మిదేళ్ల తర్వాత... రీ ఎంట్రీలోనూ మెగా స్టార్‌డమ్

'శంకర్‌దాదా జిందాబాద్' (2007) సినిమా తర్వాత రాజకీయాల్లోకి వెళ్లి తొమ్మిదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత 'ఖైదీ నంబర్ 150' (2017) సినిమాతో హీరోగా రీ-ఎంట్రీ ఇచ్చి సూపర్ హిట్ అందుకున్నారు. ప్రస్తుతం 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో 'విశ్వంభర' సినిమాలో నటిస్తూ బిజీగా ఉన్నారు.

సేవా కార్యక్రమాల్లోనూ...

'చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్' ద్వారా 'చిరంజీవి బ్లడ్ బ్యాంక్', 'చిరంజీవి ఐ బ్యాంక్' ఏర్పాటు చేసి, సేవలందిస్తున్నారాయన.

అక్కినేని తర్వాత చిరుకే

తెలుగు సినీరంగంలో పద్మవిభూషణ్ అవార్డును ఇప్పటివరకు అందుకున్న ఒకే ఒక్క నటుడు దివంగత అక్కినేని నాగేశ్వరరావు కాగా, ఇప్పుడు ఆ అత్యున్నత పురస్కారం చిరంజీవికి దక్కింది.

ఈ గౌరవం మీది: చిరంజీవి

''పద్మ విభూషణ్ అవార్డు వచ్చిందని తెలిసిన క్షణంలో నిజంగా ఏ మాట్లాడాలో.. ఎలా రియాక్ట్ అవ్వాలో తెలియని పరిస్థితి. మన దేశంలోని రెండో అత్యున్నత పురస్కారం 'పద్మ విభూషణ్' వచ్చినందుకు నిజంగా నాకు చాలా సంతోషంగా ఉంది. ఒక తల్లి కడుపున పుట్టకపోయినా నన్ను తమ సొంత మనిషిలా, మీ అన్నయ్యగా, మీ బిడ్డగా భావించే కోట్లాది మంది ఆశీస్సులు, నా సినీ కుటుంబం అండదండలు, నీడలా నాతో ప్రతి నిమిషం నడిచే లక్షలాది మంది అభిమానుల ప్రేమ, ఆదరణ కారణంగానే నేను ఈ రోజు ఈ స్థితిలో ఉన్నాను. అందుకే నాకు దక్కినటువంటి ఈ గౌరవం మీది. ఈ పురస్కారానికి ఎంపిక చేసిన భారత ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి నా హృదయపూర్వక కృతజ్ఞతలు'' అని చిరంజీవి స్పందించారు.

ఎంతో ఆనందంగా ఉంది..

- 'పద్మ' పురస్కారంపై హరికథ కళాకారిణి దాలిపర్తి ఉమామహేశ్వరి
- కృష్ణాజిల్లా మచిలీపట్నంలో ఓనమాలు

సాక్షి, మచిలీపట్నం/సాక్షి, న్యూఢిల్లీ: స్వర మహేశ్వరిగా పేరు తెచ్చుకున్న ఉమామహేశ్వరి (63) సంస్కృతంలో హరికథ చెప్పిన తొలి మహిళా భాగవతారిణి. కృష్ణాజిల్లా మచిలీపట్నానికి చెందిన ఈమె హరికథను చెప్పడంలో ఎన్నో విశిష్టతలు కలిగి ఉండడంతో కేంద్ర ప్రభుత్వం 'పద్మశ్రీ'తో సముచిత గౌరవం ఇచ్చి ఎంపికచేసింది. చిన్నప్పుడు సరదాగా నేర్చుకున్న 'కుమార సంభవం' కథే ఇప్పుడు దేశ అత్యుత్తమ పురస్కారానికి ఎంపికయ్యేలా చేసింది. ఈమె సావిత్రి, భైరవి, శుభపంతువరాలి, కేదారం, కళ్యాణి వంటి కథలను వివిధ రాగాల్లో చెప్పడంలో దిట్ట. నాన్న లాలాజీరావు నాదస్వర విద్వాంసుడు కావడం, అమ్మ సరోజినికి సంగీతంలో ప్రావీణ్యం ఉండడంతో చిన్నప్పటి నుంచే కళా రంగాన్ని ఎంచుకున్న ఉమామహేశ్వరి రాష్ట్రం గర్వపడేలా ఎదిగారు. ఈమె ప్రఖ్యాత నాదస్వర విద్వాన్ దివంగత దాలిపర్తి పిచ్చిహరి మనవరాలు కూడా. ప్రస్తుతం హైదరాబాదులో ఉంటున్నా.. ఓనమాలు మాత్రం బందరులో నేర్చుకోవడంతో జిల్లా కళాకారులు, ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. త్వరలో రాష్ట్రపతి చేతులు మీదుగా పద్మశ్రీ అందుకోనున్న ఉమామహేశ్వరి తనను అవార్డు వరించడంపై స్పందించారు. ఆమె ఏమన్నారంటే..



భర్త కళాకృష్ణతో ఉమామహేశ్వరి

సరదాగా నేర్చుకున్న కథే ఈ స్థాయికి చేర్చింది:

14వ ఏట హరికథకు జీవితం అంకితం చేశాను. అలా సరదాగా మహాకవి కాళిదాసు సంస్కృతంలో రచించిన కుమార సంభవంను నేర్చుకున్నాను. ఆ తర్వాత నేను ఎన్నో ప్రదర్శనలిచ్చాను. పదికిపైగా సంస్కృతం, 25కి పైగా తెలుగులో హరికథలు నేర్చుకున్నాను. దేశ, విదేశీ కళాకారుల నుంచి పురస్కారాలు అందుకున్నాను. గత ఏడాది ఫిబ్రవరిలో ప్రతిష్టాత్మక సంగీత్ నాటక్ అకాడమీ పురస్కారాన్ని అందుకున్నాను. ఇవికాక.. యూనివర్సిటీలు, రాష్ట్ర స్థాయిలో ఎన్నో పురస్కారాలు అందుకున్నాను. 1993లో హార్వర్డ్ యూనివర్సిటీలో ఇంటర్నేషనల్ వేదిక్ కాన్ఫరెన్స్ జరిగితే హాజరై సంస్కృతంలో హరికథ చెప్పి ప్రశంసలు పొందాను. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించడం ఎంతో ఆనందంగా ఉంది. ప్రస్తుతం నాట్యకారుడు, భర్త కళాకృష్ణతో హైదరాబాదులోని బేగంపేటలో ఉంటున్నాం. అమ్మానాన్నలు మరణించాక మచిలీపట్నంకు రావడంలేదు. మేం ఇక్కడ ఉంటున్నా నన్ను ఈ స్థాయికి చేరేలా ఓనమాలు దిద్దించిన బందరు అంటే ప్రేమే.

వెంకయ్య, చిరంజీవిలకు సీఎం అభినందనలు

సాక్షి, అమరావతి: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సినీనటుడు చిరంజీవికి పద్మవిభూషణ్ అవార్డులను కేంద్రం ప్రకటించడంపై సీఎం జగన్ హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో 'పద్మ' అవార్డులను దక్కించుకున్న ఉమామహేశ్వరి (ఏపీ), తెలంగాణకు చెందిన గడ్డం సమ్మయ్య, దాసరి కొండప్ప, విఠలాచార్య, ఆనందచారిలను సీఎం అభినందించారు.

సీఎం జగన్ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ గణతంత్ర దినోత్సవం నాడు మన రాజ్యాంగకర్తలను స్మరించుకుందామని పేర్కొన్నారు. అలాగే.. రాజ్యాంగ కర్తల బాటలో నడిచి దేశ అభ్యున్నతికి కృషి చేద్దామని ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.

నేడు సీఎం వైఎస్ జగన్ విజయవాడ పర్యటన

సాక్షి, అమరావతి: సీఎం జగన్ శుక్రవారం విజయవాడలో పర్యటించనున్నారు. ఉదయం 8.50 గంటలకు తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియానికి చేరుకుంటారు. గణతంత్ర దినోత్సవంలో పాల్గొన్న అనంతరం తాడేపల్లిలోని తన నివాసానికి చేరుకుంటారు. సాయంత్రం 4.15 గంటలకు రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆతిథ్యం ఇచ్చే హై టీ కార్యక్రమంలో పాల్గొంటారు.

రేపు విశాఖ జిల్లా భీమిలిలో పర్యటన

సీఎం జగన్ శనివారం విశాఖ జిల్లా భీమిలిలో పర్యటించనున్నారు. వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజియన్ బహిరంగ సభలో పాల్గొంటారు. ఇందుకోసం సీఎం శనివారం మధ్యాహ్నం 1.45 గంటలకు తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి భీమిలి నియోజకవర్గం సంగివలసలో జరిగే వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజియన్ బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం తాడేపల్లికి చేరుకుంటారు.

ఈ నెల 31న కేబినెట్ భేటీ

బడ్జెట్ సమావేశాలతో పాటు పలు కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకునే అవకాశం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఈ నెల 31న ఉదయం 11 గంటలకు రాష్ట్ర సచివాలయంలో మంత్రి మండలి సమావేశం జరగనుంది. ఈ విషయాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్.జవహర్‌రెడ్డి అన్ని శాఖల కార్యదర్శులకు తెలియజేశారు. ఈ సమావేశానికి తీసుకెళ్లాల్సిన ప్రతిపాదనలను 29వ తేదీ ఉదయం 11 గంటలకల్లా సాధారణ పరిపాలన(కేబినెట్) విభాగానికి పంపించాలని అన్ని శాఖల అధికారులను సీఎస్ ఆదేశించారు. త్వరలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ అంశంపై మంత్రి మండలిలో చర్చించడంతో పాటు అసెంబ్లీ సమావేశాలు ఎప్పుడు నిర్వహించాలనే అంశంపై నిర్ణయం తీసుకునే అవకాశముంది. అలాగే పలు కీలక అంశాలపై కూడా మంత్రి మండలిలో చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

ఇదండీ సంగతి



ఎలాగూ వాళ్లు కదలిరారు కానీ వాళ్ల ఇళ్ల దగ్గరికే మనం కదలి వెళ్దాం సార్!

త్వరలో ఆక్వాటిక్ క్వారంటైన్ ఫెసిలిటీ సెంటర్

- బంగారమ్మపేట వద్ద రూ.36.55 కోట్లతో నిర్మాణం
- ఖరారైన టెండర్లు... త్వరలోనే పనులు ప్రారంభం

సాక్షి, అమరావతి: నాణ్యమైన సీడ్ కోసం నానా తంటాలు పడుతున్న రాష్ట్ర ఆక్వా రైతుల కష్టాలు త్వరలో తీరనున్నాయి. దిగుమతి చేసుకున్న తల్లి రొయ్యలు, చేపలు, పీతల (బ్రూడర్స్) పరీక్షలకు చెన్నై వెళ్లి, రోజుల తరబడి వేచి ఉండటం, భారీగా ఖర్చు చేసుకోవాల్సిన అవసరం ఇకపై ఉండదు. ఆక్వా రైతుల మేలు కోరిన రాష్ట్ర ప్రభుత్వం విశాఖ జిల్లా నక్కపల్లి మండలం బంగారమ్మపేట వద్ద ఏర్పాటు చేస్తున్న ఆక్వాటిక్ క్వారంటైన్ ఫెసిలిటీ సెంటర్ (ఏక్యూఎఫ్‌సీ) త్వరలో అందుబాటులోకి రానుంది. విదేశాల నుంచి తల్లి రొయ్యలు, చేపలు, పీతల (బ్రూడర్స్)ను పరీక్షించే ఈ కేంద్రం దేశంలోనే రెండోది. ఇప్పటివరకు దేశంలో చెన్నైలో మాత్రమే ఈ ఫెసిలిటీ సెంటర్ ఉంది. రూ. రూ.36.55కోట్ల అంచనాతో 30 ఎకరాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న బంగారమ్మపేట ఏక్యూఎఫ్‌సీ టెండర్లు ఇటీవలే ఖరారయ్యాయి. వచ్చే నెలలో పనులు ప్రారంభించి, ఆగస్టుకల్లా అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ కేంద్రం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.23 కోట్లు విడుదల చేసింది.

సకాలంలో క్వారంటైన్ చేయకపోవడంతో

రొయ్య, చేప, పీతల సీడ్ నాణ్యమైనది దొరికితేనే పంట దిగుబడి బాగుంటుంది. యానిమల్ ఇంపోర్ట్ యాక్ట్-1898 ప్రకారం విదేశాల నుంచి ఏ రకం లైవ్ స్టాక్ (జీవాల)ను దిగుమతి చేసుకున్నా, వాటి ద్వారా వాటి సంతతికి, మానవాళికి, ఇతర జీవ రాశులకు రోగాలు సోకవని నిర్ధారించుకునేందుకు వాటిని క్వారంటైన్ చేయాలి. ఆర్గనైజేషన్ ఫర్ ఇంటర్నేషనల్ ఎపిడ్యూజిస్ (ఓఐఈ) గుర్తించిన 8 రకాల వ్యాధులు లేవని నిర్ధారించుకున్న తర్వాతే వాటిని బ్రూడర్స్ నుంచి సీడ్ ఉత్పత్తికి అనుమతించాలి. వ్యాధులు లేవని నిర్ధారించే పరీక్షలు నిర్వహించే కేంద్రమే ఈ ఏక్యూఎఫ్‌సీ. దేశం మొత్తమ్మీద చెన్నైలో మాత్రమే క్వారంటైన్ కేంద్రం ఉండటంతో ఏపీ సహా దేశంలోని ఆక్వా హేచరీలన్నీ ఈ కేంద్రానికి క్యూ కట్టాల్సిందే. ఇక్కడ 400 తల్లి రొయ్యలను ఒక క్యారంటైన్ క్యూబికల్‌లో ఉంచి ఐదారు రోజులు పరీక్షలు నిర్వహిస్తారు. ఒక క్యూబికల్‌కు డిమాండ్‌ను బట్టి రూ.35 వేల- రూ.1.50 లక్షల వరకు వసూలు చేస్తారు. సకాలంలో క్వారంటైన్ పూర్తి కాదు. క్వారంటైన్ అయిన బ్రూడర్స్ నుంచి సకాలంలో సీడ్ ఉత్పత్తి చేయలేకపోవడంతో సీజన్‌లో రైతులకు నాణ్యమైన సీడ్ దొరకడంలేదు. దళారీల ఉచ్చు లో పడి నాసిరకం సీడ్‌తో రైతులు నష్టాల పాలవుతున్నారు.

ఏటా 1.25 లక్షల బ్రూడర్స్‌ను పరీక్షించే సామర్థ్యం

దేశవ్యాప్తంగా 560 హేచరీలుండగా వాటిలో 429 హేచరీలు ఏపీలోనే ఉన్నాయి. ఏటా సింగపూర్, హవాయ్, ఫ్లోరిడా తదితర ప్రాంతాల నుంచి 1.50 లక్షల బ్రూడర్స్‌ను ఇవి దిగుమతి చేసుకుంటాయి. వీటి నుంచి ఏటా 65 మిలియన్ సీడ్ ఉత్పత్తి జరుగుతోంది. మరో 10 వేల నుంచి 15 వేల మిలియన్ సీడ్‌ను పొరుగు రాష్ట్రాల నుంచి కొనాల్సి వస్తోంది. దిగుమతి చేసుకునే బ్రూడర్స్ క్వారంటైన్‌కు చెన్నై కేంద్రం వద్ద నెలల తరబడి పడి గాపులు పడాల్సిందే. ఇందుకోసం ఏటా రూ.కోట్లలో ఖర్చు చేస్తుంటారు. సకాలంలో క్వారంటైన్ చేయించుకోలేక, నాణ్యమైన సీడ్ దొరక్క రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం బంగారమ్మపేట వద్ద ఏక్యూఎఫ్‌సీ ఏర్పాటు చేస్తోంది. ఏటా 1.25 లక్షల బ్రూడర్స్‌ను పరీక్షించే సామర్థ్యం ఈ కేంద్రానికి ఉంటుంది. ఈ కేంద్రంతో పాటు పండుగప్ప, పసుపు పీతల హేచరీల కోసం 73 పోస్టులను కూడా ప్రభుత్వం మంజూరు చేసింది.

రైతులకు ఎంతో మేలు..

ఆక్వా ఉత్పత్తుల్లో దేశంలోనే నంబర్ 1గా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా రంగ సుస్థిరతకు ఆక్వాటిక్ క్వారంటైన్ ఫెసిలిటీ సెంటర్ చాలా కీలకమైనది. ఈ సెంటర్ అందుబాటులోకి వస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఇటీవలే టెండర్లు ఖరారు చేశాం. వచ్చే నెలలో పనులు ప్రారంభిస్తాం. సాధ్యమైనంత త్వరగా ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొస్తాం.

– కూనపురెడ్డి కన్నబాబు, కమిషనర్, మత్స్య శాఖ

క్లుప్తంగా...

టీడీపీ నుంచి టీడీపీలోకే చేరికలు!

అభాసుపాలైన డోన్ టీడీపీ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి



పార్టీ కండువా కప్పి టీడీపీలో లక్ష్మీనారాయణను చేర్చుకుంటున్న ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్: తమ కాళ్లకు తామే మొక్కుకొని సంబరాలు చేసుకున్న విధంగా ఉంది టీడీపీ నాయకుల పరిస్థితి. నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి టీడీపీ కార్యకర్తలకే మళ్లీ తమ పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీ వర్గీయులుగా ప్రచారం చేసుకుంటూ అభాసుపాలయ్యారు. నియోజకవర్గంలోని కోట్ల, కేఈ వర్గీయులు.. ధర్మవరం సుబ్బారెడ్డితో కలవడం లేదు. దీంతో వారిని రకరకాల ప్రలోభాలతో దగ్గర చేసుకునేందుకు సుబ్బారెడ్డి ప్రయత్నిస్తున్నారు. అలా వచ్చిన వారికి మళ్లీ పసుపు కండువాలు కప్పి.. వారంతా వైఎస్సార్‌సీపీ వర్గీయులంటూ సుబ్బారెడ్డి ప్రచారం చేసుకుంటున్నారు. ఇదేవిధంగా గురువారం టీడీపీ కార్యకర్త లక్ష్మీనారాయణకు మళ్లీ పసుపు కండువా కప్పి పార్టీలోకి చేర్చుకోవడంతో స్థానిక నాయకులు, కార్యకర్తలు ఆశ్చర్యపోయారు.

వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్‌పై దాడికి యత్నం

- టీడీపీ, జనసేన నేతల దాష్టీకం
- కొరిటెపాడులో పోలీసు పికెటింగ్ ఏర్పాటు

గుంటూరు ఈస్ట్: కొరిటెపాడు సాకేత్‌పురం జెండా చెట్టు సెంటర్‌లో గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్న స్థానిక వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ వంగల హేమలత, ఆమె భర్త వలివీరారెడ్డి, మరికొంత మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై గురువారం రాత్రి పెద్ద సంఖ్యలో జనసేన, టీడీపీ నేతలు, కార్యకర్తలు దాడికి యత్నించారు. దీంతో అక్కడ పెద్ద ఎత్తున ఉద్రిక్తత చోటు చేసుకుంది. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు గణతంత్ర వేడుకలకు ఫ్లెక్సీని ఏర్పాటు చేయడంతోపాటు, జాతీయ జెండాను ఏర్పాటు చేస్తున్నారు. జనసేన నాయకులు బోనబోయిన శ్రీనివాసయాదవ్, గాదె వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు నాని, మద్దిరాల మ్యాని, సుమారు 200 మంది కార్యకర్తలు, పార్టీ జెండాలు పట్టుకుని నినాదాలు చేస్తూ జెండా చెట్టు సెంటర్‌కు వచ్చారు. ఆప్రాంతంలో జనసేన ఫ్లెక్సీని ఉంచాలంటూ వివాదానికి దిగారు. ఇరువర్గాలు పెద్ద ఎత్తున నినాదాలు చేశాయి. సమాచారం అందుకున్న వెస్ట్ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను అదుపు చేశారు. పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు.

చంద్రబాబుకు దళితులంటే చులకన

మంత్రి ఆదిమూలపు సురేష్



టంగుటూరు: ప్రతిపక్షనేత చంద్రబాబుకు దళితులంటే చులకన భావమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మండిపడ్డారు. చంద్రబాబు చేసిన 'చెత్త' వ్యాఖ్యలపై టంగుటూరులో వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశంలో మంత్రి ఘాటుగా స్పందించారు. దళిత మంత్రినైన తనను చెత్త అంటూ కించపరిచే వ్యాఖ్యలు చేయడం చంద్రబాబు నైజాన్ని ప్రతిబింబిస్తున్నదన్నారు. ఎవరు చెత్తో.. ఎవరు బంగారమో రానున్న ఎన్నికల్లో ప్రజలు నిర్ణయిస్తారని చెప్పారు. దళితులకు ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు ఇస్తానని నమ్మించి మోసం చేసిన ఘనుడు చంద్రబాబు అని దుయ్యబట్టారు. 70 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు ఉన్నతమైన పదవులు ఇచ్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. చంద్రబాబు కుమారుడు లోకేశ్ మంగళగిరి మాలోకం, బాబు స్థానిక నియోజకవర్గాల్లోనే పోటీ చేస్తున్నారా అని మంత్రి సురేష్ ప్రశ్నించారు.

జనసేన సభ్యత్వం స్వీకరించిన కొణతాల

సాక్షి,అమరావతి: మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ జనసేన పార్టీ సభ్యత్వం స్వీకరించారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సమక్షంలో సభ్యత్వ నమోదు ప్రక్రియను పూర్తి చేశారు.

ఒక పార్లమెంట్, 13 అసెంబ్లీ స్థానాల్లో పోటీ

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



అనకాపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోని 13 అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానంలో తమ పార్టీ పోటీ చేయనుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బి.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. టీడీపీ, వైఎస్సార్‌సీపీలను ఓడించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఎవరికి వారే.. 'బాపట్ల' తీరే!

బాపట్ల తెలుగుదేశం పార్టీలో ఐక్యత కొరవడింది. వర్గపోరుతో అట్టుడికిపోతోంది. ఏ నియోజకవర్గం చూసినా ఏమున్నది గర్వకారణం అన్నట్టు ప్రతి చోటా తమ్ముళ్ల తగవులాటే కనిపిస్తోంది. జిల్లా కేడర్ ఎవరికివారే యమునాతీరే అన్నట్టు వ్యవహరిస్తోంది. కారంచేడులో సొంత పార్టీ ఫ్లెక్సీలనే కార్యకర్తలు చింపేయడం... ఎమ్మెల్యేపై దూషణల పర్వానికి దిగడం... అధిష్టానానికి మింగుడుపడటం లేదు. చీరాలలో కొండయ్య నాయకత్వాన్ని బహిరంగంగానే వ్యతిరేకించడం... వేమూరులో ఓ వర్గానికి నక్కా కొమ్ముకాయడం... బాపట్ల ఇన్‌చార్జి రోజుకో నాయకుడ్ని వెనకేసుకు రావడం... అక్కడి కార్యకర్తలకు రుచించడం లేదు. రేపల్లె... అద్దంకిలో ఇంటిపోరు తీవ్రరూపం దాల్చడం అధినాయకత్వాన్ని ఇరకాటంలో పడేస్తోంది.

జిల్లా వ్యాప్తంగా తెలుగు తమ్ముళ్ల తగవులాట.. పచ్చ పార్టీని వేధిస్తున్న ఇంటిపోరు



సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఎన్నికల వేళ పచ్చపార్టీలో వర్గ విభేదాలు భగ్గుమంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆ పార్టీ ముఖ్యనేతలు రెండు వర్గాలుగా విడిపోయారు. ఒకరంటే మరొకరికి గిట్టక వెన్నుపోట్లకు సిద్ధపడుతున్నారు. ఆధిపత్య పోరుతో అమీతుమీకి సిద్ధపడుతున్నారు. రేపల్లెలో సొంత పార్టీనేతనే ఏకంగా హత్య చేసిన ఘటన జరగ్గా మిగిలిన నియోజకవర్గాల్లో తమ్ముళ్ల మధ్య వర్గ విభేదాలు ముదిరి ఘర్షణలకు దిగిన ఘటనలు కోకొల్లలు.

'ఏలూరి' తీరుపై కేడర్ విసుగు

పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తీరుపై కేడర్ విసిగెత్తిపోతోంది. ఇటీవల కారంచేడులో మండల టీడీపీ నేతలు వర్గాలుగా విడిపోయి సొంతపార్టీ ఫ్లెక్సీలనే చింపేసి, ఎమ్మెల్యేపై దూషణలకు దిగారు. పోపూరి శ్రీనివాసరావు, ద్రోణాల దరణి, ఇంకొల్లులో పార్టీ సీనియర్ నేత కొల్లూరు నాయుడమ్మ ఎమ్మెల్యే తీరుపై అసంతృప్తితో ఉన్నారు. గతంలో టీడీపీ అధికారంలోకి రావాలని ఈయన తిరుపతి వరకూ వెనక్కు నడిచారు. ఇప్పుడు ఆయనే వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు.

కొండయ్యా... ఏందయ్యా ఇది?

చీరాల టీడీపీ ఇన్‌చార్జ్ ఎం.ఎం.కొండయ్యను ఆ పార్టీ నేతలు వ్యతిరేకిస్తున్నారు. ఆయన్ను మార్చాలని చంద్రబాబు, లోకేశ్‌లకు ఫిర్యాదు చేస్తున్నారు. మంగళగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ కాంద్రు శ్రీనివాసరావు, చీరాలకు చెందిన డాక్టర్ సజ్జా హేమలత, సజ్జా వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి పాలేటి రామారావు తదితరులు ఇక్కడ టీడీపీ టికెట్ ఆశిస్తున్నారు. పట్టణ పార్టీ మాజీ అధ్యక్షుడు డేటా నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొడుగుల గంగరాజుతో పాటు పలువురు నేతలు, కార్యకర్తలు కొండయ్యను వ్యతిరేకిస్తున్నవారిలో ఉన్నారు. మరోవైపు తమ వర్గానికి కాకుండా వేరొకరికి టికెట్ ఇస్తే తాము సహకరించేది లేదని యాదవ సామాజికవర్గం తేల్చి చెబుతోంది.

'నక్కా'నూ... పక్కన పెట్టేస్తారా?

వేమూరు నియోజకవర్గంలో అన్ని మండలాల్లోనూ టీడీపీలో అంతర్గత పోరు నడుస్తోంది. వేమూరు మండల టీడీపీ అధ్యక్షుడు దండె సుబ్బారావు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ జొన్నలగడ్డ విజయబాబుల మధ్య విభేదాలున్నాయి. కొల్లూరు మండలంలో మాజీ ఎంపీపీ మైనేని మురళి, మధుసూదనరావుకు, అమృతలూరులో మాజీ ఎంపీపీ మైనేని రత్నప్రసాద్, మాజీ జెడ్పీటీసీ చరణ్‌గిరి, భట్టిప్రోలులో మాజీ ఎంపీపీ తూనుగుంట్ల సాయిబాబు, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కరణ శ్రీనివాసరావు మధ్య వర్గపోరు నడుస్తోంది. ఈ మండలాలన్నింట్లో ఓ వర్గానికి ఆనందబాబు కొమ్ముకాయడంతో రెండో వర్గం ఆయనకు దూరంగా ఉంటోంది.

'వేగేశన'తో వేగలేం !

బాపట్ల నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ వైఖరి నచ్చక అన్నం సతీష్ ప్రభాకర్ దూరంగా ఉంటున్నారు. పైగా ఈయన హయాంలో పట్టణ పార్టీ అధ్యక్షునిగా నియమించిన తానికొండ దయాబాబును తొలగించి వడ్లమూడి వెంకటేశ్వరరావును నియమించడం, తర్వాత ఆయన్నూ తొలగించి గోలపల శ్రీనివాసరావును నియమించడం, సతీష్ మండల పార్టీ అధ్యక్షుడిగా నియమించిన కావూరి శ్రీనివాసరెడ్డిని తొలగించి ముక్కాముల శివను నియమించడంపై కేడర్ గుర్రుగా ఉంది. వీరే గాకుండా బాపట్ల మాజీ ఎంపీపీ మానం విజేత, వడ్లమూడి వెంకటేశ్వరరావు, ముక్కాముల శివ, గొలపల శ్రీను, నక్కల వెంకటస్వామి, ఏపూరి భూపతిరావు, కర్లపాలెం మండలంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పమిడి భాస్కరరావు, మాజీ జెడ్పీటీసీ గుంపులకన్నయ్య, మైనారిటీ సెల్ మాజీ మండల అధ్యక్షుడు మహ్మద్ హాజీజుల్లాబేగ్, పార్టీ అధ్యక్షుడు వసంతారెడ్డితో కూడిన ఒక వర్గం వర్మను వ్యతిరేకిస్తోంది. కర్లపాలెం మండల పార్టీ అధ్యక్షుడిగా ఉన్న నక్కల వెంకటస్వామిని తొలగించి ఏపూరి భూపతిరావును నియమించడం, పిట్టలవానిపాలెం మండల పార్టీ అధ్యక్షుడిగా ఉన్న గోకరాజు శ్రీధర్‌వర్మ స్థానంలో కనుమూరి సాంబమూర్తిరాజును నియమించడం, కొన్నాళ్ళ తర్వాత మహ్మద్ అబ్దుల్‌ను నియమించడంతో అక్కడ అసంతృప్తి నెలకొంది.

'అన్నే' మరణం.. 'అనగాని'కి శరాఘాతం..

రేపల్లె పట్టణానికి చెందిన 14వ వార్డు కౌన్సిలర్ అన్నే రామకృష్ణను సొంత పార్టీలోని పరిటాల యువసేన నేతలు హత్య చేయడంతో నియోజకవర్గ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌పై వ్యతిరేకత చోటు చేసుకుంది. రాబోయే ఎన్నికల్లో దీని ప్రభావం స్పష్టం కానుంది.

ఈ సారి 'గొట్టిపాటి'కి గట్టిదెబ్బే..

అద్దంకి నియోజకవర్గంలో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ కొందరికే ప్రాధాన్యమిస్తుండటం,ప్రధానంగా సంతమాగులూరు, బల్లికురవ, అద్దంకి తదితర మండలాల్లో విభేదాలు అధికంగా ఉన్నాయి. సంతమాగులూరు మండల పార్టీ మాజీ అధ్యక్షుడు నాగబోతు రామాంజనేయులు, కొరిశపాడు మాజీ జెడ్పీటీసీ ముత్తవరపు రమణయ్య మరికొందరు నేతలు ఇప్పటికే పార్టీని వీడి అధికార వైఎస్సార్ సీపీలో చేరారు. ఇటీవల సంతమాగులూరు మండలం కొప్పరం, అద్దంకి మండలం మోదేపల్లి, జె.పంగులూరు మండలాల పరిధిలో వందలాది కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. రాబోయే ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో టీడీపీకి ఎదురుదెబ్బ తగిలే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పోటీ చేద్దామా.. వద్దా?

- అంతర్మథనంలో నంద్యాల టీడీపీ ఇన్‌చార్జి ఫరూక్
- ఓడిపోయే సీటు నుంచి పోటీ చేసేందుకు నిరాసక్తి
- మరోవైపు సొంతంగా కార్యక్రమాలు చేపడుతున్న భూమా బ్రహ్మానంద రెడ్డి
- ఇద్దరి మధ్య తీవ్రంగా వర్గ పోరు



సాక్షి, నంద్యాల: టికెట్ల విషయంలో టీడీపీ అధిష్టానం నాన్చుతుండడంతో నంద్యాలలో ఆ పార్టీ కేడర్ అయోమయంలో పడింది. మాజీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కే టికెట్ అని గతంలో చంద్రబాబు చెప్పినా ప్రస్తుత నాన్చుడు ధోరణితో ఆయన ముందుకు కదలడం లేదు. పైగా ఎన్నికల్లో పోటీ చేయాలా... వద్దా అన్న సందిగ్ధంలో ఉన్నారు. ఓడిపోయే సీటు నుంచి పోటీ చేసేందుకు నిరాసక్తి వ్యక్తం చేస్తున్నారు. ఇన్‌చార్జే డైలమాలో ఉండడంతో కార్యకర్తలు తలోదిక్కు చూసుకుంటున్నారు. నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీకి కంచుకోట. 2017 ఉప ఎన్నికలో తప్ప ప్రతీసారీ వైఎస్సార్ సీపీ హవానే కొనసాగుతోంది. ఇక్కడ నుంచి ఈసారీ గెలవడం అసాధ్యమని ఫరూక్ ఒక నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. టీడీపీ క్షేత్రస్థాయి కేడర్ నుంచీ ఆశించినంత మద్దతు లేకపోవడంతో పోటీ చేసేందుకు విముఖత చూపిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కోట్లకు కోట్లు ఖర్చు పెట్టుకునేందుకు సిద్ధంగా లేనని ఆఫ్ ది రికార్డుగా చెబుతున్నారు.

ఫరూక్, బ్రహ్మానందరెడ్డి ఎడమొహం పెడమొహం

మరోవైపు మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్ ఎడమొహం పెడమొహంగా మెలుగుతున్నారు. టీడీపీ నంద్యాల నియోజకవర్గ ఇన్‌చార్జిగా గతేడాది నవంబర్ 27న ఫరూక్ చార్జి తీసుకున్న నాటి నుంచి నేటి వరకు వీరిద్దరూ కలిసింది లేదు. ఎవరికి వారు విడివిడిగా కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నారు. కలిసి మాట్లాడదామని ఫరూక్ అనేకసార్లు భూమా బ్రహ్మానందరెడ్డిని కోరినా ఫలితం లేకపోయింది. ఫరూక్ ముఖం చూసేందుకు కూడా భూమా ఇష్టపడడం లేదని చెబుతున్నారు. కేడర్ తన ఆధీనంలో ఉందని, టికెట్ తనకేనని ప్రచారం చేసుకుంటున్నారు. టికెట్ రాని పక్షంలో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలవాలని బ్రహ్మం ఆలోచనగా ఉందని అంటున్నారు. ఈ మేరకు కొంతమంది నాయకుల ఇళ్లకు వెళ్లి మరీ మద్దతు కోరుతున్నారు.

కేడర్‌లో గందరగోళం

ఇద్దరు నాయకుల మధ్య సమన్వయం కొరవడడంతో కేడర్ గందరగోళంలో పడింది. కలిసికట్టుగా పనిచేస్తేనే విజయం దక్కడం కష్టం.. ఇక కలహాలతో గెలవడం అసాధ్యమన్న భావన కార్యకర్తల్లో నెలకొంది. ఇన్‌చార్జిగా ప్రకటించిన తర్వాత కూడా పోటీ చేసేందుకు ఫరూక్ తటపటాయింపు, ఇద్దరు నేతల అనైక్యతతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో అధిష్టానం ఉంది.

వెంకటగిరిలో వైఎస్సార్‌సీపీనే మళ్లీ గెలవాలి



వెంకటగిరి నియోజకవర్గ నేతలతో మాట్లాడుతున్న ఎంపీ విజయసాయిరెడ్డి

- నేదురుమల్లి రామ్‌కుమార్ మన అభ్యర్థి
- అందరూ కలిసికట్టుగా పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి.
- పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి పిలుపు

సాక్షి, అమరావతి: రానున్న ఎన్నికల్లో తిరుపతి జిల్లా వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కృషిచేయాలని.. అక్కడ వైఎస్సార్‌సీపీనే మళ్లీ గెలవాలని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్టీ పార్లమెంటరీ నేత వి.విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి జిల్లా వెంకటగిరి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో గురువారం ఆయన తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ భేటీ ఉ.11.30కు ప్రారంభమై సా.4 వరకు సాగింది. ఈ సందర్భంగా పార్టీ నాయకుల అభిప్రాయాలను విజయసాయిరెడ్డి అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల నాయకులు ముఖ్యమంత్రి ఎంపిక చేసిన అభ్యర్థి గెలుపు కోసం పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి విజయసాయి రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గ పార్టీ అభ్యర్థిగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పోటీచేస్తారని చెప్పారు. నియోజకవర్గంలో రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను అమలుచేసిందని చెప్పారు. అలాగే, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించేందుకు అధికారులతో తాను మాట్లాడతానని ఆయన భరోసా ఇచ్చారు. గతంలో తిరుపతిలో వెంకటగిరి నియోజకవర్గ సమీక్ష సమావేశం నిర్వహించినప్పుడు నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలకు తన ఎంపీ ల్యాండ్స్ నుంచి నిధులిస్తానని హామీ ఇచ్చానని, స్థానిక నాయకులు ఫాలోఅప్ చేసుకోవాలని సూచించారు. ఇక నియోజకవర్గంలో నేతల మధ్య సమన్వయ లోపం లేకుండా చూడాల్సిన బాధ్యత నియోజకవర్గ సమన్వయకర్త మీద ఉందని.. అలాగే, నాయకులందరినీ కలుపుకుంటూ వారిని సంతృప్తిపరచాల్సిన బాధ్యత ఆయనదేనన్నారు. పార్టీలో ఏమైనా సమస్యలుంటే అంతర్గతంగా మాట్లాడుకుని పరిష్కరించుకోవాలని విజయసాయిరెడ్డి హితవు పలికారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రంలో విద్యా సంస్కరణలు

వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చైతన్య

అమలాపురం టౌన్: జెండాలు జత కట్టడమే టీడీపీ, జనసేన అజెండా అయితే జనం గుండెల్లో గుడి కట్టడమే సీఎం జగన్ అజెండా అని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య అన్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో గురువారం జరిగిన 'విద్యార్థి సాధికారత జగనన్నతోనే సాధ్యం'ర్యాలీలో చైతన్య ప్రసంగించారు. జిల్లా వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు శిరీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీని జెండా ఊపి మంత్రి విశ్వరూప్ ప్రారంభించారు. చైతన్య మాట్లాడుతూ.. సీఎం జగన్ ప్రభుత్వంలోనే విద్యా సంస్కరణలు జరిగాయని చెప్పారు. పేద విద్యార్థులకు సైతం కార్పొరేట్ విద్యను ఉచితంగా అందిస్తున్నారన్నారు. సీఎం జగన్‌తోనే రాష్ట్రంలో విద్యా ప్రగతి కొత్త పుంతలు తొక్కుతోందని మంత్రి విశ్వరూప్ అన్నారు. అమలాపురం హైస్కూలు సెంటర్‌లోని మాజీ సీఎం దివంగత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి మంత్రి పూలమాల వేసి ర్యాలీని ప్రారంభించగా స్థానిక నల్ల వంతెన వరకూ 2 కిలోమీటర్ల మేర ర్యాలీ సాగింది. ఉభయ గోదావరి జిల్లాల పార్టీ విద్యార్థి విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ ఆనంద్, తిరుపతి, కడప, నెల్లూరు జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ రాజశేఖరరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజా ప్రసంగించారు.

టీడీపీ నేత కుమారుడి 'కరెన్సీ మోసం'!

- చలామణిలో లేని టర్కీ కరెన్సీ చూపి మోసం చేసే ప్రయత్నం
- రద్దయిన కరెన్సీ విలువ రూ.27 కోట్లుగా నమ్మించే యత్నం
- రూ.కోటికే ఇచ్చేస్తామంటూ బేరం
- ఐదుగురిని అరెస్టు చేసిన హైదరాబాద్ పోలీసులు
- నిందితుల్లో టీడీపీ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి కుమారుడు కృష్ణప్రసాద్
- కృష్ణప్రసాద్ పరారీలో ఉన్నాడనటంపై పలు అనుమానాలు



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

సాక్షి, హైదరాబాద్: కాకినాడకు చెందిన తెలుగుదేశం పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, వీర వెంకట సత్యనారాయణల కుమారుడు పిల్లి కృష్ణప్రసాద్ (బుజ్జి) చెలామణిలో లేని టర్కిష్ కరెన్సీ అంటగట్టి మోసం చేయడానికి ప్రయత్నించాడు. ఈ వ్యవహారంలో బుజ్జి, మరో ఐదుగురిపై హైదరాబాద్ ఎల్బీ నగర్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఏలూరు ఎదరవారి వీధికి చెందిన మంచినీళ్ళ ఓం నాగ ప్రసాద్, దెందులూరు మండలం సోమవరప్పాడుకు చెందిన గుండిమీద జ్యోతి రవితేజ, తూర్పు గోదావరి జిల్లా ఆనందరావుపేటకు చెందిన తోట వెంకట నాగరాజు, కాకినాడ రాజేంద్రనగర్‌కు చెందిన నిమ్మగంటి జీవన్ సత్య, ఇంద్రపాలానికి చెందిన మర్కుటి తేజలను అరెస్టు చేశారు. కాకినాడకే చెందిన పులి బుజ్జి పరారీలో ఉన్నట్లు చూపించారు. పోలీసుల కథనం ప్రకారం.. టర్కీకి చెందిన లీరా కరెన్సీని ఆ దేశం కొన్నేళ్ళ క్రితం రద్దు చేసింది. ప్రస్తుతం ఒక్కో లీరా రూ.2.75తో సమానం. కార్పెంటర్ అయిన ఓం నాగ ప్రసాద్‌కు ఎనిమిదేళ్ల క్రితం 99 లీరా నోట్లు ఏలూరుకు చెందిన ఓ గుర్తుతెలియని వ్యక్తి ద్వారా లభించాయి. అప్పటి నుంచి వీటిని భారత కరెన్సీగా మార్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం ఇతడికి ఏలూరులోనే రవితేజ, నాగరాజుతో పరిచయమైంది. నాగ ప్రసాద్ తన వద్ద ఉన్న టర్కిష్ కరెన్సీ విషయం వారికి చెప్పి, మార్పిడి చేయిస్తే కమీషన్ ఇస్తానన్నాడు. వారిద్దరూ విషయాన్ని పిల్లి బుజ్జికి చెప్పారు. హైదరాబాద్‌లో ఉన్న పరిచయాలతో టర్కిష్ కరెన్సీ మారుస్తానని బుజ్జి చెప్పాడు. లీరాలు చెలామణిలో లేవనే విషయం తెలిసినప్పటికీ తక్కువ రేటుకు ఇస్తామంటూ మోసం చేయాలని భావించాడు. తన స్నేహితులు జీవన్ సత్య, తేజలను రంగంలోకి దింపాడు. పథకం ప్రకారం ఈ ఆరుగురూ అద్దె స్కార్పియో వాహనంలో హైదరాబాద్ చేరుకుని గచ్చిబౌలిలోని ఓ లాడ్జిలో మకాం వేశారు. 99 లీరాల విలువ భారత కరెన్సీలో రూ. 27 కోట్లు ఉంటుందని, వాటిని రూ.కోటికే ఇస్తామంటూ పలువురికి చెప్పారు. ఈ విషయం ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీసుల దృష్టికి వచ్చింది. ఈ గ్యాంగ్ గురువారం చింతల్‌కుంట వద్దకు రాగానే ఎస్ఓటీ పోలీసులు దాడి చేసి బుజ్జి మినహా ఐదుగురిని పట్టుకున్నారు. స్కార్పియో వాహనం, 99 లీరాలు, స్వాధీనం చేసుకున్నారు. అయితే, గచ్చిబౌలిలోని లాడ్జిలో బస చేసిన పిల్లి కృష్ణప్రసాద్ (బుజ్జి) చిక్కకపోవడం, అతడిని ఆరో నిందితుడిగా చేర్చి పరారీలో ఉన్నాడని చెప్పడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

ఈవీ చార్జింగ్ కష్టాలకు చెక్!

సాక్షి, అమరావతి: దేశంలో విద్యుత్ వాహనాలను ప్రోత్సహించే దిశగా జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) కార్యాచరణను వేగవంతం చేసింది. విద్యుత్ వాహనాల వినియోగం పెరగడానికి ప్రధాన అడ్డంకిగా ఉన్న విద్యుత్ చార్జింగ్ స్టేషన్ల(ఈవీ స్టేషన్లు) కొరతను తీర్చేందుకు ఉపక్రమించింది. ప్రస్తుతం దేశంలో దాదాపు 10వేల ఈవీ చార్జింగ్ స్టేషన్లే ఉన్నాయి. మరోవైపు దేశంలో విద్యుత్ వాహనాల మార్కెట్ పెరుగుతోంది. దేశంలో 2030నాటికి విద్యుత్ వాహనాల వినియోగం రెట్టింపు అవుతుందని అంచనా. అందుకు తగినట్లుగా మౌలిక సదుపాయల కల్పన వ్యవస్థను పెంపొందించేందుకు ఎన్‌హెచ్ఏఐ ప్రణాళికను రూపొందించింది. జాతీయ రహదారుల వెంబడి రానున్న ఐదేళ్లలో 25వేల ఈవీ చార్జింగ్ స్టేషన్లు నెలకొల్పాలన్న ప్రణాళికను ఇప్పటికే ఆమోదించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని జాతీయ రహదారుల వెంబడి రెండేళ్లలో 400 ఈవీ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనుంది. తొలి దశలో ఈ ఏడాది ఏప్రిల్‌లో కార్యాచరణను ప్రారంభించి డిసెంబర్ నాటికి 150 స్టేషన్లు ఏర్పాటు చేయాలని, రెండో దశలో మిగిలిన 250 స్టేషన్లను 2025 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అన్ని రకాల విద్యుత్ వాహనాలకు ఉపయోగపడేలా బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ రూపొందించిన మోడల్‌లో వీటిని ఏర్పాటు చేయనుంది.

ఓ నా కుమారా! ఒక వేళ నీ కర్మ ఆవగింజంత ఉండి, అది ఒక పెద్ద రాతిబండలో గానీ, ఆకాశాలలో గానీ లేదా భూమిలో గానీ దాగివున్నా, అల్లాహ్ దానిని తప్పక (వెలుగులోకి) తెస్తాడు. అల్లాహ్ ఎంతో సూక్ష్మగ్రాహి, సర్వం తెలిసినవాడు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 26 జనవరి 2024

అనైక్యతా కూటమి

వచ్చే ఎన్నికల్లో అధికార బీజేపీని గద్దె దింపడమే లక్ష్యంగా ఐక్యంగా ప్రతిఘటిస్తామని 28 పార్టీల కలగూరగంప 'ఇండియా' కూటమి ఆది నుంచి చెబుతోంది. కానీ, ఎన్నికలు ముంచుకొస్తుంటే, కూటమి బీటలు వారుతోంది. అంతటా అనైక్యతా రాగాలే వినిపిస్తున్నాయి. పశ్చిమబెంగాల్‌లో కాంగ్రెస్‌తో పొత్తు ఉండదని ఆ రాష్ట్ర సీఎం, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ బుధవారం తేల్చేశారు. 'ఆప్' నేత – పంజాబ్ సీఎం భగవంత్ సింగ్ మాన్ సైతం తమ రాష్ట్రంలోనూ అంతే అని కుండబద్దలు కొట్టారు. జేడీ(యూ) అధినేత – బిహార్ సీఎం నితీశ్ కుమార్ పైకి ఏమీ చెప్పకున్నా, లోలోపల కుతకుతలాడుతున్నట్టు కనిపిస్తూనే ఉంది. వెరసి, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ 'భారత్ జోడో' అని తిరుగుతుంటే, ముందుగా 'ఇండియా(కూటమి) జోడో' చేయాల్సిన పరిస్థితి తలెత్తింది.

రాహుల్ 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' బెంగాల్‌లోకి ప్రవేశించడానికి ఒక రోజు ముందే మమత షాక్ ఇచ్చారు. బెంగాల్‌లో హస్తం బలం పుంజుకుంటే, అది తనకు తలనొప్పి అవుతుందని మమతకు తెలుసు. అందుకే, కలసికట్టుగా పోటీ చేసినా... రాష్ట్రంలో నిరుడు కాంగ్రెస్ నెగ్గిన 2 లోక్‌సభా స్థానాలనే ఆ పార్టీకి కేటాయిస్తామన్నది తృణమూల్ ప్రతిపాదన. దూకుడు ప్రదర్శిస్తున్న స్థానిక హస్తం నేతలు అందుకు ససేమిరా అంటున్నారు. ముఖ్యంగా రాష్ట్ర పీసీసీ ప్రెసిడెంట్, కాంగ్రెస్ లోక్‌సభా పక్ష నేత అధీర్ రంజన్ చౌధురి నిత్యం మమతపై చేస్తున్న విమర్శలు చివరకు ఇక్కడకు తెచ్చాయి. కాంగ్రెస్ పెద్దలు నష్టనివారణకు ప్రయత్నిస్తున్నా రాజీ లేదని దీదీ కొట్టిపారేశారు. కూటమిలో కొనసాగుతామంటూనే, ఎన్నికలయ్యాక కాంగ్రెస్ బలాన్ని బట్టి మిగతావి మాట్లాడదామని ఆమె చెబుతున్న మాటలు కంటితుడుపుకే తప్ప, బీజేపీపై కలసికట్టు పోరుకు పనికిరావు.

మరోపక్క 'ఇండియా' కూటమి ఏర్పాటులో కీలక పాత్రధారి, జేడీ (యూ) అధినేత, బిహార్ సీఎం అయిన నితీశ్ కుమార్ వ్యవహారశైలి సైతం అనుమానాస్పదంగానే ఉంది. కూటమిలో తనకు సరైన ప్రాధాన్యం ఇవ్వలేదని ఆయన అసంతృప్తితో ఉన్నారు. మోదీతో రామ్ రామ్ చెప్పి, ప్రతిపక్ష కూటమిలో చేరిన ఆయన తీరా ఇప్పుడు మళ్ళీ అధికార ఎన్డీఏ కూటమికే తిరిగి వచ్చేస్తారని ఊహాగానం. బిహార్‌లో ఉమ్మడి పాలన సాగిస్తున్న ఆర్జేడీ – జేడీయూల మధ్య కొన్నాళ్ళుగా సఖ్యత లేదు. ప్లేటు ఫిరాయించడంలో పేరొందిన నితీశ్ గతంలో బీజేపీకి కటీఫ్ చెప్పి, ఆర్జేడీతో కలసి ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటు చేశారు. కానీ, ఇటీవల తననే గద్దె దింపాలని చూసిన ఆర్జేడీ మీద గుర్రుగా ఉన్నారు. ఆ పార్టీని పక్కకు నెట్టి, మళ్ళీ కమలనాథులతో నితీశ్ చేతులు కలిపే సూచనలున్నట్టు పుకారు. బిహార్‌లో జేడీయూ, ఆర్జేడీ నేతలు ఎవరికి వారు గురువారం కీలక భేటీలు జరపడం, ఢిల్లీలో రాజకీయ వాతావరణం వేడెక్కిన తీరు చూస్తుంటే... ఆ రెండు పార్టీల ప్రేమకథ ముగిసినట్టే ఉంది. మరి, రాజకీయ చాణక్యుడు నితీశ్ రానున్న రోజుల్లో ఏం చేస్తారో చూడాలి.

విచిత్రమేమిటంటే, మాటలే తప్ప చేతల్లో కూటమి అడుగు ముందుకు పడట్లేదు. సెప్టెంబర్‌లో అనుకున్న సీట్ల సర్దుబాటు వ్యవహారం డిసెంబర్‌కి వాయిదా పడి, జనవరి ముగిసిపోతున్నా అతీగతీ లేకుండా పడివుంది. అన్ని పార్టీలూ కలసి సమష్టి ప్రతిపక్ష ర్యాలీ భోపాల్‌లో చేయాలనుకున్నా అది కార్యరూపం దాల్చలేదు. నెలలు గడుస్తున్నా ఉమ్మడి మేనిఫెస్టో ఊసే లేదు. లౌకికవాద, రాజ్యాంగబద్ధ పాలన కోసం పోరాటం అని చెబుతున్నా... బీజేపీ వ్యతిరేకత, మోదీని గద్దె దింపడమనే లక్ష్యం మినహా తగిన సమష్టి సైద్ధాంతిక భూమికను సిద్ధం చేసుకోవడంలో ప్రతిపక్ష కూటమి విఫలమైంది. వివిధ రాష్ట్రాల్లో తమ బలాబలాలు తెలుసు గనక, పార్టీలు తమలో తాము పోరాడే కన్నా బీజేపీపై బాణం ఎక్కుపెడితే ప్రయోజనం. ఒకటి రెండు సీట్లకై పంపిణీలో కలహించుకొనే కన్నా పెద్ద లక్ష్యం కోసం విశాల హృదయంతో త్యాగాలకు సిద్ధపడితేనే లక్ష్యం చేరువవుతుంది.

బెంగాల్‌లో తృణమూల్, పంజాబ్, ఢిల్లీల్లో ఆప్ లేకుండా కూటమికి ప్రాసంగికత ఏముంది? వాస్తవాల్ని గుర్తించి కాంగ్రెస్ తన వైఖరి మార్చుకోవాలి. పెద్దమనిషిగా కాక, అందరికీ పెద్దన్నగా వ్యవహరించాలనుకోవడంతోనే అసలు ఇబ్బంది. అలాగే, 'యాత్ర'లతో రాహుల్ ఇమేజ్ పెరగ వచ్చేమో కానీ, ప్రతిపక్ష కూటమికి జరిగే ప్రయోజనమేమిటో తక్షణం చెప్పలేం. మణిపూర్ నుంచి ముంబయ్ దాకా 100 లోక్‌సభా స్థానాల మీదుగా సాగి, మార్చి 20న యాత్ర ముగియనుంది. అన్ని పార్టీలనూ ఒక తాటిపై నడిపి, సమన్వయం సాధించాల్సిన ఎన్నికల వేళ రాహుల్ దూరంగా యాత్రలో ఉంటే ఎలా? కనీసం అన్ని పార్టీలతో కలిసైనా యాత్ర చేయాల్సింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాల్ని కూడగట్టడంలో 1977లో జేపీ, 1989లో వీపీ సింగ్, ఆ తరువాత యూపీఏ కాలంలో అందరి సమన్వయానికి సోనియా లాంటి వారు కృషి చేశారు. ప్రస్తుతం యాత్రతో రాహుల్, పార్టీ పునరుజ్జీవనంతో ఖర్గే బిజీ. మరి, కూటమి మెడలో ఐక్యత గంట కట్టేదెవరు?

మొత్తానికి, ఎన్నికలు సమీపిస్తున్న వేళ మోదీ రోడ్‌షోలు, ప్రచారగీతాలతో సింహనాదం చేస్తుంటే, ప్రతిపక్షాలు వేటికవి స్వలాభం చూసుకుంటూ విభేదాల బాట పట్టడం విడ్డూరం. సమావేశాలతో హంగామా రేపుతూ మొదలైన ప్రతిపక్ష కూటమి తీరా ఆట ఆడకుండానే 'వాక్ ఓవర్'తో మోదీకి విజయం కట్టబెడుతోందని అనిపిస్తోంది. 28 కత్తులు ఒకే ఒరలో ఇమడడం కష్టమే. కానీ, అన్ని పార్టీలకూ ఒకే లక్ష్యం ఉంటే, అసాధ్యం కాకపోవచ్చు. నిష్క్రియాపరత్వంతో, సొంత లాభం కోసం సాటి పార్టీల కాళ్ళు నరికే పనిలో ఉంటే లాభం లేదు. ఢిల్లీలో పాగా వేయాలంటే, సమయం మించిపోక ముందే కళ్ళు తెరవాలి. కూటమిది ఆరంభ శూరత్వం కాదని నిరూపించాలి. కలహాలు మాని కార్యాచరణకు దిగాలి. లేదంటే తర్వాతేం చేసినా చేతులు కాలాక ఆకులు పట్టుకోవడమే అవుతుంది.

రాజ్యాంగమే సమ సమాజానికి దిక్సూచి

సందర్భం



డా॥ కత్తి పద్మారావు

భారతదేశంలో రాజ్యాంగం అమలైన జనవరి 26 ఒక మహత్తరమైన పండుగదినం. భారత రాజ్యాంగం సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాలను కలిగిస్తానని ప్రజలకు వాగ్దానం చేసింది. ఆలోచనా స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ ఇస్తానని భరోసా ఇచ్చింది. సమాన హోదా, సమాన అవకాశాలు, సమైక్యతా భావన, సోదర భావన కలిగించడానికే రాజ్యాంగం రూపొందింది. సమతా భావాలను అంబేడ్కర్ రాజ్యాంగంలో పొందుపరిచారు. అమెరికా, బ్రిటన్ రాజ్యాంగాల నుంచి, ఫ్రెంచ్ విప్లవం నుంచి ఆయన స్ఫూర్తి పొందినా... బౌద్ధ తత్వంలోని ప్రేమ, కరుణ, ప్రజ్ఞ, మానవత్వం, సమానత్వం, స్వేచ్ఛ, తర్కం, ప్రశ్న వంటి అనేక భావాల్ని పొందుపర్చడం వల్లే, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రక్తపాతం లేని సమాజంగా భారతదేశం రూపుదిద్దుకుంది.

డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్... మహా మేధావి, ఆలోచనాపరుడు, లౌకికవాద శిఖరం, సమతా దర్శనకర్త, గొప్పవక్త, లోతైన రచయిత. ఆయన శైలిలో గాఢత, విశ్లేషణ బలంగా వుంటాయి. విద్యా సంపన్నమైన ఆయన భాషలో సరళత, అభివ్యక్తిలో సాంద్రత కనిపిస్తాయి. అంబేడ్కర్ మానవ హక్కుల పోరాట ధీరుడు. బౌద్ధంలో ఉన్న సామాజిక సమతా నీతిని రాజ్యాంగంలో పొందుపర్చారు. ఆయన జీవితంలో అస్పృశ్యతను ఎదుర్కోవడం ప్రధాన అంశం అయ్యింది. మానవోత్తేజితమైన, వైజ్ఞానికమైన ఎన్నో కార్యక్రమాల్లో అస్పృశ్యులకు చోటు లేకపోయిందని మథనపడ్డారు. అందువలననే అస్పృశ్యతా నివారణా చట్టం గురించి పోరాడారు. ఈ సమాజాన్ని అస్పృశ్యత లేని సమాజంగా రూపొందించాలని తపన పడ్డారు. దాని వల్ల ఎంతో మంది తమ ప్రతిభకు తగిన స్థానం లేక సంఘర్షణకు గురయ్యారు, అణచివేయబడ్డారు.

అంబేడ్కర్ ఒక తాత్వికుడు కూడా. కుల సమాజానికి ప్రత్యామ్నాయంగా కుల నిర్మూలనా సమాజాన్ని బోధించారు. అగ్రకుల రాజ్యాధికారంలో దళితులకు విముక్తి లేదని చాటారు. ప్రత్యామ్నాయ వ్యవస్థను రూపొందించుకోవడానికి రాజ్యాధికారం అవసరం అని ప్రబోధించారు. ఆయన రాజకీయ తత్వశాస్త్రం భావాత్మకమైంది కాదు... అది సాంఘిక, ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మించగల సత్తా కలిగినది.

బొంబాయి వంటి నగరాల్లో కూడా కులతత్వం వ్యాపించి ఉండటంతో అంబేడ్కర్ సోదరులు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. కుల తత్వపు గొడ్డలి వేటు వారిని చిన్నప్పుడే తాకింది. ఒకే పాఠశాలలో చదివే పిల్లలు ఒక కూజా నీళ్ళు తాగలేకపోవడం, తోటి విద్యార్థులు ఆ కూజాలోని నీళ్ళను పైనుంచి పోస్తే దోసిళ్ళు పట్టి త్రాగవలసి రావడం వంటి ఘటనలు అంబేడ్కర్ గుండెల్ని పిండివేశాయి. ఆ గాయాలే రాబోయే కాలంలో కుల నిర్మూలన గ్రంథం రాయడానికి పునాదులేశాయి. కేవలం నీటి దగ్గరే కాదు, భాష దగ్గర కూడా ఆయనకు అస్పృశ్యత ఎదురైంది. అంబేడ్కర్ హైస్కూల్లో ప్రత్యేక పాఠ్యభాగంగా సంస్కృతాన్ని కోరుకున్నారు. ఒక అస్పృశ్యుడు సంస్కృతం నేర్చుకోవడం ఏమిటని నిరాకరించారు. దాంతో పర్షియన్ భాషను తీసుకోవలసి వచ్చింది. కానీ సంస్కృతాన్ని స్వయంగా కష్టపడి నేర్చుకున్నారు. వాల్మీకి, వ్యాసుడు, కపిలుడు, లోకాయతులు ఇంకా ఎందరో బ్రాహ్మణేతరులు, క్షత్రియులు సంస్కృతంలో గ్రంథాలు రాశారు. ఎందరో పాశ్చాత్య పండితులు సంస్కృతం నేర్చుకుని, వేదాలు, ఉపనిషత్తులు, దర్శనాలు, కావ్యాలు, అన్నీ ఇంగ్లీషులోకి అనువాదం చేశారు. అంబేడ్కర్ కూడా వేదాలు, ఉపనిషత్తులు, దర్శనాలు అన్నింటినీ అధ్యయనం చేసి, వ్యాఖ్యానించారు. ఏ భాషైనా, ఏ మనిషైనా నేర్చుకోవచ్చని నిరూపించారు.



అభివృద్ధిని తరచిచూస్తే...

దేశం ఎంతగానో అభివృద్ధి చెందుతోందని ఇప్పుడు గొప్పగా చెప్పుకొంటున్నాం. కానీ గణతంత్ర దినోత్సవ వేళ కొన్ని కఠిన వాస్తవాలను మనం అంగీకరించాల్సి ఉంటుంది. 2023 ప్రపంచ ఆకలి సూచీలో 125 దేశాల్లో ఇండియా 111వ స్థానంలో ఉంది. దేశంలో 81.35 కోట్ల మందికి ఇప్పటికీ ఉచిత బియ్యం పంపిణీ చేయాల్సి వస్తున్నదంటేనే దేశం ఎక్కడ ఉన్నదో అర్థమవుతుంది. కూడు, గూడు, బట్ట లేని ప్రజలు ఇంకా ఉన్నప్పుడు రాజ్యాంగం అమలవుతున్నట్టా అనే ప్రశ్న ఎదురవుతుంది. అంబేడ్కర్ భూమిని జాతీయం చెయ్యమన్నారు. కానీ అదేమో కార్పొరేట్ చేతుల్లోకి వెళ్లిపోతోంది. ఇతర దేశాల నుంచి దిగుమతి అవుతున్న తిండి గింజల వల్ల ఇక్కడి వ్యవసాయం సంక్షోభంలో వుంది. ఇతర దేశాల నుంచి దిగుమతి అవుతున్న వస్త్రాల వల్ల చేనేత పరిశ్రమ కుంటుపడింది. భారతదేశంలో పేదరికం ఎందుకు ఉందంటే రాజ్యాంగాన్ని నూటికి 90 శాతం ఉల్లంఘించడం వల్లనే అని చెప్పొచ్చు.

ప్రజలు ఇప్పటికీ అనారోగ్యంతో కునారిల్లుతున్నారు. పారిశుద్ధ్య వ్యవస్థ దెబ్బతింది. కేంద్ర ప్రభుత్వం పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టినా, ఎన్నో పట్టణాలు ఇంకా మురికి కూపాలుగానే వున్నాయి. వందశాతం బహిరంగ మల విసర్జన రహిత రాష్ట్రాలుగా ప్రకటించినవాటిల్లో కూడా 71 శాతం మేరకే నిరోధించగలిగారని జాతీయ గణాంక కార్యాలయ సర్వే వెల్లడించింది. ఇళ్ల, వ్యాపార, పారిశ్రామిక సముదాయాల నుంచి వ్యర్థ జలాలను శుద్ధి చేసిన తరువాతే బయటకు వదిలే నగరాలకు 'స్వచ్ఛ సర్వేక్షణ్' పోటీలో వాటర్ ప్లస్ సర్టిఫికేషన్ ఇస్తారు. ఆ వ్యవస్థ సరిగ్గా లేని నగరాలకూ పురస్కారాలు ఇవ్వడం... పోటీ నిష్పాక్షికతపై సందేహాలు లేవనెత్తుతోంది.

ఇకపోతే రోడ్లు నెత్తుటిమయం అవుతున్నాయి. దేశవ్యాప్తంగా ప్రతి గంటకూ 53 రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటే, 19 మంది మృత్యువాత పడుతున్నారని 2022 నాటి గణాంకాల్ని కేంద్ర సర్కారే ప్రస్తావిస్తోంది. అంతక్రితం ఏడాదితో పోలిస్తే ప్రమాదాల్లో 11.9 శాతం, మృతుల సంఖ్యలో 9.45 శాతం, క్షతగాత్రుల లెక్కలో 15.3 శాతం పెరుగుదల రహదార్ల రక్తదాహ తీవ్రతను కళ్లకు కడుతోంది. రోడ్డు ప్రమాద మృతుల్లో 18–45 ఏళ్ల వయస్కులే 69 శాతం దాకా ఉంటున్నారన్న వాస్తవం గుండెల్ని మెలిపెట్టేదే. కుటుంబ పోషణకు రోడ్డెక్కిన మనిషి అకాల మృత్యువాత పడితే, ఇంటిల్లిపాదీ రోడ్డున పడే దుఃస్థితి ఏటా లక్షల మంది అభాగ్యుల్ని దుఃఖసాగరంలో ముంచేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా రహదారి ప్రమాద మృతుల సంఖ్య అయిదు శాతం దాకా తగ్గితే, అంతకు రెట్టింపు ఇండియాలో పెరగడం నిశ్చేష్టపరుస్తోంది. రహదార్ల మారణహోమానికి కారణమేమిటో సుప్రీంకోర్టే నియమించిన నిపుణుల కమిటీ పూసగుచ్చినా, సరికొత్త మోటారు వాహనాల చట్టం ద్వారా అవ్యవస్థను ఊడ్చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించినా జరిగిందీ ఒరిగిందీ ఏమీ లేదు. వాహన వేగాన్ని 5 శాతం తగ్గించ గలిగినా ప్రమాద మరణాల్ని 30 శాతం దాకా నియంత్రించగల వీలుందని తెలిసినా 'ఏడెనిమిది సెకన్లలోనే 100 కిలో మీటర్ల వేగం' అందుకొనే శకటాలు ఎందుకు రోడ్డెక్కుతున్నట్లు?

ఇకపోతే వాయు కాలుష్య భూతం భయపెడుతోంది. శారీరక మానసిక సమస్యలు పెంచి, ఏటా లక్షల కుటుంబాల్లో శోక సంద్రాల్ని ఉప్పొంగిస్తున్న వాయు కాలుష్య భూతం గర్భస్థ పిండాల్ని సైతం కర్కశంగా కాటేస్తోంది. వాయు కాలుష్యంతో పోటీపడుతూ... గాలిలో, నీటిలో, భూమిపై అంతటా పరుచుకుంటున్న ప్లాస్టిక్ వ్యర్థాలు ఆరోగ్య, ఆహార రంగాల్లో పెను సంక్షోభం సృష్టిస్తున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు గాలిలో ఉన్నా, భూగర్భ జలాల్లోకి చేరినా ప్రమాదమే. అవి మనుషుల దేహాల్లోకి చొచ్చుకుపోయి, శరీర కణాలను దెబ్బతీస్తాయనీ, క్యాన్సర్ల ముప్పు పెచ్చరిల్లుతుందనీ ఇప్పటికే పలు దేశాల శాస్త్రవేత్తలు, పరిశోధకులు హెచ్చరించారు.

అందుకే అంబేడ్కర్ ఆశయాలు రాజ్యాంగంలో ప్రతిఫలిస్తున్నాయా అన్నది పెద్ద ప్రశ్నగా మిగిలింది. నిజానికి రాజ్యాంగంలో ఆయన ఆలోచనలు ప్రతిఫలిస్తే 100 శాతం అక్షరాస్యత ఏర్పడుతుంది. విద్య మహోన్నత స్థాయికి చేరుతుంది. ప్రపంచం గర్వించే మేధో సంపన్నులు ఆవిర్భవిస్తారు. పేదరిక నిర్మూలన జరిగి, సమ సమాజం ఏర్పడుతుంది. స్త్రీలు ఆత్మ రక్షణతో, పురుషులతో సమానంగా జీవించగలుగుతారు. యువత శక్తి సంపన్నులై సంపదను సృష్టించగలుగుతారు. నిరుద్యోగం, పేదరికం లేని సమ సమాజం ఏర్పడుతుంది. అందుకే రాజ్యాంగ మార్గంలో నడుద్దాం!

వ్యాసకర్త దళితోద్యమ నాయకుడు | 98497 41695

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మళ్లీ జంపా?



ఇండియా కూటమితో నితీశ్ కుమార్ విసిగి పోయారనేది స్పష్టం. కానీ కూటమి ఇవ్వలేనిది బీజేపీ ఏమిస్తుంది? డబ్బు? ఆయనకు కుటుంబం లేదు కాబట్టి డబ్బు కాకపోవచ్చు. అధికారమా? బీజేపీ/ఎన్డీఏలో మోదీకి తప్ప ఎవరికీ అధికారం ఉండదు. కూటమి కన్వీనర్ కానందుకు ప్రతీకారమా? ఇదైతే కావొచ్చు. ఏదైనా ఆయన ఒక నవ్వులాటగా మారిపోతారు.

– సబా నఖ్వీ, కాలమిస్ట్

ఇదెక్కడి ద్రోహం?



పశ్చిమ బెంగాల్లో తృణమూల్ ఒంటరిగా పోటీ చేయనుంది. యూపీలో కాంగ్రెస్‌కు ఎస్పీ 3 సీట్లు ఇస్తోంది. మహారాష్ట్రలో ఉద్ధవ్ 23 సీట్లలో పోటీ చేయనున్నారు. తమిళనాడులో కాంగ్రెస్‌కు డీఎంకే 8 సీట్లు ఇస్తోంది. చూస్తుంటే బీజేపీ కాదు, కాంగ్రెస్ విముక్త భారతం కోసం ఇండియా కూటమే పనిచేస్తోంది.

– రిపీ బాగ్రీ, వ్యాఖ్యాత

వాళ్లకే హీరో



అయోధ్యలోని అసలు ఆలయాన్ని కూల్చిన దురాక్రమణదారు ఉజ్బెకిస్తాన్ దేశస్థుడు. కానీ కొత్తగా ప్రారంభించిన రామాలయం గురించి అక్కడి మీడియా ఒక్క చెడు మాట కూడా రాయలేదు. బాబర్ ఇప్పుడు వాళ్ల హీరో కాదు. కేవలం పాశ్చాత్యులు, పాకిస్తానీలు, ఇండియాలోని ఇస్లామిస్టులు, భారత నాగరికతనే సమస్యగా భావించే స్థానిక 'ఉదారుల'కు మాత్రమే ఆయన సైద్ధాంతిక హీరో.

– సూర్య కానేగావ్‌కర్, కాలమిస్ట్

అసలు వాస్తవం



రెండు వందల ఏళ్ల క్రితంతో పోలిస్తే, ఇండియా ఇప్పుడు మరింత శక్తిమంతంగా ఉంది. అదే సమయంలో చరిత్రలో తొలిసారి ఇండియా పక్కలోనే ఒక సూపర్ పవర్ ఎదుగుతోంది. ఇది అన్నింటికంటే ఎక్కువగా, విశ్వవ్యాప్తంగా ఎదుగుతున్న ఇండియా స్థానికంగా బలహీన పడుతోందని మాత్రమే వివరిస్తుంది.

– హేపీమాన్ జాకబ్, ప్రొఫెసర్

ఒక్క దేవుడేనా?



కొత్త హిందుత్వ నియమాల ప్రకారం మనం దేవతలను కూడా పూజించవచ్చా, లేక కేవలం రాముడినే పూజించాలా? ఎవరి దగ్గరైనా మేనిఫెస్టో ఉందా?

– దేవ్‌దత్ పట్నాయక్, రచయిత

అయోధ్యలో ఆధ్యాత్మిక శోభ

భారతదేశంలో, ప్రస్తుత అయోధ్యలోని ఆధ్యాత్మిక పరిణామాలను అవలోకిస్తే కని విని ఎరుగని భావోత్తేజం దేశంలో నెలకొందని స్పష్టమవుతోంది. జాతిని నడిపించే ఉన్నత మేధావి వర్గం, సమాజాన్ని ప్రభావితం చేయడం ఏ దేశంలో అయినా, ఏ శతాబ్దంలో అయినా సహజమే అయినా... ప్రస్తుత భారతావనిలో రూపుదిద్దుకొంటున్న వినూత్న ప్రాణప్రతిష్ఠలు, ప్రభుత్వాధినేతల ఆధ్యాత్మిక ఉద్విగ్నతలు భవిష్య భారతావనిని ఎలా ప్రభావితం చేస్తాయో అగమ్య గోచరంగా ఉంది. భారత జాతి ఆధ్యాత్మిక ఔన్నత్యానికి శ్రీరాముడు ప్రతీకగా, సదా ఆరాధ్యనీయుడనడంలో సందేహం లేదు.



సరయూ నదీ తీరంలోని అయోధ్యా పురి ప్రాశస్త్యం, పౌరాణిక పవిత్రత, చారిత్రక ప్రాధాన్యత, మర్యాదా పురుషోత్తముని జీవన కథనం విశ్వ మానవ సమాజానికి సదా ఆదర్శనీయమే. శ్రీమద్రామాయణం సర్వజన శ్రేయోదాయకం, సర్వ మంగళప్రదంగా నేటికీ శిరోధార్యం. అత్యాధునిక సాంకేతిక ప్రపంచం, మానవాళిని నడిపిస్తున్న ఈ 21వ శతాబ్దంలో, అయోధ్యా భారతం సృష్టిస్తున్న ఆధ్యాత్మిక చైతన్యాన్నీ, కేంద్ర ప్రభుత్వాధినేతల పాలనా వ్యవహార శైలినీ, ప్రపంచంలోని మతాధికార మతోన్మత్తత ఏ విధంగా స్వీకరిస్తుందో వేచి చూడవలసినదే. స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల సాధన కోసం పరితపించిన ఉద్యమాలూ, పోరాటాలూ జాతీయతను ప్రధాన ప్రాతిపదికగా చేసుకుని అనేక స్వతంత్ర దేశాలు ఆవిర్భవించాయి. ఈ జాతీయత ఒకానొక దశలో ప్రపంచ యుద్ధాలకు దారి తీసింది. విశ్వమానవ భావన దారితప్పింది. ఐక్యరాజ్య సమితి వైఫల్యం కొట్టొచ్చినట్టు స్పష్టమవుతోంది. దానికి తోడు, ప్రతీ దేశం అణ్వాయుధాల కోసం అర్రులు చాస్తూ, అగ్ర రాజ్యాధిపత్యానికి అడుగులకు మడుగులొత్తుతూ వ్యవహరిస్తోంది. దేశభక్తి ఆవశ్యకత క్రమేపీ స్వతంత్ర రాజ్యాల అవతరణ తర్వాత కొంత కుంటుపడటంతో, ఆ యా దేశాల పాలకులు తమ దేశాల సార్వభౌమత్వాలు కోల్పోకుండా అప్రమత్తతో వ్యవహరించక తప్పడం లేదు. దేశభద్రత, సమగ్రత, జన శ్రేయస్సు ప్రతీ దేశానికి అత్యంత ముఖ్యమైన అంశాలు అయ్యాయి. అమెరికా, చైనా, రష్యా, ఇండియా... ఇలా ఏ దేశమైనా అణ్వాయుధ సంపత్తి సమకూర్చుకోవడంలో పోటీ పడటం లేదా సహకారం పొందటం, ఆశ్రయ దేశాలను ఆదుకోవడం ప్రస్తుత వర్తమానాంశం.


ప్రస్తుతం మన దేశంలో శ్రీరామ నామం ప్రతిధ్వనిస్తోంది. స్వయంగా దేశ ప్రధాని, అయోధ్య ఆధ్యాత్మిక సుసంపన్నత ప్రచారానికి సారథ్యం వహిస్తున్నారు. ప్రపంచం ఆసక్తిగా చూస్తోంది. చారిత్రక చీకటి కోణాలలో ప్రభవించిన దుష్టపాలనా శక్తి కారణంగా తలఎత్తిన చారిత్రక పరిణామాలలో అయోధ్య ఒక అధ్యాయం సృష్టించింది. చారిత్రక దుష్కృతికి ఉపశమనం, ఊరట లభించింది. భవ్య మహా మందిరంలో చిన్నారి రాముడు ప్రవేశించడం భారతీయ ఆధ్యాత్మిక పునరుజ్జీవనకు ప్రాణ ప్రతిష్ఠ చేసినట్టే. శాంతి, అహింస, సహనం, సమానత్వం, సర్వజన సంక్షేమం శ్రీరామరాజ్యం లక్ష్యంగా జాతిపిత మహాత్ముడు అభిలషించారు. ఆధ్యాత్మిక దీప్తి ప్రసరింప చేస్తున్న అయోధ్య పునరుజ్జీవనం... అణు విధ్వంసక శత్రు సమరాంగణాలలో చిక్కుకున్న ప్రపంచ మానవాళికి సందేశం అందిస్తోంది.

– జయసూర్య, సీనియర్ జర్నలిస్ట్
మొబైల్: 90149 48336

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

భారత్ దశ, దిశ మారిన రోజు

అభిప్రాయం



బి.ఎస్. రాములు

భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మన పరిపాలన, న్యాయ వ్యవస్థ, రాజకీయ ప్రతినిధులు, చట్టసభలు ఎలా ఉండాలో... పౌరుల హక్కులు, బాధ్యతలు ఏమిటో అని నిర్ణయించిన రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజు 1950 జనవరి 26. స్వేచ్ఛ, సమానత్వం, ఆత్మగౌరవం, అందరికీ ఓటు; కుల, మత, ప్రాంతీయ, జాతుల వివక్షలు వంటివాటిని తొలగించుకొని భారత ప్రజలు నూతన సమాజంగా రూపుదిద్దుకోవడానికి రాజ్యాంగ బద్ధంగా కృషి చేయాలని నిర్ణయించుకున్న రోజు అది. అందువల్ల పౌరులందరూ రాజ్యాంగాన్ని తెలుసుకోవాలి. అర్థం చేసుకోవాలి. తమ హక్కులేమిటో, కర్తవ్యాలేమిటో తెలుసుకోవడం అవసరం.

భారత రాజ్యాంగంలో మొత్తం 395 ఆర్టికల్స్ ఉన్నాయి. ప్రభుత్వాలు ఎలా ఏర్పడుతున్నాయి, ఎలా పని చేస్తున్నాయి, ఓటు హక్కు ద్వారానే ఈ మొత్తం పరిపాలన వ్యవస్థ ఎలా నిర్దేశించబడుతున్నదో రాజ్యాంగం చదివితే తెలుస్తుంది.

భారత రాజ్యాంగం విశిష్టతను ఓబీసీలు, ఎస్సీలు, ఎస్టీలు సరిగ్గా గుర్తించడం లేదు. భారత రాజ్యాంగం మనుషులందరినీ సమానం చేసింది. ప్రతి మనిషికీ ఒకే విలువ, ఒకే ఓటు అని స్థిరపర్చింది. 1950 జనవరి 26 నుంచి ఇది మన తాత్విక భూమికగా మారింది. దాంతో రాజ్యాంగ బద్ధంగా మనుషులందరూ సమానమయ్యారు. అంతకుముందు భారతీయులందరూ విభిన్న కులాలుగా, వర్ణాలుగా, వర్గాలుగా, తెగలుగా, జాతులుగా అనేక అసమానతలకూ, వివక్షలకూ, వెలివేతలకూ, పీడనలకూ, అణచివేతలకూ గురయ్యేవారు. ఇందుకు తత్వ శాస్త్రాలూ, పురాణ– ఇతిహాసాలూ, మనుస్మృతిలో పేర్కొన్న అంశాలను ప్రాతిపదికలుగా భావించారు.

ప్రతి మనిషికీ ఒకే విలువ, ఒకే ఓటు అనేది ఎంతో గొప్ప తాత్వికతతో కూడిన అంశం. దీన్ని బలంగా జీవితమంతా అన్ని రంగాల్లోకీ విస్తరింప జేసిన దార్శనికుడు డా॥ బీఆర్ అంబేడ్కర్. వేల ఏళ్ళుగా ఎందరో తత్వవేత్తలు ఎన్నో సిద్ధాంతాలు ప్రతిపాదించారు. వాటన్నిటి కన్నా అత్యంత వాస్తవికమైన తాత్వికత కలది భారత రాజ్యాంగం. దీని ప్రాధాన్యతను బీసీ, ఎస్సీ, ఎస్టీలు, మహిళలు గుర్తించాలి. ఇతర దేశాల్లో అనేక ఉద్యమాల తర్వాత సార్వత్రిక వయోజన ఓటు హక్కు కల్పించబడింది. మరీ ముఖ్యంగా మహిళలకు ఎంతో ఆలస్యంగా ఓటు హక్కు కల్పించారు. కానీ భారత దేశంలో జరిగిన మొదటి సాధారణ ఎన్నికల నుంచే సార్వ జనీన ఓటు హక్కు ఇచ్చింది భారత రాజ్యాంగం.

ప్రభుత్వ ఉద్యోగ, విద్యా రంగాలలో వెనుకబడిన సామాజిక వర్గాలకు రిజర్వేషన్లు కల్పించింది. విద్య ప్రాముఖ్యతను గుర్తించి అందరికీ చదువుకోవడానికి అవకాశం కల్పిస్తూ చదువుకోవడాన్ని ప్రాథమిక హక్కుగా ప్రకటించింది రాజ్యాంగం. 'లార్డ్ మౌంట్ బాటన్ ప్రణాళిక'ను అనుసరించి బ్రిటిష్ పార్లమెంట్ భారత స్వాతంత్ర్య చట్టాన్ని 1947 జులై 5న ఆమోదించింది. ఇది 1947 జులై 18న బ్రిటిష్ రాణి ఆమోదాన్ని పొందింది. చివరకు ఈ చట్టం 1947 ఆగస్టు 15 నుంచి అమలులోకి వచ్చింది. భారత స్వాతంత్ర్య చట్టాన్ని పురస్కరించుకొని, ఇండియా, పాకిస్తాన్ అనే రెండు స్వతంత్ర దేశాలు అవతరించాయి. అప్పటికే భారత రాజ్యాంగ సభ ఏర్పడి రాజ్యాంగ రచనకు శ్రీకారం చుట్టింది.



రాజ్యాంగ పరిషత్ సమావేశంలో చర్చలు

అంబేడ్కర్ రాజ్యాంగ ముసాయిదా కమిటీ ఛైర్మన్‌గా 1948, జనవరి నెలలో తొలి ముసాయిదా ప్రతి (చిత్తు ప్రతి) విడుదల అయ్యింది. ఆ ముసాయిదాకు వివిధ వర్గాల నుండి, ప్రజల నుండి వేలకొలది సవరణల ప్రతిపాదనలు వచ్చాయి. వాటిపై రాజ్యాంగ ఉప సంఘం చర్చించి కొన్ని సవరణలకు ఆమోదం తెలిపింది. చివరకు 1949 నవంబర్ 26న నూతన రాజ్యాంగాన్ని రాజ్యాంగ పరిషత్ ఆమోదించింది. 1950 జనవరి 26 నుండి రాజ్యాంగం అమలులోకి వచ్చింది. ఆ రోజునే గణతంత్ర దినం అంటున్నాం. ఇది భారత్ దశ, దిశలను మార్చిన రోజు.

వ్యాసకర్త తెలంగాణ బీసీ కమిషన్ తొలి ఛైర్మన్
మొబైల్: 83319 66987

వైరాగ్యం

సామాన్యుడి ఆరాటాలకూ, ఆందోళనలకూ మంచి మందు ఒకింత వైరాగ్యం. కానీ ప్రాపంచిక విషయాల మీద 'రక్తి'లో మునిగి తేలే వాడికి, రమ్మనగానే విరక్తి రాదు కదా? అది గట్టి సాధన ద్వారా సాధించాల్సిన స్థితి. కొన్ని సందర్భాలలో మాత్రం, మనుషులకు వద్దన్నా వైరాగ్యం కలుగుతుంది. కానీ అది తాత్కాలికం. చూస్తుండగానే ఆ విరక్తి కాస్తా ఆవిరయిపోతుంది. అలాంటివి ముఖ్యంగా మూడు సందర్భాలు చెప్తారు పెద్దలు: ప్రసూతి వైరాగ్యం, శ్మశాన వైరాగ్యం, పురాణ వైరాగ్యం.



జ్యోతిర్మయం

ప్రసూతి వైరాగ్యం పాత కాలం మాట. నూరేళ్ళ క్రితం, వైద్య సదుపాయాలేవీ లేని రోజుల్లో, స్త్రీలకు ప్రసవమంటే ప్రాణగండంగా ఉండేది. ఎన్నో ప్రసవాలు తల్లికో, బిడ్డకో ప్రాణ హాని కలిగించేవి. ప్రసవ సమయపు యాతనలూ, దుఃఖాంతమైన ప్రసవాలూ, ప్రసవానంతరం తలెత్తే ఆరోగ్య సమస్యలూ అనుభవించే వారికే కాక, వాళ్ళ కుటుంబీకులకు గూడా జీవితమంటే విరక్తి కలిగించేవి. కానీ ఆ వైరాగ్యాలు నిలిచేవి కావు. అందుకే సంవత్సరం తిరక్కుండా మళ్ళీ సీమంతాలూ, సంబరాలూ, ప్రసవాలూ!

సన్నిహిత బంధువుల మృతదేహాలనూ, శ్మశానంలో జరిగే శవదహన కాండలనూ చూసినప్పుడు కూడా వైరాగ్యం ముసురుకొంటుంది. 'బతికున్నన్నాళ్లూ ఆరాట పడటమే గానీ, అసలు జీవితంలో ఏముంది? ఇది క్షణ భంగురం, వెంట వెళ్ళేదేమీ ఉండదు' అనిపిస్తుంది. కానీ త్వరలోనే ఈ వైరాగ్యం మనల్ని వీడుతుంది.

అంతదాకా ఎందుకు? గుడికి వెళ్ళి, అక్కడ ఏ పాండవ వనవాస ఘట్టమో, పాదుకా పట్టాభిషేకమో పురాణంగా వింటేనే, శ్రోతలకు ప్రాపంచిక జీవితం పట్ల కొంత విరక్తి కలుగుతుంది. గుడి నుంచి ఇంటికి తిరిగొచ్చేదాకా 'ఏది శాశ్వతం?' అంటూ వైరాగ్యపు మాటలూ, ఆలోచనలూ నడుస్తాయి. కానీ స్వగృహం చేరేసరికల్లా, ఈ 'పురాణ వైరాగ్యం' చల్లబడి సెలవు పుచ్చుకొంటుంది.

అశాశ్వతమని తెలిసిన విషయాల గురించి మితిమీరి తాపత్రయపడేవాడికి దుఃఖం తప్పదు. ప్రాపంచిక వ్యవహారాలలో తామరాకు మీద నీటిబొట్టులా, నిర్లిప్తంగా ఉండే ధన్యుడే ఆనందంగా ఉండగలడు అని చెప్పేది వేదాంతులే కాదు, జీవితానుభవం కూడా!

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, తిథి: బ.పాడ్యమి రా.12.03 వరకు, తదుపరి విదియ, నక్షత్రం: పుష్యమి ఉ.9.55 వరకు, తదుపరి ఆశ్లేష, వర్జ్యం: రా.11.54 నుండి 1.38 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.49 నుండి 9.37 వరకు, తదుపరి ప.12.35 నుండి 1.23 వరకు, అమృతఘడియలు: లేవు; రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు, సూర్యోదయం: 6.38, సూర్యాస్తమయం: 5.48.

బాబు స్క్రిప్టు... షర్మిల రిపీట్



రూ.70 వేల కోట్ల విలువైన పోర్టును రూ.600 కోట్లకు అమ్మేశారంటూ అబద్ధాలు

పోర్టులో 89.6% వాటా డీవీఎస్ రాజు కుటుంబానిది

రూ.6,200 కోట్ల వాల్యుయేషన్‌తో ఈ వాటాను కొన్న అదానీ గ్రూపు

- అది ఇద్దరు ప్రయివేటు వ్యక్తుల మధ్య డీల్... ప్రభుత్వానికేం సంబంధం?
- ప్రభుత్వంతో డీవీఎస్ రాజుకైనా, అదానీకైనా అది 30 ఏళ్ల లీజు ఒప్పందమే
- లీజు గడువు ముగిశాక పోర్టు ఆస్తులు, భూములు అన్నీ ప్రభుత్వానికే
- లీజు, రాయల్టీ రూపంలో గత రెండేళ్లలో ప్రభుత్వానికి రూ.60 కోట్ల ఆదాయం
- ఇవన్నీ వదిలిపెట్టి బాబు స్క్రిప్టుతో షర్మిల కూడా పచ్చి అబద్ధాలు

సాక్షి, అమరావతి: కళ్లు మూయకుండా అబద్ధాలు చెప్పడంలో దిట్టగా పేరొందిన చంద్రబాబు... అవి అబద్ధాలని అందరికీ తెలిసిపోతుండటంతో తన స్క్రిప్టును చదవటానికి ఇతరులను ప్రిపేర్ చేస్తున్నారు. ఇప్పటికే పవన్ కళ్యాణ్‌ను రంగంలోకి దించేసిన బాబు... ఇపుడు పీసీసీ అధ్యక్షురాలి హోదాలో షర్మిలను ప్రవేశపెట్టి, తన స్క్రిప్టును ఆమెచేత కూడా వల్లె వేయిస్తున్నారు. అందుకేనేమో... గంగవరం పోర్టుపై కనీస అవగాహన కూడా లేనట్లుగా ఆమె చంద్రబాబు చేసిన ఆరోపణలనే రిపీట్ చేశారు. రూ.70,000కోట్ల విలువైన గంగవరం పోర్టును అదానీ గ్రూపునకు రాష్ట్ర ప్రభుత్వం రూ.600 కోట్లకు అమ్మేసిందంటూ ఆమె బుధవారం విశాఖలో మాట్లాడారు. అసలు ఆ పోర్టు విలువ ఆమె చెప్పిన దాన్లో 10 శాతం కూడా లేదని... అందులోనూ ఆ పోర్టులో 89.6 శాతం వాటా ప్రయివేటు వారిదని, దాన్ని అదానీ కొనుగోలు చేసిందని... అది ఇద్దరి మధ్య జరిగిన ప్రయివేటు డీల్ అనే వాస్తవాన్ని మాత్రం చెప్పలేదు. పీపీపీ విధానంలో అభివృద్ధి చేసిన గంగవరం పోర్టులో 89.6 శాతం వాటా ప్రమోటర్ డీవీఎస్ రాజు, ఆయనకు పెట్టుబడులు సమకూర్చిన ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీది. మరి అలాంటి పోర్టును రాష్ట్ర ప్రభుత్వం రూ.600 కోట్లకు ఎలా విక్రయిస్తుంది? రాష్ట్రం విక్రయించగలిగేది తన చేతిలో ఉన్న 10 శాతం వాటానే కదా? వాస్తవానికి డీవీఎస్ రాజు గ్రూపు-అదానీ గ్రూపు ఆ పోర్టు విలువను ఆర్థిక సంస్థల చేత మదింపు చేయించగా రూ.6,200 కోట్లుగా లెక్కగట్టాయి. దీంతో అదే ధరకు డీవీఎస్ రాజు, ఇన్వెస్ట్‌మెంట్ సంస్థలకున్న వాటాను అదానీ గ్రూపు కొనుగోలు చేసింది. మరి ఈ షర్మిల చెప్పిన రూ.70వేల కోట్లు ఎక్కడ నుంచి వచ్చాయి?

వాస్తవానికి అవి చంద్రబాబు స్క్రిప్టులో నుంచి వచ్చాయి. గతంలో బాబు కూడా అది రూ.70వేల కోట్ల విలువైన పోర్టు అని... దాన్ని ప్రభుత్వం రూ.600 కోట్లకే విక్రయించేసిందని పచ్చి అబద్ధాలతో ప్రభుత్వంపై బురదజల్లారు. కానీ ప్రభుత్వం వాస్తవాలను వివరిస్తూ గట్టిగా స్పందించటంతో... ఇప్పుడు అదే బురదను షర్మిల ద్వారా చల్లిస్తున్నారు. నిజానికి ప్రభుత్వానిది ఈ పోర్టులో 10.4 శాతం వాటా మాత్రమే. అయితే పోర్టు విస్తరణకు వీలుగా ఆ వాటా విక్రయించాలని కొనుగోలుదారు అభ్యర్థించటంతో ప్రభుత్వం నిపుణులు సూచించిన ధరకన్నా రూ.20 కోట్లు అధికంగానే... అంటే రూ.644.45 కోట్లకు దీన్ని విక్రయించింది. పైపెచ్చు ఆ నిధులతో ఇపుడు మరో మూడు కొత్త పోర్టులను ప్రభుత్వమే సొంతంగా అభివృద్ధి చేస్తోంది. ఇక డీవీఎస్ రాజు, ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ వార్‌బర్గ్ పింకస్ చేతి నుంచి అదానీ గ్రూపు చేతికి మారింది పోర్టు నిర్వహణ మాత్రమే. ప్రభుత్వంతో గతంలో కుదిరిన లీజు ఒప్పందంలో ఎలాంటి మార్పులూ లేవు. మరి భూములతో సహా విక్రయించేసినట్లు మాట్లాడటం షర్మిల అవగాహన రాహిత్యానికి నిదర్శనం కాదా?.

కొత్త పోర్టుల నిర్మాణానికి నిధులు

అదానీ గ్రూపు ప్రతిపాదనను పరిశీలించడానికి రాష్ట్ర ప్రభుత్వం 2021 జూన్ 4న కార్యదర్శుల బృందాన్ని ఏర్పాటు చేసింది. విలువ మదింపు కోసం సెబీ గుర్తింపు పొందిన కేపీఎంజీ, న్యాయ సలహాల కోసం జేఎస్‌ఏ అసోసియేట్స్, ఒప్పందంలో పాటించాల్సిన సలహాల కోసం గ్రాంట్ థార్న్‌టన్‌లకు బాధ్యతలను ఈ కమిటీ అప్పగించింది. వారు గంగవరం పోర్టు షేరు ధరను రూ.115గా లెక్కించారు. రూ.5 అదనంగా చెల్లిస్తుండటంతో ప్రభుత్వానికి ఎటువంటి నష్టం లేదని తెలిపారు. దీనిపై సుప్రీంకోర్టు రిటైర్డ్ సీజే సలహా తీసుకొని ప్రభుత్వం ముందుకు వెళ్లింది. తన 10.4 శాతం వాటాను రూ.644.45 కోట్లకు విక్రయించింది. ఈ మొత్తాన్ని కొత్తగా చేపట్టిన రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టులకు ప్రభుత్వం వినియోగిస్తోంది.

గంగవరం పోర్టు రాయల్టీ, లీజు అద్దె

(రూ.కోట్లలో..)

	2021-22	2022-23	మొత్తం
రాయల్టీ	25.26	32.17	57.43
లీజు అద్దె	1.29	1.29	2.58
మొత్తం	26.55	33.46	60.01

పోర్టు విలువ రూ.6,200 కోట్లుగా మదింపు

పీపీపీ విధానంలో ప్రమోటరు డీవీఎస్ రాజు గంగవరం పోర్టు లిమిటెడ్ పేరుతో ఈ పోర్టును అభివృద్ధి చేశారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 1,800 ఎకరాల భూమి విలువ రూ.54 కోట్లుగా లెక్కించి పోర్టులో 10.4 శాతం వాటాను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంది. మిగిలిన వాటాలో ప్రధాన ప్రమోటరు డీవీఎస్ రాజు చేతిలో 58.1 శాతం, పోర్టు నిర్మాణానికి నిధులు సమకూర్చిన ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ విండీ లేక్‌సైడ్ ఇన్వెస్ట్‌మెంట్ (వార్‌బర్గ్ పింకస్) పేర 31.5 శాతం ఉన్నాయి. పోర్టు విలువను రూ.6,200 కోట్లుగా మదింపు చేసి, ఆ మేరకు ప్రమోటర్ల నుంచి 89.6 శాతం వాటాను అదానీ గ్రూపు కొనుగోలు చేసింది. అది ఆ ఇద్దరి మధ్య జరిగిన ప్రయివేటు ఒప్పందం. ఇక పోర్టు కొన్నాక అదానీ గ్రూపు కొత్తగా రెండు టెర్మినల్స్ అభివృద్ధి చేయడంతోపాటు లాజిస్టిక్ వంటి విభాగాల్లో భారీ విస్తరణ చేపట్టింది. కానీ దీన్లో ప్రభుత్వ వాటా 10.4 శాతం ఉండటం వల్ల ఇబ్బందులు రావటంతో ఆ వాటాను కూడా కొనుగోలు చేస్తామని ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ప్రమోటర్లకు చెల్లించిన విధంగానే షేరుకు రూ.120 చొప్పున చెల్లించడానికి ముందుకు వచ్చింది.

ఆస్తులు, భూములు తిరిగి ఇచ్చే విధంగా ఒప్పందం

ఇక పోర్టులో వాటా విక్రయం తర్వాత రాయితీలకు సంబంధించి అదానీ గ్రూపుతో ఏపీ మారిటైమ్ బోర్డు స్పష్టమైన ఒప్పందం చేసుకుంది. 30 ఏళ్ల లీజు తర్వాత పోర్టు ఆస్తులు, భూములు తిరిగి ఇచ్చే నిబంధనను అందులో పొందుపరిచింది. ఒకవేళ లీజు గడువు పెంచుకోవాలంటే ప్రభుత్వ అనుమతితో 10 ఏళ్లు చొప్పున రెండు సార్లు పెంచుకునేందుకు అనుమతిస్తారు. ఇక పోర్టు వ్యాపారంలో 2.1 శాతం చొప్పున రాష్ట్ర ప్రభుత్వానికి రాయల్టీగా చెల్లించాలి. ఆ విధంగా పోర్టు నిర్వహణను అదానీ చేపట్టిన తర్వాత రెండేళ్లలో (2021–22, 2022–23 ఆర్థిక సంవత్సరాల్లో) రాయల్టీ, లీజు అద్దె రూపంలో రాష్ట్ర ఖజానాకు రూ.60.01 కోట్ల ఆదాయం సమకూరింది. త్వరలో కొత్తగా అభివృద్ధి చేసిన రెండు కార్గో టెర్మినల్స్ అందుబాటులోకి రానున్నాయి. దీంతో ఆదాయం మరింత పెరుగుతుందని, ఈ పోర్టుపై ప్రభుత్వం ఎలాంటి హక్కులను వదులుకోలేదని ఏపీ మారిటైమ్ బోర్డు స్పష్టం చేసింది.



బాబు మాటలే బట్టీపట్టి చెబుతున్న షర్మిల

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం, రాజకీయాలపై ఆమెకు అవగాహన లేదు

- తెలంగాణలో ఉన్నాననుకుని మాట్లాడుతోందేమో?
- ఆమెకు ఏం అన్యాయం జరిగిందో స్పష్టంగా చెప్పాలి
- పదవుల కోసమే అప్పట్లో జగన్ కోసం షర్మిల నిలబడ్డారా?
- ఆ సమయంలో పార్టీ శ్రేణులు ఎంతో కష్టపడ్డారు.. ఎవరి బాధ్యతలు వారు నిర్వర్తించారు
- కుటుంబం పదవులు పంచుకుంటే ప్రజాస్వామ్యం ఎలా అవుతుంది?
- వైఎస్ కుటుంబాన్ని కాంగ్రెస్ అధిష్టానం ఎంతగా వేధించిందో షర్మిలకూ తెలుసు
- వైఎస్ ఆశయాలు, పథకాలను తుంగలో తొక్కింది కాంగ్రెస్సే
- వైఎస్ ఆశయాల సాధనే లక్ష్యంగా పార్టీని స్థాపించిన జగన్
- మహానేత వైఎస్‌కు సరైన వారసుడు జగన్ కాబట్టే జనం పట్టం కట్టారు
- వైఎస్సార్‌టీపీలో ఉన్నప్పుడు మణిపూర్‌పై మాట్లాడలేదెందుకు?
- వైఎస్‌పై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఆమె ఎందుకు ప్రశ్నించలేదు?
- కోట్లాది హృదయాల్లో నిలిచినందుకు జన్మ ధన్యమైందని జగన్ అనడంలో తప్పేముంది?
- బలం లేకున్నా రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసి నాటకమాడాలని చూస్తున్న చంద్రబాబు
- ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధి, రాజకీయాలపై ఏమాత్రం అవగాహన లేని షర్మిల.. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, ఎల్లో మీడియా ఇచ్చిన స్క్రిప్ట్‌నే పోటీ పరీక్షలకు విద్యార్థి సిద్ధమైనట్లుగా బట్టీ పట్టి చదువుతున్నారని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. ఆమె మాట్లాడుతున్న మాటలకు ఒకదానికి, మరొకదానికి పొంతన లేదన్నారు. షర్మిల మాటలను చూస్తే.. బహుశా ఆమె తెలంగాణలో ఉండి మాట్లాడుతున్నట్లుగా అనుకుంటున్నారేమో అని అన్నారు. ఆయన గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

సోనియా వేధింపులు షర్మిలకు తెలుసు

వైఎస్ రాజశేఖరరెడ్డి హఠాన్మరణాన్ని తాళలేక మరణించిన వారి కుటుంబాలకు భరోసా కల్పించడానికి జగన్ చేపట్టిన ఓదార్పు యాత్రను అడ్డుకోవడానికి సోనియాగాంధీ యత్నించారు. అప్పట్లో సోనియాను జగన్, విజయమ్మ, షర్మిల కలిశారు. అక్కడేం జరిగిందో షర్మిలకు కూడా తెలుసు. వైఎస్ పథకాలను తుంగలో తొక్కి, ఆశయాలను పక్కన పెట్టేందుకు సిద్ధమైన సోనియాతో విభేదించి జగన్ ఓదార్పు యాత్ర చేపట్టినప్పటి నుంచి కక్ష సాధింపు మొదలు పెట్టి వేధించిన విషయమూ షర్మిలకు తెలుసు. వైఎస్ వివేకానందరెడ్డిని మంత్రిని చేసిన సోనియా.. వైఎస్సార్‌సీపీ స్థాపించాక పులివెందుల ఉప ఎన్నికలో వైఎస్ విజయమ్మపై వివేకానందరెడ్డిని పోటీ పెట్టడం ద్వారా కుటుంబాన్ని చీల్చిన విషయాన్ని జగన్ గుర్తుచేశారు. ఇప్పుడూ అదే రీతిలో కుటుంబాన్ని చీల్చి షర్మిలను పీసీసీ చీఫ్‌గా చేశారని జగన్ ఎత్తిచూపారు. ప్రజలు జగనే వైఎస్‌కు సరైన వారసుడు అనుకున్నారు కాబట్టే వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టారు.

మహానేత వైఎస్ ఆశయ సాధనే ఊపిరిగా..

సీఎం జగన్ వైఎస్సార్ బిడ్డగా ఆ రోజు మొదలు పెట్టిన ప్రస్థానం.. నేడు ఉధృతమైన ప్రవాహంలా సాగుతోంది. దానికి కారణం వైఎస్ ఆశయాలను, ఆలోచనలను జగన్ మనసా వాచా నమ్మి వాటిని మరింత మెరుగుపర్చి అమలు చేస్తున్నారు. పార్టీని నడపడం, విలువలను పాటించడం, నిజాయితీ, నిబద్ధతలో ఎన్ని ఆటుపోట్లనైనా తట్టుకొంటూ వైఎస్ అడుగుజాడల్లో నడుస్తున్నారు. ఆనాడు అక్రమ కేసుల్లో 16 నెలలు జైల్లో పెట్టడం నుంచి చంద్రబాబు 23మంది ఎమ్మెల్యేలను పశువులను కొన్నట్లు కొన్నప్పుడూ జగన్ చలించలేదు. ఇలా సొంతంగా ఎదిగిన వ్యక్తి జగన్. జగన్ తండ్రి వైఎస్ అని చెప్పుకోవడం ఏ తండ్రికైనా గర్వకారణమే. వైఎస్ బిడ్డగా, జగన్ సోదరిగా షర్మిలకు అభిమానులు గౌరవం ఇస్తారు. గుండెల్లో పెట్టుకుంటారు.

ఏం అన్యాయం జరిగిందో షర్మిలే చెప్పాలి

జగన్ కాంగ్రెస్‌ను వీడి వైఎస్సార్‌సీపీని స్థాపించినప్పుడు లక్షలాది కార్యకర్తలు ఆయన వెంట కదిలారు. త్యాగాలు చేశారు. అందరూ కష్టపడ్డారు. జగన్ జైలులో ఉన్న సమయంలోనే కదా షర్మిల పాదయాత్ర చేశారు. ఆ సమయంలో పార్టీ నేతలు, శ్రేణులు, అందరూ ఎంతో కష్టపడ్డారు. అందరికీ రకరకాల బాధ్యతలు అప్పజెప్పారు. ఎవరి బాధ్యతలు వారు నిర్వర్తించారు. షర్మిల పాదయాత్ర చేశారు. అన్యాయం జరిగిందని షర్మిల అంటున్నారు. ఆమెకు ఏం అన్యాయం జరిగిందో స్పష్టంగా చెప్పాలి. పదవి కోసమే ఆమె ఆరోజు జగన్ కోసం నిలబడ్డానని స్పష్టంగా చెప్పగలిగితే సమాధానం చెప్పొచ్చు. పదవుల పంపకంలో అన్యాయం చేశారా? కుటుంబం పదవులు పంచుకోవడానికి ఉందా? అధికారంలో భాగస్వామ్యాలు ఉంటాయా? అది చర్చించడానికి అర్థమైనదేనా? కుటుంబం పదవులు పంచుకొంటే ప్రజాస్వామ్యం ఎలా అవుతుంది?



సంఖ్యా బలం లేకున్నా పోటీనా?

శాసనసభలో సంఖ్యా బలాన్ని బట్టి చూస్తే.. ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలూ వైఎస్సార్‌సీపీకి దక్కుతాయి. సంఖ్యా బలం లేకున్నా రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేయాలని దుర్మార్గమైన, వికృతమైన ఆలోచనలతో చంద్రబాబు నాటకం ఆడాలనుకుంటున్నారు. ఎన్నికలప్పుడు అభ్యర్థుల మార్పు సాధారణం. మరింత మెరుగైన ఫలితాల కోసమే మార్పులు చేస్తున్నాం. టికెట్లు దక్కని ఎమ్మెల్యేలను ఎలా ఉపయోగించుకోవాలో మేం చూసుకుంటాం. దొంగతనంగా వారిని లాక్కోవాలని చంద్రబాబు ప్రయత్నించడం ప్రజాస్వామ్యమేనా? గంటా శ్రీనివాసరావు రాజీనామాను ఆమోదించడం పూర్తిగా స్పీకర్ విచక్షణాధికారం.

వైఎస్సార్‌టీపీ కార్యకర్తలకు షర్మిల ఏం న్యాయం చేశారు?

తెలంగాణలో షర్మిల పెట్టిన వైఎస్సార్‌టీపీ కోసం చాలా మంది కష్టపడి ఉంటారు కదా. వారికి షర్మిల ఏం న్యాయం చేశారు? వారి భవిష్యత్తు గురించి ఏం ఆలోచన చేశారు? వైఎస్సార్‌టీపీని కాంగ్రెస్‌లో విలీనం చేసి రాష్ట్రానికి వచ్చిన షర్మిలను భుజానికెత్తుకుని మోస్తున్న ఎల్లో మీడియా.. తెలంగాణలో కాంగ్రెస్ గెలుపులో షర్మిలకు భాగముందని ఎందుకు రాయలేదు? అప్పుడూ ఇప్పుడూ జగన్‌పై షర్మిల బాణాలు ఎక్కుపెట్టినప్పుడే వాటినే ఎల్లో మీడియా ప్రచురిస్తోంది. వైఎస్ మరణంపై రేవంత్‌రెడ్డి ఇటీవల అనుచిత వ్యాఖ్యలు చేసినప్పుడు షర్మిల ఎందుకు స్పందించలేదు?

వైఎస్ పథకాలు లేవంటే తీసుకున్న వాళ్లంతా ఎవరు?

వైఎస్ పథకాలను తీసేశారని షర్మిల మాట్లాడితే ఏమనాలో అర్థం కావడంలేదు. చంద్రబాబు, రాధాకృష్ణ వద్ద నుంచి వచ్చిన స్క్రిప్ట్‌ను బట్టీ పట్టి చెప్పినప్పుడు వాస్తవాలు ఆమెకు తెలిసి ఉండకపోవచ్చు. అప్పట్లో వైఎస్ అమలుచేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, రైతు భరోసా ఇప్పుడు షర్మిల లేవంటున్నారు. రైతులకు నేడు ఇస్తున్నంత భరోసా దేశంలో మరెక్కడైనా ఉందా? అసలు క్రాప్ ఇన్సూరెన్స్ లేదంటున్నారు. తీసుకున్న రైతులంతా ఏమనుకుంటారు? పాపం ఆమె తెలియక ఇంత అబద్ధం మాట్లాడి ఉండొచ్చు. బహుశా చంద్రబాబు కూడా వీటిపై మాట్లాడటానికి సాహసం చేయకపోవచ్చు. చంద్రన్న కానుకలు లేవని అనొచ్చు కానీ, ఈ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు లేవని మాత్రం ఆయనా అనలేడు. షర్మిలమ్మే తిట్లు తింటుందిలే అని చంద్రబాబు ఆ తప్పుడు స్క్రిప్ట్ రాసిచ్చి ఉండొచ్చు. వైఎస్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీలో సీఎం జగన్ ఆరోజుతో పోలిస్తే 3వేలకు పైగా ప్రొసీజర్స్ పెంచారు. రూ.25 లక్షల వరకూ పరిమితి పెంచారు. అర్హత కోసం ఆదాయాన్ని రూ.5 లక్షలు చేశారు. 90 శాతం కుటుంబాలు కవర్ అవుతున్నాయి. ఇవి నిజం కాదా? ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆనాడు రూ.30 వేల నుంచి రూ. 35 వేలు ఇస్తే, ఇప్పుడు వంద శాతం చెల్లిస్తున్నది వాస్తవం కాదా? కేవలం జగన్ చెల్లెలు, వైఎస్ బిడ్డ అనే ఏకైక అర్హతతో ఇక్కడకు సోనియా గాంధీ తెచ్చి పీసీసీ చీఫ్ పదవి ఇచ్చింది. రోజు రోజుకు అబద్ధాలతో షర్మిల మాటల దాడి చేస్తున్న అంశాన్ని ప్రజలు గమనించాలి.

భావోద్వేగంతో స్పందించిన మాటలపై చిల్లర రాజకీయమా?

సీఎం జగన్‌ది విలక్షణమైన వ్యక్తిత్వం. ఏదీ ఆయన హక్కు అనుకోరు. చంద్రబాబు అధికారం ఆయన హక్కు అనుకుంటాడు. చంద్రబాబు ఎప్పుడూ బాధ్యతతో అధికారంలోకి రాలేదు. అందుకే ఆయన అధికారంలోకి రాగానే.. మరో 50 ఏళ్ల తర్వాత ఏం చేస్తాడో ఇప్పుడే చెబుతుంటాడు. కానీ మన రాజ్యాంగం ప్రకారం ప్రజలు ఐదేళ్లకే అధికారం ఇచ్చారు. ఆ స్పృహ జగన్‌కు ఉంది. ఎప్పుడైనా ప్రజలే నిర్ణేతలని గట్టిగా నమ్ముతారు. ఐదేళ్ల తర్వాత ప్రజల వద్దకు వెళ్లి దీవెనలు కోరాలని భావిస్తారు. ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో రాజ్‌దీప్ సర్దేశాయ్ 'మీకిది సంతృప్తినిస్తోందా' అని అడిగితే.. దానికి భావోద్వేగంతో జగన్ స్పందించారు. నాలుగున్నరేళ్ల తన పాలనలో ఇన్ని కోట్ల మంది హృదయాల్లో స్థానం సంపాదించి.. ప్రతి ఒక్కరి మోహంలో చిరునవ్వు నింపినందుకు జన్మ ధన్యమైందని చెబుతూ.. ఒకవేళ తప్పుకోవాలన్నా పూర్తి సంతృప్తితో చేస్తాను అన్నారు. ఎవరైనా ఇలా అనగలరా? మహా స్థితప్రజ్ఞుడు మాత్రమే అనగలడు. ఇప్పటికీ 75 ఏళ్ల వయసులోనూ ఎలా ముఖ్యమంత్రి కుర్చీ పట్టుకోవాలని అనుకునే చంద్రబాబు అయితే ఈ మాట అనలేడు. ఈ రాష్ట్రానికి ఏమి చేయగలిగాడో చెప్పుకోవడానికి జగన్‌కు చాలా ఉంది. ఆ తృప్తినే ఆయన వ్యక్తీకరించారు. దానికి ఓ చిల్లర భావాన్ని ఇచ్చి ఎల్లో మీడియా సంతోషిస్తే ఏం చేయలేం.

హోదా, విశాఖ స్టీల్‌పై మోదీ సభలోనే గళమెత్తిన జగన్

బీజేపీకి వైఎస్సార్‌సీపీ టూల్‌లా మారిందని, రాష్ట్రాన్ని అప్పజెప్పిందని షర్మిల చేసిన ఆరోపణలు అర్థరహితం. స్టీల్ ప్లాంట్ విషయం కేంద్రానికి సంబంధించింది. ప్రభుత్వ రంగంలోనే స్టీల్ ప్లాంట్‌ను నడిపేలా కేంద్రాన్ని ఒప్పించే ప్రయత్నం మేం చేస్తున్నాం. స్టీల్ ప్లాంట్ అప్పులను రీస్ట్రక్చర్ చేయడం, గనులు కేటాయించడం, అదనంగా ఉండే భూమిని అమ్మి ఆ సొమ్ముతో అప్పులను తగ్గించుకోవడం ద్వారా స్టీల్ ప్లాంట్‌ను లాభాల బాటలో నడిపించవచ్చని సూచిస్తూ కేంద్రానికి సీఎం జగన్ లేఖ రాశారు. విశాఖ స్టీల్ పరిశ్రమ వ్యాపారం కాదని, సెంటిమెంట్‌కు సంబంధించినదని కూడా చెప్పాం. ఇంతకు మించి వేరే రకమైన పోరాటం ఎవరైనా చేయగలరా? ప్రధాని ఉన్న వేదికపైనే ప్రత్యేక హోదా, విశాఖ స్టీల్ ప్లాంట్ గురించి సీఎం జగన్ గళమెత్తారు. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా లేక ఇంకేదైనా ఉందా? పోరాటం అంటే నిర్వచనం, స్వరూపం ఎలా ఉండాలో షర్మిలే చెప్పాలి. గంగవరం పోర్టుపై షర్మిల మాటలు సత్యదూరం. ఆ పోర్టులో మనకున్న వాటా బదులుగా వచ్చిన రూ.600 కోట్లను మరో మూడు పోర్టుల అభివృద్ధికి వినియోగిస్తున్నాం. గంగవరం పోర్టుపై మన హక్కును కోల్పోలేదు. లీజు తర్వాత మళ్లీ అది ప్రభుత్వానికే వస్తుంది. ఇది కాక కొంత రెవెన్యూ షేరింగ్ కూడా ప్రభుత్వానికి వస్తుంది. ఒక పెద్ద సంస్థ వచ్చి ఆపరేషన్స్ చేస్తే రాష్ట్రానికి రెవెన్యూ పెరుగుతుంది. ప్రపంచం మొత్తం ఇలానే చేస్తోంది. ఆమె ఇచ్చింది తలా తోక ఉన్న స్టేట్‌మెంటేనా?

మణిపూర్‌పై అప్పుడెందుకు మాట్లాడలేదు?

మణిపూర్ అంశం షర్మిలమ్మ వైఎస్సార్‌టీపీలో ఉన్నప్పుడే జరిగింది. అప్పుడెందుకు మాట్లాడలేదు? ఎందుకు పోరాడలేదు? ఇక్కడకు రాగానే బీజేపీ, మణిపూర్ అంటూ క్రిస్టియన్లకు అన్యాయం జరిగిందనడంలో ఆంతర్యం తెలియడంలేదా? ఇదంతా ఆమె అనుకున్నది కాదు... చంద్రబాబు అనుకున్నది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు గంపగుత్తగా ఆయనకు రావాలి. అలాగే వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఉన్న మైనార్టీలు, క్రిస్టియన్లు, దళితుల ఓట్లు కోసం మాత్రమే ఆమెను తీసుకొచ్చారు.

పక్క రాష్ట్రాల నుంచి వచ్చి ప్రభుత్వంపై బురద జల్లుతారా?

- 27న భీమిలిలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల శంఖారావం
- ప్రతిపక్షాల దుష్ప్రచారం తిప్పికొట్టేలా కార్యకర్తలకు దిశా నిర్దేశం
- వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



'సిద్ధం' పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, బొత్స సత్యనారాయణ, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వరుదు కల్యాణి తదితరులు

సాక్షి, విశాఖపట్నం: మన రాష్ట్రంలో ఓటు హక్కు లేనివాళ్లు పక్క రాష్ట్రాల నుంచి వచ్చి ప్రభుత్వంపై కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని, ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు 'సిద్ధం'గా ఉన్నామని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి స్పష్టంచేశారు. 'ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని లేదంటే దానికి కారణం ఎవరు? కాంగ్రెస్ కాదా? రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించింది కాంగ్రెస్ కాదా? అటువంటి కాంగ్రెస్ పార్టీలో చేరి మాట్లాడడం సమంజసం కాదు. వైఎస్ కుటుంబాన్ని కాంగ్రెస్ ఎన్ని ఇబ్బందులు పెట్టిందో దేశం మొత్తం తెలుసు. కాంగ్రెస్, చంద్రబాబు కుమ్మక్కై వైఎస్ జగన్‌ను, ఆయన కుటుంబాన్ని వేధించిన విషయాన్ని ప్రజలు ఇంకా మరచిపోలేదు' అని అన్నారు. ఒక్క శాతం కూడా ఓట్లు లేని కాంగ్రెస్, బీజేపీలు తమకు పోటీనే కాదన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల యుద్ధంలో తమ ప్రభుత్వంపై, తమ నాయకుడిపై ప్రతిపక్షాలు చేసే దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేలా యుద్ధానికి పార్టీ కేడర్‌ను సిద్ధం చేయనున్నామని వైవీ సుబ్బారెడ్డి అన్నారు. 'సిద్ధంగా ఉన్నారా.. సిద్ధమా' అని వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులను ఎన్నికలకు సమాయత్తం చేయనున్నామని వివరించారు. ఈ నెల 27న భీమిలి నియోజకవర్గం సంగివలసలో జరగనున్న బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం పరిశీలించిన ఆయన.. మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి 'సిద్ధం' పోస్టర్, సాంగ్‌ను ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ సంగివలసలో జరుగనున్న ఉత్తరాంధ్ర జిల్లాల్లోని 34 నియోజవర్గాల పార్టీ నాయకులు, కార్యకర్తల భారీ బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల శంఖారావం పూరించనున్నారని చెప్పారు. విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ దుష్ట శక్తుల కుట్రలను అడ్డుకునేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఉత్తరాంధ్రలో అభివృద్ధి జరిగిందంటే దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి, ఆయన కుమారుడు జగన్ హయాంలోనేనని అన్నారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

షర్మిలను చూస్తే జాలేస్తోంది

- విద్యాశాఖ మంత్రి బొత్స

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల మాటలు, ఆమె వ్యవహారశైలి చూస్తుంటే జాలేస్తోందని, ఆమె కొత్త విషయాలు ఏమీ చెప్పడం లేదని, చంద్రబాబు స్క్రిప్ట్‌నే చదువుతున్నారని విద్యాశాఖ మంత్రి, శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శించారు. ప్రత్యేక హోదా తాకట్టు పెట్టి.. ప్యాకేజీకి అమ్ముడుపోయింది చంద్రబాబేనని తెలియదా.. అని షర్మిలను ప్రశ్నించారు. అధికార దాహంతో ప్రతిపక్షాలన్నీ కలిసిపోతున్నాయని, వైఎస్సార్‌సీపీకి మాత్రం ప్రజా సంక్షేమం, అభివృద్ధే అజెండా అని తెలిపారు. శ్రీకాకుళంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశమంతా ఏపీ విద్యావిధానాలపై హర్షం వ్యక్తం చేస్తున్నదని చెప్పారు. రాష్ట్రంలో నాడు–నేడు ద్వారా స్కూళ్లలో సమూలమైన మార్పులు తీసుకొచ్చి.. ఇంగ్లిష్ మీడియం విద్యతో పేదపిల్లలకు కార్పొరేట్ విద్యను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని స్పష్టంచేశారు.

అందుకే.. లోకేశ్ పాదయాత్ర..

పనీ పాట లేకుండా ఖాళీగా ఉండి ఏం చేయాలో తెలియక టైంపాస్ కోసం లోకేశ్ పాదయాత్ర చేశారని, కనీసం శ్రీకాకుళం జిల్లాకు రాకుండానే ముగించేశారని మంత్రి బొత్స సత్యనారాయణ ఎద్దేవా చేశారు. '70 రోజులు ఆగితే ఎవరు ప్యాకప్పో.. ఎవరు మ్యాకప్పో.. ఎవరు వాకప్పో తేలిపోతుందని' బొత్స అన్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పీకర్ ఫార్మాట్‌లోనే లెటర్ రాసి.. రాజీనామా విషయం చెప్పారన్నారు. దానిని తమపై ఆపాదిస్తే ఎలా అని మంత్రి ప్రశ్నించారు.

నా రాజీనామా ఆమోదాన్ని చట్ట విరుద్ధంగా ప్రకటించండి

- హైకోర్టులో మాజీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పిటిషన్

సాక్షి, అమరావతి: తన రాజీనామాను ఆమోదిస్తూ శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం ఈ నెల 23న జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ మాజీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హైకోర్టును ఆశ్రయించారు. స్పీకర్ ఉత్తర్వులను, తదనుగుణంగా న్యాయ, శాసన వ్యవహారాల కార్యదర్శి జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను చట్ట విరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ ఆయన గురువారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని హైకోర్టును అభ్యర్థించారు. ఈ వ్యాజ్యం తేలేంత వరకు స్పీకర్ ఉత్తర్వుల అమలును నిలిపివేయాలని కోరారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో పాల్గొనేందుకు, రాజ్యసభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అనుమతినిచ్చేలా ఆదేశాలివ్వాలని కోరారు. ఈ వ్యాజ్యంపై సోమవారం న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ విచారణ జరపనున్నారు.

బీజేపీ వైపు... నితీశ్ చూపు!

ఇండియా కూటమికి గుడ్‌బై!

- మళ్లీ బీజేపీతో జేడీ(యూ) జట్టు?
- అదే జరిగితే కూటమి విచ్ఛిన్నమే!
- బిహార్లో అధికార కూటమికీ షాక్
- లాలూ, నితీశ్ పోటాపోటీ భేటీలు
- అసెంబ్లీ రద్దు దిశగా పరిణామాలు!



పట్నా/న్యూఢిల్లీ: కాంగ్రెస్ సారథ్యంలోని విపక్ష ఇండియా కూటమికి రెండు రోజుల్లోనే మూడో భారీ ఎదురుదెబ్బ! కీలక భాగస్వామి అయిన జేడీ(యూ) అధ్యక్షుడు, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ కూటమికి కటీఫ్ చెప్పేలా కన్పిస్తున్నారు. అవసరార్థపు గోడ దూకుళ్లకు పెట్టింది పేరైన ఆయన 2024 లోక్‌సభ ఎన్నికల ముంగిట యూ టర్న్ తీసుకుని మళ్లీ బీజేపీతో జట్టు కట్టే దిశగా సాగుతున్నారు. ఈ దిశగా బుధవారం నుంచీ జరుగుతున్న వరుస పరిణామాలతో బిహార్లో ఆర్జేడీ, జేడీ(యూ), కాంగ్రెస్, వామపక్షాల మహాఘట్‌బంధన్ సంకీర్ణ సర్కారు కూడా కుప్పకూలేలా కన్పిస్తోంది. ఘట్‌బంధన్‌తో 18 నెలల కలహాల కాపురానికి ఫుల్‌స్టాప్ పెట్టి బీజేపీ మద్దతుతో మరోసారి సీఎం పీఠం కాపాడుకునే ప్రయత్నాలకు నితీశ్ పదును పెట్టారంటూ వార్తలు వస్తున్నాయి. ప్రతిగా ఆర్జేడీ కూడా జేడీ(యూ)తో నిమిత్తం లేకుండా మెజారిటీ సాధనకు ప్రయత్నాలకు పదును పెట్టింది. ఈ దిశగా జేడీ(యూ) సీనియర్ నేతలతో నితీశ్ ఇంట్లో, ఘట్‌బంధన్‌లోని ఇతర పక్షాలతో ఆర్జేడీ చీఫ్ లాలుప్రసాద్ నివాసంలో పోటాపోటీ సమావేశాలతో గురువారం బిహార్ రాజధాని పట్నాలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. నితీశ్ నివాసంలో భేటీలో జేడీ(యూ) ఎమ్మెల్యేలంతా పాల్గొన్నారు. ఇక లాలు ఒకవైపు తన నివాసంలో భేటీ జరుగుండగానే మరోవైపు ఆర్జేడీకే చెందిన అసెంబ్లీ స్పీకర్ అవధ్ బిహారీ చౌధరితో కూడా ఫోన్లో మంతనాలు జరిపారు. దాంతో నితీశ్ మరింత అప్రమత్తయ్యారు. ఆర్జేడీకి ప్రభుత్వ ఏర్పాటుకు ఛాన్సివ్వకుండా అవసరమైతే అసెంబ్లీని రద్దు చేయాలని కూడా ఆయన యోచిస్తున్నట్టు చెబుతున్నారు!

లోక్‌సభ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్లో కాంగ్రెస్‌తో పొత్తుండబోదని, ఒంటరిగానే పోటీ చేస్తామని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, పంజాబ్‌లో ఆప్‌దీ ఒంటరి పోరేనని ఆ రాష్ట్ర సీఎం భగవంత్ మాన్ బుధవారం ప్రకటించడం తెలిసిందే. దాంతో ఒక్కసారిగా డీలా పడ్డ ఇండియా కూటమిలో బిహార్ తాజా పరిణామాలు మరింత కలవరం రేపుతున్నాయి. నితీశ్ బీజేపీ గూటికి చేరితే విపక్ష కూటమి దాదాపుగా విచ్ఛిన్నమైనట్టేనని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో భారత్ జోడో న్యాయ్ యాత్రకు రెండు రోజుల విరామమిచ్చి ఢిల్లీ చేరిన కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ ఈ పరిణామాలన్నింటిపై పార్టీ నేతలతో మంతనాల్లో మునిగిపోయారు. మరోవైపు బిహార్ బీజేపీ చీఫ్ సమ్రాట్ చౌదరి, రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి అశ్వినీ చౌబేతో పాటు జేడీ(యూ) రాజకీయ సలహాదారు కేసీ త్యాగి కూడా ఒకే విమానంలో హుటాహుటిన ఢిల్లీ చేరుకున్నారు. దాంతో హస్తినలోనూ రాజకీయ వేడి తారస్థాయికి చేరుతోంది.



పావులు కదుపుతున్న లాలూ

ఆదినుంచీ కలహాల కాపురమే...

బిహార్లో 2020లో ఏర్పాటైన మహాఘట్‌బంధన్ సంకీర్ణ సర్కారు నిత్యం కలహాలమయంగానే సాగుతూ వస్తోంది. ముఖ్యంగా తేజస్విని సీఎం చేసి తప్పుకోవాలని లాలు కొంతకాలంగా పట్టుబడుతుండటంపై నితీశ్ గుర్రుగా ఉన్నారు. జేడీ(యూ) తాజా మాజీ అధ్యక్షుడు లలన్ సింగ్ సాయంతో ఆ పార్టీ నుంచి డజను మంది ఎమ్మెల్యేలను లాగేసేందుకు లాలు ఇటీవల గట్టి ప్రయత్నమే చేశారు. దాన్ని సకాలంలో పసిగట్టిన నితీశ్ లలన్‌కు ఉద్వాసన పలికి తానే పార్టీ అధ్యక్ష పదవి చేపట్టారు. ఈ ఉదంతంతో ఆర్జేడీతో విభేదాలు తారస్థాయికి చేరాయి. లాలు, నితీశ్‌లిద్దరికీ రాజకీయ గురువైన బిహార్ దివంగత సీఎం కర్పూరి ఠాకూర్ శత జయంత్యుత్సవాల సందర్భంగా బుధవారం నితీశ్ చేసిన వ్యాఖ్యలు విభేదాలకు మరింతగా ఆజ్యం పోశాయి. పార్టీల్లో కుటుంబాల పెత్తనాన్ని కర్పూరి తీవ్రంగా వ్యతిరేకించేశారన్న నితీశ్ వ్యాఖ్యలు ఆర్జేడీని ఉద్దేశించినవేనంటూ లాలు కుటుంబం మండిపడింది. నితీశ్ అవకాశవాది అని తూర్పారబడుతూ లాలు కుమార్తె రోహిణీ ఆచార్య ఎక్స్‌లో పెట్టిన పోస్టులతో పరిస్థితి రసకందాయంలో పడింది. నితీశ్‌పై ఆమె విమర్శలను రాష్ట్ర బీజేపీ అగ్ర నేతలు తీవ్రంగా ఖండించడం, ఆ వెంటనే ఆ పార్టీతో జేడీ(యూ) దోస్తీ అంటూ వార్తలు రావడం... నితీశ్, లాలు నివాసాల్లో పోటాపోటీ సమావేశాల తదితర పరిణామాలు వెంటవెంటనే జరిగిపోయాయి.

గిరిరాజ్ చెణుకులు

పదేపదే ఆర్జేడీపై అలగడం నితీశ్‌కు పరిపాటేనంటూ కేంద్ర మంత్రి, బీజేపీ అగ్ర నేత గిరిరాజ్‌సింగ్ విసిరిన చెణుకులు గురువారం వైరల్‌గా మారాయి. "నే పుట్టింటికి వెళ్లిపోతా. నువ్వు చూస్తూ ఉండిపోతావ్ అని పాడుతూ లాలును నితీశ్ చీటికీమాటికీ బెదిరిస్తుంటారు. కానీ పుట్టింటి (బీజేపీ) తలుపులు తనకు శాశ్వతంగా మూసుకుపోయాయన్న వాస్తవాన్ని మాత్రం దాస్తుంటారు" అంటూ తాజా పరిణామాలపై గిరిరాజ్ స్పందించారు.

తెరపైకి మెజారిటీ లెక్కలు...

నితీశ్ బీజేపీ గూటికి చేరతారన్న వార్తల నేపథ్యంలో బిహార్ అసెంబ్లీలో బలాబలాలు మరోసారి తెరపైకొచ్చాయి. 243 మంది సభ్యుల అసెంబ్లీలో మెజారిటీ మార్కు 122. మహాఘట్‌బంధన్ ప్రస్తుత బలం 159. 45 మంది ఎమ్మెల్యేలున్న జేడీ(యూ) నిష్క్రమిస్తే ఆర్జేడీ (79), కాంగ్రెస్ (19), వామపక్షాల (16)తో కూటమి బలం 114కు పడిపోతుంది. అప్పుడు మెజారిటీకి మరో 8 మంది ఎమ్మెల్యేలు అవసరమవుతారు. జితిన్‌రాం మాంఝీ సారథ్యంలోని హెచ్ఏఎం (4), మజ్లిస్ (1), స్వతంత్ర ఎమ్మెల్యే (1) మద్దతు కూడగట్టినా 120కే చేరుతుంది. మెజారిటీకి మరో ఇద్దరు ఎమ్మెల్యేలు కావాలి. ఈ నేపథ్యంలో మాంఝీ తదితరులతో పాటు జేడీ(యూ) అసంతృప్త ఎమ్మెల్యేలతో కూడా ఆర్జేడీ చీఫ్ లాలు జోరుగా మంతనాలు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్జేడీకి చెందిన స్పీకర్ పాత్ర కూడా కీలకంగా మారేలా కన్పిస్తోంది. మరోవైపు బీజేపీ, జేడీ(యూ) కలిస్తే 123 మంది ఎమ్మెల్యేలతో మెజారిటీ మార్కును అలవోకగా దాటేస్తాయి. తద్వారా తానే సీఎంగా కొనసాగాలని నితీశ్ భావిస్తున్నట్టు సమాచారం. కానీ అందుకు బీజేపీ సుముఖంగా లేదని, తమకే సీఎం ఛాన్సివ్వాలని భావిస్తోందని చెబుతున్నారు. అందుకు నితీశ్ అంగీకరించే పక్షంలో ఆయనను కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకుంటారని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

బిహార్ అసెంబ్లీలో ప్రస్తుత బలాబలాలు

మొత్తం స్థానాలు	243
ఆర్జేడీ	79
బీజేపీ	78
జేడీ(యూ)	45
కాంగ్రెస్	19
వామపక్షాలు	16
హెచ్ఏఎం(ఎస్)	4
మజ్లిస్	1
స్వతంత్రుడు	1

గోడదూకుళ్లలో ఘనాపాఠి

రాజకీయ గాలికి స్వీయ ప్రయోజనాలకు అనుగుణంగా మంచినీళ్ల ప్రాయంగా కూటములను మార్చడంలో నితీశ్‌కుమార్ సిద్ధహస్తుడు. దాంతో ఆయన్ను పల్టూ (పిల్లి మొగ్గల) కుమార్‌గా పిలవడం పరిపాటిగా మారింది. బీజేపీ వాజ్‌పేయీ, అడ్వాణీల సారథ్యంలో సాగినంత కాలం ఆ పార్టీతో నితీశ్ బంధం అవిచ్ఛిన్నంగా సాగింది. వారి శకం ముగిసి నరేంద్ర మోదీ తెరపైకి రావడంతో పొరపొచ్చాలు మొదలయ్యాయి. ఆయన్ను ప్రధాని అభ్యర్థిగా ప్రకటించడంతో బీజేపీతో 17 ఏళ్ల బంధానికి 2013లో తొలిసారిగా గుడ్‌బై చెప్పారు. 2014 లోక్‌సభ ఎన్నికల తర్వాత బిహార్ సీఎంగా తప్పుకుని జితిన్‌రాం మాంఝీని గద్దెనెక్కించారు. తన బద్ధ విరోధి అయిన లాలు సారథ్యంలోని ఆర్జేడీతో పొత్తు ద్వారా సర్కారును కాపాడుకున్నారు. 2015లో ఆర్జేడీ, కాంగ్రెస్‌లతో మహాఘట్‌బంధన్‌గా అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లారు. ఘనవిజయం సాధించి మళ్లీ సీఎం అయ్యారు. కానీ సంఖ్యాబలంలో ఆర్జేడీ పెద్ద పార్టీగా అవతరించడంతో నితీశ్ ప్రాధాన్యం తగ్గుతూ వచ్చింది. లాలు కుమారుడు తేజస్విని అయిష్టంగానే డిప్యూటీ సీఎం చేయాల్సి వచ్చింది. రెండేళ్లలోపే కూటమిలో పొరపొచ్చాలు పెద్దవయ్యాయి. సరిగ్గా అదే సమయంలో లాలు, తేజస్విలపై సీబీఐ కేసులు నితీశ్‌కు అందివచ్చాయి. డిప్యూటీ సీఎం పోస్టుకు రాజీనామా చేసేందుకు తేజస్వి ససేమిరా అనడంతో తానే సీఎం పదవికి రాజీనామా చేసి 2017లో కూటమి సర్కారును కుప్పకూల్చారు. గంటల వ్యవధిలోనే బీజేపీ మద్దతుతో మళ్లీ గద్దెనెక్కి ఔరా అనిపించారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ విజయంతో నితీశ్ మళ్లీ సీఎం అయ్యారు. కానీ ఈసారి బీజేపీ పెద్ద పార్టీగా అవతరించడంతో ఏ విషయంలోనూ తన మాట సాగక ఉక్కపోతకు గురయ్యారు. చివరికి జేడీ(యూ)ను చీల్చేందుకు బీజేపీ కుట్ర చేస్తోందంటూ 2022 ఆగస్టులో దానికి గుడ్‌బై చెప్పారు. మర్నాడే ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలతో మహాఘట్‌బంధన్ సర్కారు ఏర్పాటు చేసి సీఎం పీఠం కాపాడుకున్నారు. తాజాగా నితీశ్ మళ్లీ బీజేపీ వైపు చూస్తున్నారన్న వార్తలు నిజమైతే ఇది ఆయనకు ఐదో పిల్లిమొగ్గ అవుతుంది!



గురువారం జాతినుద్దేశించి ప్రసంగిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

వారసత్వ ప్రతీక రామమందిరం

రామమందిర నిర్మాణ ఘట్టం చరిత్రలో నిలిచిపోతుంది

గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ముర్ము ప్రసంగం

న్యూఢిల్లీ: భారత్ తన పురాతన నాగరికత వారసత్వాన్ని పునరుజ్జీవింపజేసుకున్న అద్భుత ఘడియగా 'రామ మందిర నిర్మాణ ఘట్టం' నిలిచిపోతుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వ్యాఖ్యానించారు. భారతదేశ 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతినుద్దేశిస్తూ రాష్ట్రపతి ముర్ము ప్రసంగించారు. '' అయోధ్యలో రామమందిర దివ్యధామం ప్రజల విశ్వాసాలను మాత్రమే కాదు న్యాయవ్యవస్థ పట్ల ప్రజలకున్న అచంచల విశ్వాసానికీ నిలువెత్తు నిదర్శనం'' అని అన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాల పనితీరునూ ఆమె ప్రస్తావించారు. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల మధ్య రగులుతున్న ఘర్షణలు, మానవీయ సంక్షోభాలు, యుద్ధాలపై ఆందోళన వ్యక్తంచేశారు. ఘర్షణలకు మూలాలను వెతక్కుండా భయాలు, విద్వేషంతో ఆయా దేశాల ప్రజలు కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రపతి ప్రసంగంలోని ముఖ్యాంశాలు కొన్ని ఆమె మాటల్లోనే..

జీ20 ఆతిథ్యం ఎన్నో నేర్పింది

''న్యాయ ప్రక్రియ, సుప్రీంకోర్టు సముచిత తీర్పుల తర్వాతే అయోధ్యలో రామమందిర నిర్మాణానికి బాటలు పడ్డాయి. ఈ ఆలయం నిర్మాణం ద్వారా భారత్ తన నాగరికత వారసత్వ పరంపరను కొనసాగిస్తున్నట్లు మరోమారు ప్రపంచానికి చాటింది. ప్రజల విశ్వాసం మాత్రమే కాదు వారు న్యాయవ్యవస్థ మీద వారికున్న నమ్మకానికి నిదర్శనం ఈ ఆలయం. ఢిల్లీలో జీ20 శిఖరాగ్ర సదస్సును విజయవంతంగా నిర్వహించి భారత్ తన పౌరుల భాగస్వామ్యంలో ఎంతటి ప్రతిష్టాత్మక కార్యక్రమాలనైనా నిర్వహించగలదని రుజువు చేసింది. వ్యూహాత్మక, దౌత్య అంశాలపై ఏకాభిప్రాయాన్ని సాధించి చూపింది. ప్రజలు తమ సొంత భవిష్యత్తును ఎలా తీర్చిదిద్దుకోగలరో ప్రపంచ దేశాలకు నేర్పింది. గ్లోబల్ సౌత్‌కు భారత్ గొంతుకగా నిలిచింది. ఆర్థిక వ్యవస్థ పరిపుష్టితో దృఢ విశ్వాసంతో భారత్ అభివృద్ధి దిశగా వడివడిగా అడుగులేస్తోంది'' అని అన్నారు.

అభివృద్ధి భారత్ బాధ్యత పౌరులదే

'' స్వతంత్రభారతావని 75 వసంతాలు పూర్తిచేసుకుని శత స్వాతంత్రోత్సవాల దిశగా అడుగులేస్తోంది. రాబోయే పాతికేళ్ల అమృత్‌కాలంలో సర్వతోముఖాభివృద్ధి సాధించి అభివృద్ధి చెందిన భారత్‌గా దేశాన్ని నిలపాల్సిన బాధ్యత పౌరులదే. ఇప్పుడు మహాత్ముని మాటలు గుర్తొస్తున్నాయి. దేశంలో ప్రజలు ప్రాథమిక హక్కులు గురించి మాత్రమే మాట్లాడితే సరిపోదు. ప్రాథమిక విధులు సైతం ఖచ్చితంగా నిర్వర్తిస్తూ బాధ్యతగా మెలిగినప్పుడే భారత్ అభివృద్ధి చెందుతుందని గాంధీజీ ఉపదేశించారు'' అని ముర్ము గుర్తుచేశారు.

మమతా బెనర్జీతో మాట్లాడిన ఖర్గే

న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బెంగాల్‌లో ఒంటరిగానే బరిలోకి దిగుతామని సీఎం మమతా బెనర్జీ బుధవారం పేల్చిన బాంబుతో కాంగ్రెస్ అధిష్టానం అప్రమత్తమైంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం టీఎంసీ చీఫ్, బెంగాల్ సీఎం మమతా బెనర్జీతో ఫోన్‌లో మాట్లాడి ఆమెను బుజ్జగించేందుకు ప్రయత్నించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ధ్రువీకరించారు. 'కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ఈ రోజు మమతా బెనర్జీతో మాట్లాడారు. ఎన్నికల్లో టీఎంసీతో కలిసి ముందుకు సాగేందుకు గల మార్గాలను అన్వేషిస్తాం. ఆమె లక్ష్యమే ఇండియా కూటమి లక్ష్యం. అదే బీజేపీని చిత్తుగా ఓడించడం'అని జైరాం రమేశ్ పీటీఐకి చెప్పారు.

2 నిమిషాల్లోనే ప్రసంగం ముగిసింది

ప్రభుత్వంతో కేరళ గవర్నర్ విభేదాలు మరోసారి బట్టబయలు

తిరువనంతపురం: కేరళలోని వామపక్ష ప్రభుత్వం, గవర్నర్ మధ్య విభేదాలు మరోసారి బట్టబయలయ్యాయి. గురువారం కేరళ అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా సంప్రదాయం ప్రకారం ప్రభుత్వ విధివిధానాలను వివరించాల్సిన గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ ప్రసంగ పాఠంలోని చివరి పేరాను మాత్రమే చదివి కేవలం రెండు నిమిషాల్లోనే ప్రసంగం ముగించారు. ఉదయం 9 గంటలకు అసెంబ్లీకి చేరుకున్న గవర్నర్ 9.02 గంటలకల్లా ప్రసంగం ముగించారు. 9.04 గంటలకు అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు. కొన్ని బిల్లుల పెండింగ్, యూనివర్సిటీల నిర్వహణకు సంబంధించిన అంశాలపై గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వం మధ్య విభేదాలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే.

మళ్లీ బీజేపీ గూటికి శెట్టర్

శివాజీనగర: కర్ణాటక రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. గతేడాది ఏప్రిల్‌లో ఎన్నికలకు ముందు బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన మాజీ ముఖ్యమంత్రి జగదీష్ శెట్టర్ తిరిగి సొంత గూటికి చేరారు. గురువారం ఆయన ఢిల్లీలో బీజేపీ అగ్రనేతలు అమిత్ షా, జేపీ నడ్డా, బీ.ఎస్.యడియూరప్ప సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరగనుండగా ఆయన బీజేపీలోకి చేరడం కన్నడనాట అధికార కాంగ్రెస్‌లో కలకలం రేగింది.

ఆస్ట్రేలియా బీచ్‌లో ప్రమాదం.. నలుగురు భారతీయులు మృతి

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాలోని విక్టోరియా రాష్ట్రంలోని ఓ బీచ్‌లో బుధవారం జరిగిన ప్రమాదంలో నలుగురు భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. ఫిలిప్ దీవిలోని ఎటువంటి కాపలా ఉండని ఈ బీచ్‌లో 20 ఏళ్లలో జరిగిన మొదటి ప్రమాదం ఇదేనని అధికారులు చెప్పారు. మృతులను జగ్జీత్ సింగ్ ఆనంద్(23), సుహానీ ఆనంద్(20), కీర్తి బేడి(20), రీమా సోంధి(43)గా గుర్తించారు. పంజాబ్‌కు చెందిన రీమా సోంధి రెండు వారాల క్రితం క్లైడ్‌లో ఉంటున్న బంధువుల ఇంటికి వచ్చారు. అందరూ కలిసి సరదాగా గడిపేందుకు ఫిలిప్ దీవికి వచ్చి అనూహ్యంగా ప్రమాదానికి గురయ్యారు.

12 మందిని బలిగొన్న పొగమంచు

షాజహాన్‌పూర్: ఉత్తరప్రదేశ్‌లో కురుస్తున్న దట్టమైన పొగమంచు ఘోర రోడ్డు ప్రమాదానికి కారణమైంది. కంటెయినర్ ట్రక్కు రాంగ్ రూట్‌లో వచ్చి ఢీకొనడంతో ఆటోలోని ముగ్గురు మహిళలు సహా 12 మంది మృత్యువాతపడ్డారు. బరేలీ–ఫరుకాబాద్ రహదారిలోని సుగ్సుగి గ్రామ సమీపంలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. బాధితులంతా ఫరుకాబాద్ సమీపంలోని గంగా నదిలో పవిత్ర స్నానాలాచరించేందుకు వస్తున్నట్లు ఎస్పీ అశోక్ కుమార్ మీనా చెప్పారు. ప్రమాద తీవ్రతకు ఆటో ట్రక్కు కింద ఇరుక్కుపోయింది.

జ్ఞానవాపి అడుగున భారీ ఆలయం ఆనవాళ్లు

తెలుగు, దేవనాగరి, కన్నడ భాషల్లో శాసనాలు

ఏఎస్ఐ సర్వేలో తేలిందన్న హిందూ పక్షం లాయర్

వారణాసి: ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలోని జ్ఞానవాపి మసీదు కాంప్లెక్స్ స్థానంలో భారీ హిందూ ఆలయ నిర్మాణం ఉండేదని భారత పురావస్తు శాఖ(ఏఎస్ఐ) నివేదిక పేర్కొంది. హిందూ పక్షం న్యాయవాది విష్ణు శంకర్ జైన్ గురువారం ఇక్కడ జరిగిన మీడియా సమావేశంలో నివేదికలోని అంశాలను చదివి వినిపించారు. గ్రౌండ్ పెన్‌ట్రేటింగ్ రాడార్(జీపీఆర్) సర్వేలో వెల్లడైన అంశాలు కూడా ఈ నివేదికలో ఉన్నాయి. ప్రస్తుత నిర్మాణం అంతకుముందున్న నిర్మాణంపైన కట్టిందేనని కూడా సర్వేలో తేలింది. 'మసీదులో చేసిన మార్పులను ఈ సర్వే గుర్తించింది. పూర్వమున్న స్తంభాలను, ప్లాస్టర్‌ను చిన్న చిన్న మార్పులతో తిరిగి ఉపయోగించినట్లు కనిపిస్తున్నాయి. హిందూ ఆలయం నుంచి తీసుకున్న కొన్ని స్తంభాలను కొద్దిగా మార్చి వేసి కొత్త నిర్మాణంలో ఉపయోగించారు. స్తంభాలపై ఉన్న చెక్కడాలను తొలగించే ప్రయత్నం చేశారు'అని ఏఎస్ఐ నివేదిక పేర్కొన్నట్లు జైన్ వివరించారు. దేవనాగరి, తెలుగు, కన్నడ, ఇతర లిపిలలో రాయబడిన పురాతన హిందూ దేవాలయానికి చెందిన మొత్తం 34 శాసనాలు ప్రస్తుత, పూర్వపు నిర్మాణాలపై ఉన్నాయని జైన్ పేర్కొన్నారు. 'ఇవి వాస్తవానికి పూర్వం ఉన్న హిందూ దేవాలయంలో ఉన్న శాసనాలు. ఇవి ప్రస్తుతం ఉన్న నిర్మాణంలోనూ మరమ్మత్తు సమయంలో ఇవి ఉపయోగించబడ్డాయి. దీనిని బట్టి పూర్వం అక్కడ ఉన్న హిందూ ఆలయాన్ని ధ్వంసం చేసి, దానికి సంబంధించిన భాగాలను తిరిగి వాడినట్లుగా రుజువవుతోంది. ఈ శాసనాల్లో జనార్ధన, రుద్ర, ఉమేశ్వర వంటి దేవతల పేర్లు కూడా ఉన్నాయి'అని నివేదికలో ఉన్నట్లు జైన్ చెప్పారు. కాశీ విశ్వనాథుని ఆలయాన్ని ఆనుకుని ఉన్న జ్ఞానవాపి మసీదు సముదాయాన్ని హిందూ, ముస్లిం పక్షాలకు ఇవ్వాలంటూ వారణాసి కోర్టు బుధవారం తీర్పు వెలువరించిన నేపథ్యంలో ఈ నివేదిక వెలుగులోకి రావడం గమనార్హం. జ్ఞానవాపి మసీదు అంతకు ముందున్న హిందూ ఆలయ నిర్మాణంపైనే నిర్మితమయిందా అన్న విషయం తేల్చేందుకు గత ఏడాది వారణాసి కోర్టు అక్కడ ఏఎస్ఐ సర్వే జరపాలంటూ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.



గురువారం జైపూర్ రోడ్‌షోలో ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్, ప్రధాని మోదీ

జైపూర్‌లో మోదీ, మేక్రాన్ రోడ్ షో

జైపూర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఫ్రాన్సు అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మేక్రాన్ గురువారం జైపూర్‌లో రోడ్ షోలో పాల్గొన్నారు. మోదీ ఆయనకు అయోధ్య రామాలయం ప్రతిమను కానుకగా అందజేశా రు. ఇద్దరు నేతలు జైపూర్‌లో మసాలా చాయ్ రుచిని ఆస్వాదించారు. ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు ప్రధాన అతిథిగా హాజరుకానున్న ఫ్రాన్సు అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మేక్రాన్ భారత్‌లో రెండు రోజుల పర్యటన నిమిత్తం గురువారం జైపూర్‌కు చేరుకున్నారు. విమానాశ్రయం వద్ద గవర్నర్ కల్‌రాజ్ మిశ్రా, ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ ఫ్రాన్సు అధ్యక్షుడికి రెడ్ కార్పెట్ పరిచి, అందంగా అలంకరించిన గజరాజులతో స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్టు నుంచి మేక్రాన్ అంబర్ కోటకు వెళ్లారు. జంతర్‌మంతర్ వద్ద ప్రధాని మోదీ ఆయన్ను కలిశారు. పరస్పర కరచాలనం, ఆత్మీయ ఆలింగనాల అనంతరం ఓపెన్ టాప్ కారులో జంతర్‌మంతర్ నుంచి రోడ్ షోకు బయలుదేరారు. ప్రజలకు అభివాదం తెలుపుతూ హవా మహల్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి తాజ్ రామ్‌బాగ్ ప్యాలెస్‌కు చేరుకుని, ద్వైపాక్షిక చర్చలు జరిపారు.

అభివృద్ధి నినాదమే సమర నాదం

నా తరఫున ప్రజలే ఎన్నికల శంఖం పూరిస్తారు: ప్రధాని మోదీ

బులంద్‌షహర్/రేవారీ: ఉత్తరప్రదేశ్ పర్యటనలో ప్రధాని మోదీ లేదు లేదంటూనే ఎన్నికల ఊసెత్తి పరోక్షంగా ప్రచారాన్ని ప్రారంభించారు. ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ జిల్లాలో రూ.19,100 కోట్లకుపైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన సందర్భంగా ప్రధాని మోదీ అక్కడి ప్రజలనుద్దేశించి చేసిన ప్రసంగం యావత్తూ ప్రచారధోరణిలోనే కొనసాగింది. '' నేను ప్రత్యేకంగా ఎన్నికల సమర నినాదం ఇవ్వాల్సిన పని లేదు. ప్రజలే నా కోసం ఆ పని చేస్తారు. మోదీ గ్యారెంటీల బండి ప్రతి ఒక్క లబ్ధిదారుని చెంతకొస్తుంది. ప్రభుత్వ పథకాలు చిట్టచివరి లబ్ధిదారునికి చేరిన నాడు సమాజంలో వివక్ష, అవినీతి అనేవే ఉండవు. అదే అసలైన లౌకికవాదం. అప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాకారమైనట్లు లెక్క. మీరే నా కుటుంబం. మీ కలలే నాకు సంకల్పాలు. మీలాంటి సాధారణ కుటుంబాలు ఆర్థికాభివృద్ధితో సాధికారత సాధించినప్పుడే నా 'ఆస్తి' మరింత పెరిగినట్లు సంతోషిస్తా. మా ప్రభుత్వం ఏం చెబుతోందో దానిని చేసి చూపిస్తుంది. మీరు సంతృప్తి చెందే గ్యారెంటీ నాది. 100 శాతం లబ్ధిదారులకు పథకాలు చేరేలా నేను కృషిచేస్తా'' అని మోదీ ప్రకటించారు.

కాంగ్రెస్‌పై విమర్శలు

'' దాన్నాళ్ల క్రితం ఒకరు గరీబీ హఠావో అని గట్టిగానే నినదించారు. కానీ సామాజిక న్యాయం కలగానే మిగిలిపోయింది. కొందరు మాత్రమే సంపన్నులై, వారి రాజకీయాలు మాత్రమే నడవడం పేదలు కళ్లారా చూశారు'' అని కాంగ్రెస్‌ను విమర్శించారు. '' ఈ రోజు కార్యక్రమం ద్వారా ఎన్నికల ప్రచారానికి నేను శ్రీకారం చుడుతున్నానని మీడియాలో ప్రచారం జరిగింది. నేను ఆ పని అస్సలు చేయను. నాకు అవసరం లేదు కూడా. బీజేపీకి భవిష్యత్తులో కూడా ఆ అవసరం పడదు. ప్రజలే నా కోసం ఆ పని చేస్తారు. ప్రజలే నా కోసం ఎన్నికల సమర శంఖం పూరిస్తున్నపుడు నేను ప్రత్యేకంగా ప్రచారానికి సమయం కేటాయించాల్సిన అవసరం లేదు. నా సమయమంతా ప్రజాసేవకే కేటాయిస్తాను. అభివృద్ధి నినాదం మాత్రమే నేను ఇస్తా. దానిని ప్రజలే ఎన్నికల సమర నినాదంగా దేశవ్యాప్తంగా మార్మోగిస్తారు' అని సభికుల హర్షధ్వానాల మధ్య మోదీ అన్నారు.

కుటుంబ పార్టీలను ఓడించండి

మరోవైపు, జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మోదీ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా యువ ఓటర్లతో మాట్లాడారు. '' లోక్‌సభ ఎన్నికల్లో కుటుంబ పార్టీలను ఓడించండి. భారత దేశ దశ, దిశలను నిర్ణయించే సత్తా యువ ఓటర్లకు ఉంది. పది, పన్నెండేళ్ల క్రితం నాటి ప్రభుత్వాల పాలనలో నాటి యువత అంధకారంలో మగ్గిపోయింది. మేమొచ్చాక దేశాన్ని అంధకారం నుంచి బయటికి తెచ్చాం. ఇప్పుడు యువతరానికి అవకాశాలు మెరుగయ్యాయి. బీజేపీ మేనిఫెస్టోకు మీరూ సలహాలు, సూచనలను నమో యాప్ ద్వారా పంపండి. మీ చక్కని ఆలోచనలను ఆచరణలో పెట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తుంది'' అని యువ ఓటర్లకు మోదీ సూచించారు.

ఐక్యంగానే పోరాడతాం: రాహుల్

కూచ్ బిహార్(పశ్చిమ బెంగాల్): దేశవ్యాప్తంగా విపక్షాల 'ఇండియా' కూటమి ఐక్యమత్యంగానే దేశవ్యాప్తంగా అన్యాయంపై పోరాటం కొనసాగిస్తుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పునరుద్ఘాటించారు. పశ్చిమబెంగాల్‌లో ఒంటరిగానే బరిలో దిగుతామని తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ ప్రకటించిన వేళ రాహుల్ కూటమి ఐక్యతపై మరోసారి స్పష్టతనివ్వడం గమనార్హం. అస్సాంలో గువాహటి నగరంలోకి భారత్ జోడో న్యాయ్ యాత్ర అడుగుపెట్టకుండా పోలీసులు అడ్డుకోవడం, కాంగ్రెస్ కార్యకర్తలు, పోలీసుల ఘర్షణల నడుమ అస్సాంలో ఉద్రిక్తంగా కొనసాగిన యాత్ర గురువారం పశ్చిమబెంగాల్‌లోకి అడుగుపెట్టింది. బక్షీర్‌హాట్ గుండా రాష్ట్రంలోని కూచ్ బెహార్ జిల్లాలో రాహుల్ యాత్రను మొదలుపెట్టి అక్కడ మద్దతుదారులు, కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. ''దేశంలో అన్యాయం రాజ్యమేలు తున్నందుకే యాత్రకు న్యాయ్ అనే పదం జతచేశాం'' అని అన్నారు. మరోవైపు బెంగాల్‌లో యాత్రలో సీపీఎం, వామపక్ష పార్టీలు పాలుపంచుకునే అవకాశం ఉంది.

బస్సులో ఉన్నది రాహుల్ కాదేమో: అస్సాం సీఎం హిమంత

అస్సాంలో న్యాయ్ యాత్ర సందర్భంగా బస్సు లోపలి వైపు రాహుల్ సేదతీరుతూ ముందువైపు డూప్‌ను కూర్చోబెట్టి యాత్ర చుట్టేస్తున్నారని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఆరోపించారు. ''అస్సాంలో న్యాయ్ యాత్ర ప్రభావం శూన్యం. యాత్ర కొనసాగిన అన్ని నియోజకవర్గాల్లో బీజేపీనే విజయం సాధిస్తుంది. రాహుల్ ప్రచారం చేసిన చోటల్లా బీజేపీనే గెలుస్తుంది. ఆ కోణంలో చూస్తే బీజేపీకి రాహుల్ అవసరం ఎంతైనా ఉంది'' అని వ్యంగ్యంగా మాట్లాడారు. కొన్ని చోట్ల రాహుల్ అస్సలు బస్సు దిగట్లేరని, బస్సులో ముందువైపు కనిపించేది రాహుల్ కాదని కొన్ని మీడియాకథనాలు వచ్చాయన్నారు.

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

న్యూఢిల్లీ: దేశ సైనిక శక్తిని, గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ఘనంగా చాటే 75వ గణతంత్ర వేడుకలకు ఢిల్లీ సిద్ధమైంది. కర్తవ్యపథ్‌లో గంటన్నరపాటు సాగే పరేడ్‌కు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సారథ్యం వహించనున్నారు. ఈ ఏడాది వేడుకలకు ముఖ్య అతిథిగా ఫ్రాన్సు అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మేక్రాన్ హాజరుకానున్నారు. పరేడ్‌లో క్షిపణులు, డ్రోన్‌జామర్లు, నిఘా వ్యవస్థలు, సైనిక వాహనాలపై అమర్చిన మోర్టార్లు, పోరాట వాహనాలను ప్రదర్శించనున్నారు. మొట్టమొదటిసారిగా పూర్తిగా మహిళా అధికారులతో కూడిన త్రివిధ దళాల కంటింజెంట్ కవాతులో పాల్గొననుంది. గత ఏడాది ఆర్టిలరీ రెజిమెంట్‌లో విధుల్లో చేరిన 10 మహిళా అధికారుల్లో లెఫ్టినెంట్లు దీప్తి రాణా, ప్రియాంక సెవ్దా సహా మొట్టమొదటిసారిగా స్వాతి వెపన్ లొకేటింగ్ అండ్ పినాక రాకెట్ సిస్టమ్‌కు సారథ్యం వహించనున్నారు. సంప్రదాయ మిలటరీ బ్యాండ్లకు బదులుగా ఈసారి భారతీయ సంగీత పరికరాలైన శంఖ, నాదస్వరం, నాగడ వంటి వాటితో 100 మంది మహిళా కళాకారుల బృందం పరేడ్‌లో పాల్గొననుంది. భారత వైమానిక దళానికి చెందిన 15 మంది మహిళా పైలట్లు వైమానిక విన్యాసాల్లో పాల్గొంటారు. ఉదయం 10.30 గంటలకు మొదలయ్యే పరేడ్ 90 నిమిషాల పాటు కొనసాగనుంది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శుక్రవారం : 26 : జనవరి : 2024



జన రథోత్సవం

గురువారం బాగల్‌కోట జిల్లా బాదామిలో ప్రఖ్యాత బనశంకరీదేవి తేరు ఉత్సవం. పాల్గొన్న జనసంద్రం

న్యూస్‌రీల్

ఆడపిల్లలే సమాజానికి వెలుగు



బాలిక దినోత్సవంలో చిన్నారులు

గౌరిబిదనూరు: గర్భంలో ఉన్నది ఆడపిల్ల అని తెలుసుకుని భ్రూణహత్యలు చేయడం తగదని, దీనివల్ల సమాజంలో ఆడ,మగ నిష్పత్తిలో చాలా హెచ్చుతగ్గులు కలిగి ఆడపిల్లలు కనుమరుగవుతారని వక్తలు పేర్కొన్నారు. ఇక్కడి మునేశ్వర కాలనీలోని పాఠశాలలో గురువారం జాతీయ ఆడపిల్లల దినాచరణను నిర్వహించారు. నేడు సమాజంలో మహిళ ఎంత ఎత్తుకు పెరిగినా అనేక సమస్యలను ఎదుర్కొంటోందని అన్నారు. ఆడశిశు భ్రూణ హత్యలను ఆపాలన్నారు. దీనిపై సమాజంలో జాగృతి కల్పించాలన్నారు. ఆడపిల్లలు ఇంటికే కాకుండా సమాజ సంక్షేమానికి సైతం దారిదీపమన్నారు. ఈ కార్యక్రమంలో శోభ, భార్గవి, హేమలత, సంధ్య, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఈపీని కొనసాగించాలి

శివాజీనగర: రాష్ట్రంలో జాతీయ విద్యావిధానం -2020 ని కొనసాగించాలని పీపుల్ ఫోరం ఫర్ కర్ణాటక ఎడ్యుకేషన్ అనే సంస్థ సభ్యులు గవర్నర్ గెహ్లాట్‌ను కలసి వినతి చేశారు. ఎన్‌ఈపీకి రద్దు చేసే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని, ఇది తగదని పేర్కొన్నారు. ఎన్‌ఈపీకి మద్దతుగా చేపట్టిన సంతకాల సేకరణ పుస్తకాన్ని గవర్నర్‌కు అందజేశారు. ఈ విషయమై విద్యా మంత్రితో చర్చించనున్నట్లు గవర్నర్ భరోసా ఇచ్చారని సభ్యుడు ప్రొ.మల్లేపురం జీ.వెంకటేశ్ తెలిపారు.

నేను కాంగ్రెస్‌లోనే ఉంటా: సవది

బనశంకరి: నేను కాంగ్రెస్ పార్టీని వీడనని ఆ పార్టీ ఎమ్మెల్యే లక్ష్మణ సవది తెలిపారు. జగదీశ్ శెట్టర్ కాంగ్రెస్‌ను వీడడం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికలకు ముందు శెట్టర్‌తో పాటు సవది కూడా బీజేపీ నుంచి హస్తంలోకి చేరారు. ఈ సందర్భంగా సవది విలేకరులతో మాట్లాడారు. బీజేపీకి తమ అవసరం ఉందని, దీంతో తనను సంప్రదిస్తూ గందరగోళం సృష్టించే పనులు చేస్తోందని ఆరోపించారు. తాను, శెట్టర్ కలిసి కట్టుగా కాంగ్రెస్‌లోకి రాలేదన్నారు. తాను ముందుగా చేరానని, ఆ తరువాత శెట్టర్ వచ్చారన్నారు. ఆయన ఎందుకు బీజేపీలోకి వెళ్లారు అనేది తెలియదన్నారు. మరోవైపు సవదితో డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్ పిలిపించి కాంగ్రెస్‌ను వీడరాదని చర్చించారు.

పోలీసులకు రాష్ట్రపతి పతకాలు

బనశంకరి: రాష్ట్రంలో అత్యుత్తమ సేవలందించిన 21 మంది పోలీస్ సిబ్బంది, ఐపీఎస్‌లు గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి పతకాలకు ఎంపికయ్యారు. పాలనా విభాగం అదనపు డీజీపీ సౌమెందు ముఖర్జీ, డీవైఎస్పీ సుదీర్ హెగ్డేకు రాష్ట్రపతి సేవా పతకాలు లభించాయి. నగర అదనపు పోలీస్ కమిషనర్ ఐజీపీ రమణ్‌గుప్తా, సీబీఐలో ఐజీపీగా పనిచేస్తున్న ప్రవీణ్ మధుకర్ పవార్ సహా పలువురు కానిస్టేబుళ్లకు సైతం ఈ పతకాలను ప్రకటించారు.

భార్య గొంతుకోసిన భర్త



రమేశ్‌బాబు, భాగ్యమ్మ (ఫైల్)

దొడ్డబళ్లాపురం: కుటుంబ కలహాల నేపథ్యంలో కసాయిగా మారిన భర్త భార్య గొంతుకోసి హత మార్చిన ఘటన నెలమంగల తాలూకా గోరినబెలె గ్రామంలో జరిగింది. వివరాలు.. భాగ్యమ్మ (35) అనే మహిళ బ్యూటీపార్లర్‌లో పనిచేస్తోంది. నెలమంగల నివాసి రమేశ్‌బాబు అనే వ్యక్తిని రెండో పెళ్లి చేసుకుంది. కొత్తలో అన్యోన్యంగా ఉన్న ఇద్దరి మధ్య మనస్పర్థలు మొదలయ్యాయి. బుధవారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరిగి రమేశ్ కత్తితో భాగ్యమ్మ గొంతుకోసి చంపాడు. నెలమంగల పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితున్ని అరెస్టు చేశారు.

ఎమ్మెల్సీ హొరట్టి రికార్డు

శివాజీనగర: సీనియర్ నేత, ఎమ్మెల్సీ, పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి అరుదైన ఘనతను సాధించారు. వరుసగా ఒకే నియోజకవర్గం నుంచి 8 సార్లు ఎగువసభకు ఎంపికై లిమ్కా బుక్ రికార్డులో చేరారు. రాష్ట్ర పశ్చిమ ఉపాధ్యాయుల నియోజకవర్గం నుండి 8వ సారి విధానపరిషత్‌కు ఎంపికై న హొరట్టి రికార్డు సృష్టించారు. గత 43 సంవత్సరాల నుంచి ఆయన ఈ పదవిలో కొనసాగుతున్నారు.

శెట్టర్ యూటర్న్

గతేడాది ఏప్రిల్ 17.. రాష్ట్ర బీజేపీ మూల స్తంభాల్లో ఒకరు, మాజీ సీఎం జగదీష్ శెట్టర్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు.

నిన్న జనవరి 25.. కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి బీజేపీలోకి వచ్చారు.

రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండగా శెట్టర్ పార్టీ మార్పిడి చర్చనీయాంశమైంది. ముఖ్యమైన వికెట్ పడిపోయినట్లుగా కాంగ్రెస్ పరిస్థితి తయారైంది. సంఘ్ పరివార్‌తో అనుబంధం ఉన్న శెట్టర్ అప్పట్లో కాంగ్రెస్‌లో చేరడం పెద్ద సంచలనమే అయ్యింది.

- తిరిగి కాషాయం నీడలోకి రాక
- ఢిల్లీలో బీజేపీ అగ్రనేతల సమక్షంలో చేరిక
- కాంగ్రెస్ నేతల్లో ఆక్రోశం

సాక్షి, బళ్లారి: సుమారు 9 నెలల క్రితం జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ టికెట్ దక్కకపోవడంతో బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరిన మాజీ సీఎం, ప్రముఖ లింగాయత్ నేత జగదీష్ శెట్టర్ యూటర్న్ తీసుకుని మళ్లీ సొంత గూటికి చేరారు. ఆయన గురువారం ఢిల్లీలో బీజేపీ అగ్రనేతలు అమిత్ షా, జేపీ నడ్డాలతో భేటీ పార్టీ తీర్థం స్వీకరించారు. మాజీ



బీజేపీలో మళ్లీ చురుకైన పాత్ర!

సీఎం యడియూరప్ప ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చాలా సంతోషంగా ఉంది: శెట్టర్

ఈ సందర్భంగా శెట్టర్ మాట్లాడుతూ బీజేపీలోకి మళ్లీ చేరడం ఎంతో సంతోషంగా ఉందని, తిరిగి రావాలని కేంద్ర, రాష్ట్ర నాయకులు కోరారని, వారితో పాటు తాను కూడా అదే భావనతో ఉండడం వల్ల ఎవరి ఒత్తిడి లేకుండా చేరానని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. తాను కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి హామీ తీసుకోకుండా బీజేపీలోకి చేరానన్నారు. మోదీని మళ్లీ ప్రధానిని చేయాలన్నదే ఏకైక లక్ష్యమన్నారు.

ఆదరించి టికెట్ ఇచ్చాం: సీఎం సిద్దు

రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కర్ణాటకలో ఎక్కువ ఎంపీ సీట్లను గెలవాలని ప్రయత్నిస్తున్న అధికార కాంగ్రెస్ పార్టీకి శెట్టర్ పరిణామం మింగుడు పడలేదు. దీనిపై సీఎం సిద్దరామయ్య స్పందిస్తూ కాంగ్రెస్‌లో శెట్టర్‌కు సముచిత స్థానం కల్పించామని, ఎలాంటి ఇబ్బంది కలిగించలేదని, అయితే బీజేపీలోకి ఎందుకు చేరారో తెలియడం లేదని అన్నారు. ఆయనకు బీజేపీలో ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోవడంతో తమ పార్టీలోకి చేరారని, తాము ఆదరించి పార్టీ టికెట్ కేటాయించామన్నారు. ఆయన ఎన్నికల్లో ఓడిపోయినా ఎమ్మెల్సీని చేశామని, అయితే మళ్లీ బీజేపీలోకి ఎందుకు వెళ్లారో ఆయన్నే అడగాలని సూచించారు.

నమ్మక ద్రోహం చేశారు: డీకేశి

బీజేపీలో అవమానం జరిగిందని వస్తే ఆదరించి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చామని, ఓడిపోయినా తాము ఎమ్మెల్సీని చేశామని కేపీసీసీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అన్నారు. అయినా కాంగ్రెస్ పార్టీకి, తమకు నమ్మక ద్రోహం చేశారని ధ్వజమెత్తారు. పార్టీలో అందరూ శెట్టర్‌ను ఎంతో మర్యాదగా, గౌరవంగా చూసుకున్నారని, నమ్మక ద్రోహం చేసిన వారికి జనమే బుద్ధి చెబుతారన్నారు.

సంతోషకరం– మాజీ ప్రధాని దేవెగౌడ

మాజీ సీఎం జగదీష్ శెట్టర్ మళ్లీ సొంతగూటికి చేరడం సంతోషంగా ఉందని జేడీఎస్ అధినేత, మాజీ ప్రధానమంత్రి దేవెగౌడ పేర్కొన్నారు. శెట్టర్ బీజేపీలోకి చేరిన తర్వాత మాజీ ప్రధాని స్పందించారు. తప్పును సరిదిద్దుకుని బీజేపీలోకి రావడంతో ఆయనకు జనం అండగా ఉంటారన్నారు. కేంద్రంలో ఎన్‌డీఏ కూటమిని మళ్లీ అధికారంలోకి తెచ్చేందుకు కర్ణాటకలో ఈ పరిణామం దోహదపడుతుందన్నారు.

బలమైన నేతగా శెట్టర్‌కు గుర్తింపు

అంచెలంచెలుగా రాజకీయంగా ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన మాజీ సీఎం జగదీష్ శెట్టర్ లింగాయత్ సామాజిక వర్గంలోనే కాకుండా అన్ని వర్గాల్లో కూడా మంచి పేరు ఉంది. ఆయన బీజేపీని వీడటం వల్లనే గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ భారీగా నష్టపోయి పరాజయం పాలైందని భావించారు. మళ్లీ ఆయన బీజేపీలోకి చేరడంతో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓటు బ్యాంకు పునరేకీకరణ అయి బీజేపీకి లాభం చేకూరే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.



కాంగ్రెస్‌కు టాటా. గతంలో హస్తం నేత రాహుల్‌గాంధీతో శెట్టర్

బెళగావి ఎంపీ టికెట్?

మాతృపార్టీ బీజేపీలోకి చేరిన జగదీష్ శెట్టర్ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బెళగావి లోక్‌సభ సీటు నుంచి పోటీ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. బెళగావి లోక్‌సభ సభ్యురాలు మంగళ సురేష్ ఆయనకు సమీప బంధువు అవుతారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఈమె పోటీ చేయకపోవచ్చని ప్రచారం జరుగుతోంది. ఈసారి శెట్టర్‌కు సముచిత స్థానం కల్పించి నష్ట నివారణ చేసుకోవాలని బీజేపీ పెద్దలు నిర్ణయించినట్లు సమాచారం. శెట్టర్ రాక బీజేపీకి లాభిస్తుందా, లేదా అనేది చూడాలి.

కొత్తగా 5,800 బస్సుల్ని కొంటాం: మంత్రి

యశవంతపుర: మహిళకు ఉచిత బస్సు ప్రయాణ పథకం వల్ల ప్రయాణికుల సంఖ్య పెరిగిందని, ప్రజల అవసరాలను తీర్చడానికి కేఎస్ ఆర్టీసీ నాలుగు విభాగాలలో 5,800 కొత్త బస్సులను కొనుగోలు చేయనున్నట్లు రవాణా, దేవదాయశాఖ మంత్రి రామలింగారెడ్డి తెలిపారు. గురువారం కలబుర్గిలో సూపర్ మార్కెట్ ప్రాంతంలో కేకేఆర్‌డిబి నిధులు రూ.20 కోట్లు వ్యయంతో నిర్మించిన బస్టాండ్‌ను ప్రారంభించి మాట్లాడారు. కలబురగి నగరానికి నాలుగు వైపుల శాటిలైట్ బస్టాండ్‌ను నిర్మించాలని ఎమ్మెల్యే అల్లమప్రభు పాటిల్ కోరినట్లు తెలిపారు. శక్తి యోజన పథకానికి ముందు రోజు 84 లక్షల మంది బస్సుల్లో ప్రయాణించగా, ప్రస్తుతం రోజు 1.10 కోటి మందికి చేరుకుందన్నారు. రద్దీకి సరిపడేలా కొత్త బస్సులను కొనుగోలు చేస్తామన్నారు.

శ్రీశైలంలో కొత్త అతిథి గృహం

ఏపీలో శ్రీశైలంలో కర్ణాటక భక్తుల కోసం అతిథి గృహాన్ని నిర్మిస్తామని మంత్రి తెలిపారు. ఇందుకు ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్‌మోహన్ రెడ్డితో చర్చిస్తామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న పాత అతిథి గృహాన్ని తొలగించి అక్కడే కొత్త కట్టడాన్ని నిర్మిస్తామని అన్నారు. దీనిపై ఏపీ సీఎం జగన్‌తో సీఎం సిద్దరామయ్య మాట్లాడతారని తెలిపారు.

యువ రైతు ఆత్మహత్య

మైసూరు: అప్పుల బాధను తట్టుకోలేక యువ రైతు ఒకరు ప్రాణాలు తీసుకున్న సంఘటన మైసూరు నగరంలోని విద్యారణ్యపురం పరిధిలో మహాదేవపురలో జరిగింది. వివరాలు దర్శన్ (24) అనే యువకుడు కేటరింగ్ పనితో పాటు సొంత పొలంలో వ్యవసాయం చేస్తున్నాడు. దూర విద్య ద్వారా డిగ్రీ కూడా పూర్తి చేశాడు. సేద్యం కోసం పెద్ద మొత్తంలో అప్పులు చేశాడు. పంటలు పండకపోవడంతో అప్పులు తీరే మార్గం లేక విరక్తి చెందిన దర్శన్ ఇంటిలో గురువారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు.

ఓటు విలువ తెలుసుకో

- ఒక్క ఓటే గెలుపోటములను నిర్ణయిస్తుంది
- గవర్నర్ గెహ్లాట్ ఉవాచ
- అట్టహాసంగా ఓటరు దినోత్సవం

శివాజీనగర: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో సాధ్యమయినంత వరకు ఓటు హక్కును వినియోగించుకోవటం ద్వారా దేశంలో ప్రజాస్వామ్యాన్ని బలపరచడంలో ముఖ్యపాత్ర పోషించాలని గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ప్రజలకు విన్నవించారు. గురువారం నగరంలోని టౌన్‌హాల్‌లో 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఆడంబరంగా నిర్వహించారు. గవర్నర్ ప్రారంభించి ప్రసంగిస్తూ 2011 నుంచి జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుతున్నాం, ఓటర్లను ప్రోత్సహించేందుకు ఇది తోడ్పడుతుందన్నారు. ప్రపంచంలో వివిధ దేశాల్లో వివిధ రీతుల్లో ఓటింగ్ వ్యవస్థలున్నాయి, మన దేశంలో ప్రత్యక్ష ఎన్నికల పద్ధతిని అనుసరిస్తున్నామన్నారు. యువతీ యువకులు ముందుకు వచ్చి దేశ నాయకత్వంలో తమ పాత్రను నిర్వహించాలి. సమాజంలో బాధ్యత కలిగిన ప్రజలు కావాలని సూచించారు. ఓటు వేసే ఓటర్లే భారతదేశ భాగ్య విధాతలు అని తెలిపారు. ఎన్నికల్లో ప్రతి ఓటు అమూల్యమైనది. ఒక్క ఓటు వేయకపోతే ఏమవుతుందిలే అని కొందరు పోలింగ్‌కు దూరంగా ఉంటారు. కానీ గెలుపు, ఓటములు ఒక్క ఓటుపైనే ఆధారపడి ఉంటాయన్నారు.



ఓటరు దినోత్సవంలో ఓటు విలువను చాటేలా చిత్రాలు గీస్తున్న విద్యార్థినులు

ఓటరు గుర్తింపు కార్డు ముఖ్యం

మీడియా, ఈవీఎంల ప్రదర్శన తదితరాలతో ఎన్నికల సంఘం బాగా జాగృతి కల్పిస్తోందని గవర్నర్ అన్నారు. ఓటర్ల గుర్తింపు కార్డు అనేది చాలా ముఖ్యమైనదని, ప్రతి ఓటరు దీనికి కలిగి ఉండాలన్నారు. ఓటు వేయాలని ఇతరును ప్రేరేపించాలని గవర్నర్ సూచించారు. సీఈఓ మనోజ్‌కుమార్ మీనా మాట్లాడుతూ, ఓటు వేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రతి ఓటరూ ఉత్సాహంగా ఓటేసి పోలింగ్ శాతాన్ని పెంచాలని తెలిపారు. ఈ సందర్భంగా తొలిసారి ఓటు హక్కు పొందిన యువత, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, బుడకట్టు ఓటర్లకు గుర్తింపు కార్డులను గవర్నర్ అందజేశారు. ఈ సందర్భంగా యువత ఓటు హక్కు గురించి చిత్రలేఖనాలను గీసి ఆకట్టుకున్నారు.



ఓటరు గుర్తింపు కార్డులతో హిజ్రాలు, ఆదివాసీలు



దివ్యాంగులకు ఓటరు కార్డు ఇస్తున్న గవర్నర్

రాముని పేరుతో ఓట్ల వేటా?

- బీజేపీపై సీఎం ధ్వజం

మైసూరు: ఒక దేశం, ఒకే ఎన్నికలు అమలుపై ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సీఎం సిద్దరామయ్య అన్నారు. గురువారం మైసూరులోని రామకృష్ణ నగరలోని నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఒకే దేశం, ఒకే ఎన్నికలు అనేది రాజ్యాంగానికి విరుద్ధంగా ఉంటే అమలు చేయరాదని అన్నారు. కాగా, శ్రీరాముడు ప్రజలందరికీ మేలు చేశాడని, బీజేపీ కూడా అలాగే ప్రవర్తించాలన్నారు. ప్రధాని మోదీ రాబోయే ఎన్నికల్లో ఓట్ల కోసం రామ మందిరం కట్టడం సరికాదని అన్నారు. ఓటర్లు ఆలోచించి విలువైన ఓటు వేయాలని అన్నారు. రాముని పేరుతో ఓట్ల కోసం ప్రచారం చేసుకుంటే ప్రజలే బుద్ధి చెబుతారని బీజేపీపై మండిపడ్డారు.

ఫిబ్రవరిలో రాజ్యాంగ రక్షణ సభ

మనందరం కలిసి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని సీఎం అన్నారు. ఫిబ్రవరి 24, 25 తేదీల్లో బెంగళూరు ప్యాలెస్ మైదానంలో రాజ్యాంగ పరిరక్షణకు భారీ సభ జరుపుతామని తెలిపారు.

లైంగికదాడి బాధితురాలు ఆత్మహత్య



బాల మందిరంలో విచారణ చేస్తున్న పోలీసులు

తుమకూరు: అత్యాచారం ఘటనలో బాధితురాలైన బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన తుమకూరులోని అమర్‌జ్యోతి నగరలో ఉన్న ప్రభుత్వ బాలికల బాల మందిరంలో జరిగింది. నగరంలోని బడ్డిహళ్ళికి చెందిన 17 ఏళ్ల బాలికపై ఐదు నెలల కిందట లైంగికదాడి జరిగింది. నిందితునిపై పోక్సో కేసు నమోదు చేసి జైలుకు తరలించారు. ఇటీవల బాలిక ఇంటి నుంచి మైసూరుకు పరారైంది. దీంతో పోలీసులు బుధవారం మధ్యాహ్నం అక్కడి నుంచి తీసుకొచ్చి బాల మందిరంలో ఉంచారు. గురువారం గదిలో ఉన్న ఫ్యాన్‌కు బాలిక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బాలిక తండ్రి చేరుకుని విలపించాడు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. జయనగర పోలీసులు విచారణ చేపట్టారు. బాల మందిరం సిబ్బంది వేధింపుల వల్లే ఇలా జరిగి ఉంటుందని ఆరోపణలున్నాయి. లేదా మరేదైనా జరిగిందా అనేది తేలాల్సి ఉంది.

మళ్లీ బిట్‌కాయిన్ అలజడి

- సీఐ, ఐటీ నిపుణున్ని అరెస్టు చేసిన సిట్

బనశంకరి: బిట్‌కాయిన్ కుంభకోణం కేసు మళ్లీ వేడెక్కింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఈ కేసు విచారణను సిట్‌కు అప్పగించడం తెలిసిందే. కొన్నిరోజులుగా లోతుగా విచారించిన సిట్ అధికారులు.. ఒక సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌ను, సైబర్ నిపుణున్ని అరెస్టు చేయడం కలకలానికి కారణమైంది. సిట్ గత మూడు రోజుల నుంచి ఈ కేసులో సంబంధమున్న అనేకమందిని విచారణకు పిలిపించింది. వీరిలో సీఐ ప్రశాంత్ బాబు, ఐటీ నిపుణుడు సంతోష్‌ను అరెస్ట్ చేసింది. సాక్ష్యాలు నాశనం చేయడంలో వీరికి సంబంధం ఉందని సిట్ నిర్ధారించింది. బిట్‌కాయిన్ స్కాంలో ప్రధాన నిందితుడు, ప్రముఖ హ్యాకర్ శ్రీకి అలియాస్ శ్రీకృష్ణని అదుపులోకి తీసుకుని విచారించినా సిట్‌కు తగిన సమాచారం అందలేదు. దీంతో దర్యాప్తు తీవ్రతరం చేసి, గతంలో ఈ కేసును విచారించిన సీసీబీ సీఐలు, సిబ్బందిని పిలిపించి కొంత సమాచారం సేకరించింది. సీసీబీ దర్యాప్తులో లోపాలు, వందలాది కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని గతంలో కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది.

ఏమిటీ కేసు

2020లో బీజేపీ సర్కారులో బసవరాజ బొమ్మై ముఖ్యమంత్రిగా ఉండగా బిట్‌కాయిన్ కేసు బయటపడింది. శ్రీకృష్ణ అనే హ్యాకర్, అతని మిత్రులు డ్రగ్స్ కేసులో సీసీబీ పోలీసులకు పట్టుబడ్డారు. అతన్ని విచారించగా హ్యాకింగ్‌లో నిపుణుడని, అక్రమ మార్గాల ద్వారా క్రిప్టోకరెన్సీని చలామణి చేస్తున్నాడని, ప్రభుత్వ వెబ్‌సైట్లలోకి చొరబడి కోట్లాది రూపాయలను దొంగిలించాడని ఆరోపణలు వచ్చాయి. అతనితో సంబంధాలు ఉన్నాయని బీజేపీ, కాంగ్రెస్ విమర్శలు చేసుకున్నాయి.

వైద్య, గిరిజన సేవలకు సలాం

- డాక్టర్ ప్రేమ ధనరాజ్, సోమణ్ణకు పద్మశ్రీ

సాక్షి, బెంగళూరు: గణతంత్ర దినోత్సవాల సందర్భంగా కేంద్ర ప్రభుత్వం 2024 ఏడాదికి పద్మశ్రీ పురస్కారాలను ప్రకటించింది. అందులో ఇద్దరు కన్నడిగులకు అవార్డులు వరించాయి. సోమణ్ణ (66), ప్రేమ ధనరాజ్ (72)లకు పద్మశ్రీ ప్రకటించారు.

బెంగళూరుకు చెందిన వైద్యురాలైన అయిన ప్రేమ ధనరాజ్ అగ్నిరక్ష అనే ప్రభుత్వేతర సంస్థ ద్వారా, అగ్ని ప్రమాద బాధితులకు సుమారు 25 వేల మందికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేశారు. ప్లాస్టిక్ సర్జరీ మెళకువల గురించి మూడు పుస్తకాలను రాశారు. తన 8వ ఏట స్టవ్ ప్రమాదంలో ఆమెకు 50 శాతం శరీరం కాలిపోయి 14కు పైగా శస్త్రచికిత్సలు జరిగాయి. ఆ తపనతో వైద్యురాలై అగ్ని ప్రమాద బాధితులకు అండగా నిలిచారు.



సోమణ్ణ, ప్రేమ ధనరాజ్

గిరిజన సేవకు..

మైసూరుకు చెందిన సోమణ్ణ.. జేను, కురుబ, బుడకట్టు ఆదివాసీల హక్కుల కోసం నాలుగు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నారు. అడవుల్లో నివసించే బుడకట్టు ప్రజల రక్షణ, వారి భద్రత కోసం శ్రమించారు.

నేత్రపర్వంగా అమ్మవారి రథోత్సవం



తేరులో బనశంకరిమాత ఉత్సవ విగ్రహం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

- జనసంద్రమైన బనశంకరీదేవి ఆలయం

బనశంకరి: బెంగళూరులో వెలసిన బనశంకరీ దేవి ఆలయంలో అమ్మవారి రథోత్సవం అశేష జనవాహిని మధ్య కన్నులపండువగా నిర్వహించారు. పుష్య శుద్ధపౌర్ణమి గురువారం వేకువజామున సుప్రభాతసేవ అనంతరం అర్చకులు ఏ చంద్రమోహన్ అభిషేకం తరువాత విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మృత్యుంజయ, నవగ్రహశాంతి, దేవీమూల మంత్ర హోమం, రథాంగ హోమం తదితరాలను నిర్వహించి మేళతాళాల మధ్య అమ్మవారి ఉత్సవ మూర్తిని తేరులో ఆసీనుల్ని చేశారు. మధ్యాహ్నం 11.50 నుంచి 12.50 మధ్య శుభమేష లగ్నంలో తేరును ఊరేగించారు. తేరు కదలగానే భక్తులు అరటిపండ్లు, దవనం విసిరారు. డొల్లు కుణిత, వీరగాసే తదితర జానపద కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ నేత ఏహెచ్.బసవరాజ్, ఈఓ లక్ష్మి, ఆనంద్ గురూజీ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ పరిసరాలు భక్తజనంతో కిక్కిరిశాయి. బనశంకరి, కుమారస్వామి లేఔట్ పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు.



అమ్మవారి ఉత్సవమూర్తి

క్లుప్తంగా

డ్రైవర్ల విధినిర్వహణ శ్లాఘనీయం


ఆర్టీసీ బస్సు డ్రైవర్లతో డిపో మేనేజర్ మంజుల

కంప్లి: ఎంతటి అత్యవసర పరిస్థితిలో కూడా ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చే మహత్తరమైన బాధ్యతను నిర్వర్తించే డ్రైవర్ల కర్తవ్య నిర్వహణ శ్లాఘనీయమని హరపనహళ్లి ఆర్టీసీ డిపో మేనేజర్ మంజుల తెలిపారు. ఆమె డ్రైవర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని తమ డిపో పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న డ్రైవర్లకు గులాబీలు అందించి అభినందించి మాట్లాడారు. రోడ్డు రవాణా శాఖలో విధులు నిర్వహించే డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటూ ఉత్తమ రీతిలో పని చేయడం అభినందనీయం అన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడంలో వారి పాత్రకు జోహార్లు అన్నారు.

కరువు పరిహార నిధుల విడుదల


మాట్లాడుతున్న మంత్రి కృష్ణబైరేగౌడ

రాయచూరు రూరల్: రాష్ట్రంలో కరువు ఛాయలు అధికమైనందున రైతులకు ఎకరాకు రూ.2 వేల చొప్పున పరిహారం అందించడానికి సర్కార్ రూ.550 కోట్ల నిధులు విడుదల చేసిందని రాష్ట్ర రెవిన్యూ శాఖా మంత్రి కృష్ణబైరేగౌడ వెల్లడించారు. ఆయన బుధవారం రాత్రి కలబుర్గిలో విలేకరులతో మాట్లాడారు. వారం రోజుల్లో రైతులందరి ఖాతాల్లో సొమ్ము జమ అవుతుందన్నారు. 35 లక్షల మంది రైతులకు గాను ఇప్పటికే 12 లక్షల మంది రైతులకు నిధులు జమ చేశామన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నెలకొనకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా కలబుర్గి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ప్రియాంక్ ఖర్గే, ఎమ్మెల్యేలు పాటిల్, కనీజా ఫాతిమా, రెవిన్యూ శాఖ కమిషనర్ సునీల్ కుమార్, జిల్లాధికారిణి ఫౌజియా తరన్నుమ్, ఏసీ ఆశప్పలున్నారు.

అయోధ్య రామునికి రైతు రూ.91 వేల విరాళం


కర్ణాటక గ్రామీణ బ్యాంక్ నుంచి పంపిన సణ్ణకరియప్ప

రాయచూరు రూరల్: కరువు, కష్టకాలంలో అయోధ్యలో శ్రీరామ మందిరానికి రూ.91 వేలు దానం చేసిన రైతు ఉదంతం జిల్లాలో చోటు చేసుకుంది. తన పొలంలో పండించిన జొన్నలను అమ్మగా వచ్చిన మొత్తంలో 75 శాతం దానం చేశారు. సింధనూరు తాలూకా గోమర్సికి చెందిన రైతు సణ్ణకరియప్ప పొలంలో 80 బస్తాల జొన్నలు పండగా, ఇంటి కోసం 30 బస్తాలను నిల్వ ఉంచుకొని 50 బస్తాలు అమ్మగా వచ్చిన సొమ్ములో నుంచి ఈనెల 23వ తేదీన రూ.91,870లను ఆర్టీజీఎస్ ద్వారా శ్రీరామ జన్మ భూమి తీర్థ క్షేత్రం, అయోధ్య అనే చిరునామాకు కర్ణాటక గ్రామీణ బ్యాంక్ ఖాతా నుంచి పంపి రామునిపై తన భక్తిని చాటుకున్నారు.

కనీస వేతనాల కోసం ధర్నా

రాయచూరు రూరల్: కట్టడ కార్మికులు, హమాలీలకు కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయూ సంఘం జిల్లాధ్యక్షురాలు పద్మ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టి మాట్లాడారు. తొమ్మిదేళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్న కార్మిక వర్గాలకు చేస్తున్న అన్యాయాలపై ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. బహుళ జాతి కంపెనీల ఆధ్వర్యంలో నలిగి పోతున్న సంస్థలను పరిరక్షించాలన్నారు. కనీస వేతనాలను రూ.18 వేల నుంచి 31 వేల వరకు పెంచాలన్నారు. పెట్టుబడిదారుల రూ.14.50 లక్షల రుణాలను రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం కింది స్థాయి కార్మికుల వేతనాలను పెంచాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

గొర్రెల దొంగలకు దేహశుద్ధి


దెబ్బలు తిన్న దొంగలు వీరే

శ్రీనివాసపురం: తాలూకాలోని రోజరపల్లి గ్రామంలో గురువారం జరిగిన వారపు సంతలో గొర్రెలను దొంగతనం చేయడానికి వచ్చిన దొంగలను పట్టుకున్న స్థానికులు వారికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. బెంగళూరు డీజేహళ్లికి చెందిన ముజీర్‌ఖాన్, శబ్బీర్ వారపు సంతలో గొర్రెలను కొనే నెపంతో వచ్చి గొర్రెలను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీనిని గమనించిన సంతలోని రైతులు వారిని పట్టుకుని బాగా దేహశుద్ధి చేసిన అనంతరం పోలీసులకు అప్పజెప్పారు. ఈ ఘటనపై శ్రీనివాసపుర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

వంతెనకు కారు ఢీ.. నలుగురు మృతి

- చిత్రదుర్గ జిల్లాలో ఘోరం
- మృతుల్లో ముగ్గురు చిన్నారులు
- మృతుల స్వస్థలం రాయచూరు జిల్లా

సాక్షి, బళ్లారి: కళ్లు తెరిచి చూసేలోగా ఘోరం జరిగిపోయింది. ఒకే కుటుంబానికి చెందినవారు రాయచూరు జిల్లా దేవదుర్గ తాలూకా నుంచి పని మీద బెంగళూరుకు బయలుదేరారు. కారులో వెళుతుండగా ప్రమాదం రూపంలో మృత్యువు కబళించడంతో చిన్నారులతో సహా నలుగురు మృతి చెందారు. గురువారం తెల్లవారు జామున చిత్రదుర్గ జిల్లా చెళ్లకెరె తాలూకా సాణికెరె సమీపంలో జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది.


మార్చురీ వద్ద రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు


ఆస్పత్రి మార్చురీలో కారు డ్రైవర్ లింగప్ప(ఇన్‌సెట్‌లో), చిన్నారుల మృతదేహాలు


కాలువలో పడిన ఆటోను పరిశీలిస్తున్న స్థానికులు

డ్రైవర్ నిద్రమత్తు వల్లే..

డ్రైవర్ నిద్రమత్తులోకి జారడంతో కారు అదుపు తప్పి వంతెనను ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న డ్రైవర్ లింగప్ప (26), చిన్నారులు అయ్యాళప్ప (5), సింధుశ్రీ (2), రక్షిత (11 నెలలు) అక్కడికక్కడే మృతి చెందారు. యల్లమ్మ, మల్లమ్మ, నాగప్ప అనేవారు తీవ్రంగా గాయపడటంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. స్థానిక ఎస్ఐ శివరాజ్‌తో పాటు పలువురు పోలీసులు అక్కడికి బాధితులను, మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. ఘటనపై చెళ్లకెరె పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా.. ఒకరి మృతి

వ్యవసాయ కూలీలు ఆటోలో పనికి వెళ్లి తిరిగి వస్తుండగా ఆటో అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లడంతో ఒకరు మరణించిన ఘటన గురువారం జరిగింది. వివరాలు..హాలకుంది గ్రామానికి చెందిన దాదాపు 12 మందికి పైగా వ్యవసాయ కూలీలు ఆటోలో రోజూ మాదిరిగానే బొబ్బుకుంట వద్ద పత్తి, మిరప కాయలు విడిపించేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో హెచ్ఎల్‌సీ కాలువ డిస్ట్రిబ్యూటరీలోకి ఆటో దూసుకెళ్లడంతో ఆటోలో ఉన్న వ్యవసాయ కూలి పార్వతి(52) అనే మహిళ మృతి చెందగా, ఈ ఘటనలో మరో 10 మందికి గాయాలు కాగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు. ఈ విషయం తెలిసిన వెంటనే స్థానిక ఏఎస్పీ, డీఎస్పీలు, గ్రామీణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సతీష్‌తో పాటు పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. గాయపడిన వారిని విమ్స్ ఆస్పత్రికి, మృతదేహాన్ని కూడా పోస్టుమార్టం నిమిత్తం విమ్స్ మార్చురీకి తరలించారు. ఈ ఘటనతో ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఆటోలో సామర్థ్యానికి మించి కూలీలను నిత్యం పనులకు తీసుకెళ్లడంతోనే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోయారు. కాగా ఈ ఘటనపై గ్రామీణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులంతా ఓటు హక్కు పొందాలి


ఉత్తమ అధికారులను సన్మానిస్తున్న దృశ్యం

మాలూరు: 18 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ కె.రమేష్ తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన జాతీయ ఓటరు దినోత్సవంలో కళాశాల విద్యార్థులకు ఎపిక్ కార్డులను అందించి మాట్లాడారు. అర్హులైన వారు తప్పనిసరిగా ఓటరు కార్డును పొందాలన్నారు. ఒక్కో పోలింగ్ బూత్‌కు ఒక్కో పోలింగ్ అధికారిని నియమించారన్నారు. ఆయా గ్రామాల్లో బీఎల్‌ఓల ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. దీని వల్ల నికరమైన ఓటరు జాబితా తయారీ సాధ్యమైందన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేత విద్యార్థులకు బహుమతులను అందించారు. పురసభ ముఖ్యాధికారి ప్రదీప్‌కుమార్, బీఈఓ నంజుండగౌడ, ఉపాధ్యాయుడు మునియప్ప, దిశా సమితి సభ్యుడు సూర్యనారాయణరావ్ పాల్గొన్నారు.

యరగేరా దర్గాలో ఎమ్మెల్యే పూజలు


దర్గాను సందర్శించిన ఎమ్మెల్యే బసనగౌడ

రాయచూరు రూరల్: యరగేరా బడేసాబ్ దర్గా ఉరుసు వైభవంగా ముగిసింది. గురువారం దర్గాను సందర్శించిన గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ నిర్వాహకులతో కలిసి భక్తిశ్రద్ధలతో దర్గాలో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాఫర్ అలీ పటేల్, మహ్మద్ పటేల్ నిజాముద్దీన్, కృష్ణాజుల్లా పాల్గొన్నారు.

సైకిల్ జాతా


సైకిల్ జాతా నిర్వహిస్తున్న విద్యార్థినులు

కంప్లి: ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం అమలు చేసిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జీపీ అధ్యక్షురాలు శ్రీదేవి తెలిపారు. సండూరు తాలూకా తాళూరు గ్రామంలో గురువారం బేటీ బచావో బేటీ పడావో, జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా సైకిల్ జాతాను ప్రారంభించి ఆమె మాట్లాడారు. మహిళలు, ఆడపిల్లల రక్షణపై జాతాలో ప్రచారం చేయాలన్నారు.

జాతీయ ఓటరు దినోత్సవం


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

కంప్లి: ప్రజా ప్రభుత్వంపై దృఢ విశ్వాసం గల భారత పౌరులైన తాము తమ దేశపు ప్రజాసత్తాత్మక సంప్రదాయాలు, ముక్త, న్యాయ సమ్మత, శాంతియుత ఎన్నికల ఘనతను ఎత్తి చూపుతామని, ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా, కుల, మత, భాష, విద్య ఎలాంటి ప్రేరేపణలకు ప్రభావితం కాకుండా తాము ఓటు హక్కు వినియోగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. తాలూకా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటర్ల ప్రతిజ్ఞా విధిని తహసీల్దార్ శివరాజ్ బోధించారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

ఎలుగును చంపితిన్న పులి



మైసూరు: చామరాజనగర జిల్లాలోని గుండ్లుపేట తాలూకాలోని బండీపుర అడవిలో ఒక పెద్ద పులి.. ఎలుగుబంటి పైన దాడి చేసి భక్షించింది. ఆ వీడియో వైరల్ అయ్యింది. బండీపురలో సఫారి విహారానికి వెళ్ళిన పర్యాటకులు.. పులి దాడి చేసి ఎలుగుబంటిని తింటున్న వైనాన్ని వీడియోలు తీసి సోషల్ మీడియాలో పెట్టారు. ఓ చెలిమె దగ్గరకు నీరు తాగడానికి వచ్చిన భల్లూకంపైన పులి భీకరంగా దాడి చేసి చంపి ఆరగించింది. పులిని ఎలుగుబంట్లు కూడా ఎదుర్కొని తరిమి వేస్తాయి. కొన్నిసార్లు ఇలా ఓడిపోతుంటాయి.

ఓటుతో ప్రజాప్రభుత్వ వ్యవస్థ పటిష్టం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: ప్రజాప్రభుత్వ వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ జీఎస్ సుధీంద్ర తెలిపారు. గురువారం పట్టణంలోని పురసభ సభాంగణంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. ఓటు హక్కు ప్రాధాన్యత గురించి ప్రతి ఓటరూ తెలుసుకోవాలన్నారు. ఎన్నికల్లో ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉత్తమ నాయకులను ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో టీపీ ఈఓ ఎస్.శివకుమారి, పురసభ ముఖ్యాధికారి వైఎస్ సత్యనారాయణ్, కసాప తాలూకా అధ్యక్షుడు పీఎస్ మంజుల, రెవిన్యూ అధికారి వి.నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాగేపల్లి : జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని తాలూకాలోని చేళూరులో కర్ణాటక పబ్లిక్ పాఠశాల విద్యార్థులతో గురువారం ర్యాలీ నిర్వహించారు. గ్రామ పంచాయతీ పీడీఓ కే.వెంకటాచలపతి మాట్లాడుతూ ఓటు హక్కు ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

నేడు మెట్రో టికెట్ రాయితీ

బనశంకరి: గణతంత్రదినోత్సవం సందర్భంగా లాల్‌బాగ్‌లో ఏర్పాటుచేసిన ఫ్లవర్ షో కు వెళ్లే ప్రయాణికులకు మెట్రో టికెట్ రాయితీని ప్రకటించింది. నేడు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు లాల్‌బాగ్‌మెట్రో స్టేషన్ నుంచి నగరంలోని ఏ మెట్రోస్టేషన్ కు అయినా రూ.30 టికెట్ తీసుకుని ప్రయాణించవచ్చు.

వైభవంగా సత్యసాయి శ్రీగిరి రథోత్సవం


శ్రీసత్యసాయి శ్రీగిరి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పుట్టపర్తి రూరల్: పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం సాయంత్రం సత్యసాయి శ్రీగిరి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రతి పౌర్ణమి నాడు శ్రీగిరి రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రశాంతినిలయం ముఖ ద్వారం వద్ద అందంగా అలంకరించి సత్యసాయి చిత్రపటాన్ని రథంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథాన్ని లాగుతూ ఊరేగింపుగా ప్రశాంతినిలయం, విద్యాగిరి, గోకులం, ఎనుములపల్లి ,గణేష్ కూడలి, పెట్రోల్‌బంక్, చింతతోపు, గోవిందయ్యపేట, పెద్దబజార్ మీదుగా ప్రశాంతి నిలయానికి చేర్చారు. ఈ ఉత్సవంలో దేశ విదేశీ భక్తులు గిరిప్రదక్షణలో అధికసంఖ్యంలో పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

హత్య కేసుపై సీబీఐ దర్యాప్తు కోసం 31న ధర్నా


మాట్లాడుతున్న వెంకటస్వామి

కోలారు: జెడ్పీ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు ఎం శ్రీనివాసన్ హత్య కేసుపై సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేస్తూ రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్‌పీఐ) ఆధ్వర్యంలో ఈ నెల 31న బెంగళూరులోని ఫ్రీడం పార్కులో వివిధ సంఘాల నేతృత్వంలో ధర్నా చేస్తున్నట్లు ఆర్‌పీఐ జాతీయ కార్యాధ్యక్షుడు ఎం.వెంకటస్వామి తెలిపారు. గురువారం నగరంలోని పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దళిత నాయకుడు శ్రీనివాసన్ హత్యను నిరసిస్తూ పలు సంఘాలు గత డిసెంబర్‌లో బెంగళూరు ఫ్రీడం పార్కులో ధర్నా చేసిన ఫలితంగా ప్రభుత్వం సీఓడీ దర్యాప్తునకు ఆదేశించిందన్నారు. కేసును సీఓడీకి అప్పగించి రెండు నెలలు గడిచినా కేసులో ఇంతవరకు ఎలాంటి పురోగతి కనిపించలేదన్నారు. సీఓడీ తనిఖీపై తమకు విశ్వాసం లేదని, అందువల్ల కేసును సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ధర్నాలో 15 మందికి పైగా మఠాధిపతులు పాల్గొంటారన్నారు. రైతు సంఘం కార్యాధ్యక్షుడు అబ్బణి శివప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనందకుమార్, కల్వమంజలి శివణ్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే లక్ష్యసాధన సులభం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

కోలారు: విద్యార్థులు ఇష్టపడి చదివితే లక్ష్యసాధన సులభతరం అని తహసీల్దార్ జీపీ హర్షవర్ధన్ విద్యార్థులకు హితవు పలికారు. గురువారం నగరంలోని టి.చెన్నయ్య రంగమందిరంలో శ్రీరాం ఫైనాన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థులకు ప్రోత్సాహధనం పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు జ్ఞానార్జన కోసం నిత్యం పత్రికలను చదవాలన్నారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన, కంప్యూటర్ పరిజ్ఞానాన్ని కూడా పెంచుకోవాలన్నారు. ప్రైవేటు సంస్థలు విద్యార్థుల విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం అందించడం హర్షణీయమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆస్తులు సంపాదించి ఇవ్వడానికి బదులుగా వారినే ఆస్తిగా తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో 500 మంది విద్యార్థులకు ప్రోత్సాహధనం అందించారు. కార్యక్రమంలో నగర పోలీస్ ఇన్‌స్పెక్టర్ సదానంద, శ్రీరాం ఫైనాన్స్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ శ్రీధర్, గల్‌పేట పోలీస్ ఇన్‌స్పెక్టర్ అరుణ్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి పునాది ఓటు హక్కు

కోలారు: ఓటు హక్కు విజయవంతం ప్రజాప్రభుత్వ వ్యవస్థ వల్లే సాధ్యమని జిల్లా సెషన్స్ జడ్జి జీఏ మంజునాథ తెలిపారు. గురువారం నగరంలోని కలెక్టరేట్ కార్యాలయ ఆడిటోరియంలో నిర్వహించిన జాతీయ ఓటరు దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఓటరు ఎన్నికల ముందు అభ్యర్థి పూర్వాపరాలు బాగా తెలుసుకుని ఓటు చేయాలన్నారు. న్యాయమూర్తి సునీల్ హొసమని మాట్లాడుతూ 2011 నుంచి ఓటరు దినోత్సవం అమలులోకి వచ్చిందన్నారు. జెడ్పీ సీఈఓ పద్మ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీపీల అభివృద్ధి కోసం పలు పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. జిల్లాధికారి అక్రంపాషా మాట్లాడుతూ ప్రజాప్రభుత్వ పాలన వచ్చిన తరువాత ప్రతి ఒక్కరికీ ఓటు హక్కును కల్పించారన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందించారు. డీడీపీఐ రామచంద్రప్ప, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

బాలల హక్కులు కాపాడాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: బాలల హక్కుల రక్షణకు ఉపాధ్యాయులు సమాజంతో చేతులు కలపాలని సివిల్ జడ్జి, జిల్లా న్యాయ ప్రాధికార సభ్యుడు సునీల్ హొసమని తెలిపారు. గురువారం తొట్లి గ్రామంలోని శాంతినికేతన ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాల్య వివాహాలు, పోక్సో చట్టాలపై అవగాహన సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. చదువుకునే వయసులో పిల్లలను గ్యారేజీ, ఇటుకల ఫ్యాక్టరీల్లో పనిలో పెట్టరాదన్నారు. పిల్లలు ఇలాంటి చోట పని చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే 1098కు ఫిర్యాదు చేయాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టడానికి బాలగంగాధర తిలక్ వంటి మహనీయులు ఎంతో శ్రమించారన్నారు. యువత ఇలాంటి దురాచారాలను అరికట్టడానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమానాస్పద యువతి అరెస్ట్

రాయచూరు రూరల్: యాపలదిన్ని దర్గా ఉరుసు ఉత్సవాల్లో భాగంగా గురువారం దర్గా వద్ద ఓ గుర్తు తెలియని యువతి చిన్న పిల్లల కిడ్నాప్‌నకు ప్రయత్నిస్తుండగా యువతిని అరెస్ట్ చేసినట్లు యాలపదిన్ని పోలీసులు తెలిపారు. పట్టుబడ్డ యువతి పేరు తెలంగాణకు చెందిన రాజమ్మ అని తెలిపారు. గ్రామాల్లో తల్లిదండ్రులు చిన్న పిల్లల కదలికలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

అక్రమ సంబంధాన్ని ప్రశ్నించినందుకు భార్య హత్య

- మృతదేహాన్ని గోనె సంచిలో కుక్కి చెరువులో పడేసిన భర్త
- దావణగెరె జిల్లాలో ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

సాక్షి,బళ్లారి: తన అక్రమ సంబంధాన్ని ప్రశ్నించిన భార్యను అడ్డు తొలగించుకోవాలని ఓ భర్త తన ప్రియురాలితో కలిసి భార్యను హత్య చేసి, ఆపై మృతదేహాన్ని గోనెసంచిలో కట్టి చెరువులో పడేసిన ఘటన దావణగెరె జిల్లాలో వెలుగు చూసింది. వివరాలు..దావణగెరె జిల్లా కొడగనూరు గ్రామానికి చెందిన కావ్య(23) అనే గృహిణి, ఆమె భర్త సచిన్ ఇద్దరూ అన్యోన్యంగా కాపురం చేసుకుంటుండగా చైత్ర అనే మహిళతో సచిన్‌కు అక్రమ సంబంధం ఏర్పడింది. కొంతకాలానికి ఈ విషయం తనకు తెలియడంతో సచిన్‌ను భార్య ప్రశ్నించింది. దీంతో తరచూ గొడవలు జరిగేవి. చివరకు ఎలాగైనా తమ ఆనందానికి ఆటంకంగా ఉన్న భార్యను అడ్డు తొలగించుకునేందుకు పథకం ప్రకారం మూడు రోజుల క్రితం ఆమెను దారుణంగా హత్య చేసి మృతదేహాన్ని గోనెసంచిలో కుక్కి చెరువులో పడేశారు. అయితే కొన్ని రోజుల తర్వాత చెరువులో పడేసిన గోనెసంచిలో మృతదేహం బయట పడడంతో గుర్తించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టగా అసలు గుట్టు రట్టయింది.

పురుగుల మందు తాగిన తల్లీకొడుకు

- బాలుడు మృతి


దీక్షిత్ గౌడ (ఫైల్)

దొడ్డబళ్లాపురం: తల్లిదండ్రుల మధ్య గొడవ వారి ముక్కుపచ్చలారని బిడ్డను బలిగొన్న సంఘటన హారోహళ్లి తాలూకా గోదూరు గ్రామంలో చోటుచేసుకుంది. గోదూరు గేట్ వద్ద నివసిస్తున్న సోమశేఖర్, పూర్ణిమ దంపతుల కుమారుడు దీక్షిత్ గౌడ (3) మృతి చెందిన చిన్నారి. దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో పూర్ణిమ బొద్దింకల మందును నీటిలో కలిపి తానూ తాగి, కుమారునికి తాగించింది. అస్వస్థులయిన ఇద్దరినీ బెంగళూరు దయానంద ఆస్పత్రికి తరలించగా దీక్షిత్ గౌడ ప్రాణాలు విడిచాడు, పూర్ణిమ కోలుకుంటోంది. హారోహళ్లి పోలీసులు పరిశీలించి దంపతులపై కేసు నమోదు చేశారు. భర్తను భయపెట్టాలని బొద్దింకల మందును తాగామని, చనిపోవాలని కాదని పూర్ణిమ తెలిపింది.

ఇకపై ఇంటి వద్దకే ఫించన్లు

కోలారు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు ఇకపై వారి ఇంటి వద్దకే సౌకర్యాలను అందిస్తామని, దీని వల్ల లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదని జిల్లాధికారి అక్రంపాషా తెలిపారు. గురువారం తన కార్యాలయంలో నిర్వహించిన బెంగళూరు డివిజన్ స్థాయి పింఛన్ అదాలత్‌ను ప్రారంభించి ఆయన మాట్లాడారు. పథకం ప్రయోజనాలను పొందడానికి లబ్ధిదారులు కార్యాలయానికి రావడానికి బదులుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే పథకాలను అందిస్తారన్నారు. వృద్ధుల పింఛన్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తారన్నారు. అదాలత్‌లో సమర్పించిన అర్జీల్లో కొన్నింటిని వేర్వేరు శాఖల అధికారులతో చర్చించి అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు. కొత్తగా పింఛన్ కోసం సమర్పించిన అర్జీలను అధికారులు త్వరగా పరిష్కరించి ఆదేశ పత్రాలను ఇస్తారన్నారు.

నేటి నుంచి రాజ్యాంగ జాగృతి జాతా


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ హర్షవర్ధన్

కోలారు: జీపీల్లో శుక్రవారం నుంచి రాజ్యాంగ హక్కులతో పాటు బాధ్యతలపై కూడా ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ హర్షవర్ధన్ తెలిపారు. గురువారం తన కార్యాలయంలో జరిగిన పూర్వ సిద్ధతా సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతా ఈనెల 26న ప్రారంభమై ప్రతి జీపీని సందర్శించి అనంతరం ఫిబ్రవరి 24న బెంగళూరులోని ప్యాలెస్ మైదానంలో ముగుస్తుందన్నారు. పంచాయతీకి జాతా వచ్చినప్పుడు గ్రామ ప్రముఖులు, గ్రామీణ ప్రజలను ఒక చోట చేర్చి వారికి మన రాజ్యాంగ హక్కుల గురించి తెలియజేయాలన్నారు. ప్రతి జీపీకి ఒక సంపన్మూల ఉపాధ్యాయుడిని నియమించారన్నారు.ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు చంద్రప్ప, ప్రధానోపాధ్యాయుడు ఓ మల్లికార్జున, ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, గంగాధరమూర్తి పాల్గొన్నారు.

డిమాండ్లు తీర్చాలని వినతి

కంప్లి: డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పదాధికారులు గురువారం ఎమ్మెల్యే గణేష్‌కు వినతిపత్రం అందించారు. తాలూకా అధ్యక్షుడు హెచ్.దొడ్డబసప్ప మాట్లాడుతూ ఉద్యోగుల 7వ వేతన కమిషన్, జ్యోతి సంజీవిని ఆరోగ్య పథకం అమలు, హైస్కూల్ ఉపాధ్యాయుల వేతన తారతమ్య నివారణ తదితరాలను పరిష్కరించాలని కోరారు.

క్లుప్తంగా

లోకాయుక్తకు చిక్కిన బెస్కాం ఏఈఈ


ఏఈఈ నవీన్‌కుమార్

దొడ్డబళ్లాపురం: లంచం తీసుకుంటూ బెస్కాం ఏఈఈ లోకాయుక్తకు చిక్కారు. ఈ ఘటన బెంగళూరులో చోటుచేసుకుంది. చందన్‌కుమార్ అనే వ్యక్తి తన ఇంటికి విద్యుత్ కనెక్షన్ కోసం నాగరభావి పరిధిలోని థణిసంద్ర బెస్కాం కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. అయితే కనెక్షన్ ఇవ్వాలంటే రూ.80వేలు లంచం ఇవ్వాలని ఏఈఈ నవీన్‌కుమార్ డిమాండ్ చేశాడు. దీంతో చందన్‌కుమార్ లోకాయుక్తను ఆశ్రయించాడు. గురువారం పథకం ప్రకారం బాధితుడు రూ.80వేలు ఇస్తుండగా లోకాయుక్త అధికారులు దాడి చేసి నవీన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు.

పండ్లు, ఆకుకూరల ప్రదర్శన



బాగేపల్లి : ఆహారంలో తీసుకోవాల్సిన పోషకాలపై పట్టణంలోని సహార పాఠశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆరోగ్యంగా ఉండేందుకు వివిధ రకాల పండ్లు, కూరగాయల వినియోగంపై డాక్టర్ మహ్మద్ ఎస్. నూరుల్లా అవగాహన కల్పించారు.

మెరుగైన వైద్యం అందించండి


ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎం.సతీష్‌రెడ్డి

బొమ్మనహళ్లి : పీహెచ్‌సీ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి ఆరోగ్యాలను పరిరక్షించాలని బొమ్మనహళ్లి ఎమ్మెల్యే ఎం. సతీష్ రెడ్డి సూచించారు. బొమ్మనహళ్లిలోని హొంగసంద్ర వార్డులో అభివృద్ధి చేసిన పీహెచ్‌సీని గురువారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పేదలు కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లలేరని, వారు ఎక్కువగా వచ్చేది పీహెచ్‌సీలకేనన్నారు. వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. బీజేపీ మహిళా అధ్యక్షురాలు, మాజీ కార్పొరేటర్ భారతీ రామచంద్ర, మాజీ కౌన్సిలర్ టి.రామచంద్ర, బీజేపీ నాయకుడు మునిరాజు పాల్గొన్నారు.

ఆర్టీసీలో డ్రైవర్ల పాత్ర మహత్తరం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డిపో మేనేజరు వి.శివప్ప

గౌరిబిదనూరు: నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యాలకు చేర్చడంలో డ్రైవర్లు మహత్తరమైన పాత్ర పోషిస్తున్నారని కేఎస్ ఆర్టీసీ డిపో మేనేజర్ వి.శివప్ప అన్నారు. డిపోలో ఏర్పాటు చేసిన జాతీయ డ్రైవర్ల దినాచరణను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఏ డ్రైవర్ కూడా ఉద్దేశపూర్వకంగా ప్రమాదాలు చేయడని, విధివశాత్తూ ప్రమాదాలు జరుగుతుంటాయన్నారు. రోడ్డు నిబంధనలు పక్కాగా పాటిస్తే ప్రమాదాలకు ఆస్కారం ఉండదన్నారు. పరమేశ్వర సింగ్, నరసింహారెడ్డి, దానమ్మ తదితరులు పాల్గొన్నారు.

గదగ్ జిల్లా డీడీపీయూ మృతి


కృష్ణప్ప(ఫైల్)

యశవంతపుర: గదగ్ జిల్లా పీయూసీ కాలేజీల జిల్లా డిప్యూటీ డైరెక్టర్(డీడీపీయూ) డాక్టర్ పీ కృష్ణప్ప(56) హఠాన్మరణం చెందారు. ఇంటిలో నిద్రిస్తుండగా కన్నుమూశారు. కోలారు జిల్లాకు చెందిన కృష్ణప్ప 8 నెలల క్రితం గదగ్ జిల్లా డీడీపీయూగా బదిలీ అయ్యారు. అయన మృతికి జిల్లా స్థాయి అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.

చెరకు రైతులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి


మంత్రి చెలువరాయస్వామికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మండ్య : రాష్ట్ర బడ్జెట్‌లో చెరకు రైతులకు నిధులు కేటాయించాలని చెరకు సాగు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు జిల్లా ఇన్‌చార్జ్, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి చెలువరాయస్వామికి గురువారం వినతిపత్రం అందించారు. ప్రకృతి విపత్తులతో, లేదా నిప్పు అంటుకొని చెరకు పంట నష్టపోయిన రైతులకు ఇప్పటివరకు ఎలాంటి పరిహారం అందలేదన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అయోధ్యవాసికి కుంచె నీరాజనం


సీతాన్వేషణలోని ఒక ఘట్టం


జటాయువుకు సపర్యలు చేస్తున్న రామలక్ష్మణులు


తాను గీసిన చిత్రం వద్ద కళాకారుడు హరి తదితరులు

బనశంకరి: జగదభి రాముడు..రఘుకుల సోముడు శ్రీరాముడి జీవితచరిత్రను ఓ చిత్రకారుడు కాన్వాస్‌పై అందంగా చిత్రీకరించాడు. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని బెంగళూరు నగరంలో చెన్నేనహళ్లి జనసేవా విద్యాకేంద్రంలో శ్రీరాముడి జీవితవృత్తాంతంపై ఏర్పాటు చేసిన పెయింటింగ్ ప్రదర్శన నగరవాసులను కనువిందుచేసింది. వీఎస్‌ఎల్ ఆర్ట్స్ గ్యాలరీ థీమ్ ఆధారిత వర్ణచిత్రకళాకారుడు, హైదరాబాద్ నివాసి హరి తన కుంచెతో శ్రీరామ జీవిత వృత్తాంతాన్ని అద్భుతంగా గీశాడు. లంకలో ఆంజనేయుడిని శ్రీరాముడు అలింగనం చేసుకోవడం, రామసేతుకు సాయం చేసిన ఉడతను ఆప్యాయంగా శ్రీరాముడు పలుకరించే పెయింటింగ్స్‌ను ఎంతో అద్భుతంగా గీశారు. శ్రీరాముడి పట్టాభిషేకం పెయింటింగ్ అద్భుతంగా ఉంది. ప్రదర్శనకు విచ్చేసిన వారికి శ్రీరాముడి జీవితం గురించి కళాకారుడు హరి వివరించారు. భావితరాలకు దివ్యపురుషుడు శ్రీరాముడి జీవితం ఆదర్శాలను తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అంతకుముందు చిత్రకళా అభియాన్ పెయింటింగ్ ప్రదర్శనను దక్షిణ మధ్యక్షేత్ర కరసేవ ఆర్‌ఎస్‌ఎస్ మేనేజింగ్ ట్రస్టీ ఎన్.తిప్పేస్వామి, కార్యదర్శి ఏఎస్.నిర్మల్‌కుమార్ ప్రారంభించారు.


విల్లంబులతో జగదభిరాముడు


ఉడతను ఆప్యాయంగా స్పృశిస్తున్న శ్రీరామచంద్రమూర్తి


హనుమంతుడిని ఆలింగనం చేసుకున్న శ్రీరాముడు

వలస కూలీ ఆత్మహత్య

దొడ్డబళ్లాపురం: చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన హారోహళ్లి వద్ద చోటుచేసుకుంది. హారోహళ్లి పారిశ్రామికవాడలోని టెక్స్‌ఫిల్ కంపెనీలో పనిచేస్తున్న యూపీకి చెందిన హరికేశ్ యాదవ్ (28), అనారోగ్యానికి గురైన హరికేశ్ అద్దె గదిలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. 21న బయటకు వెళ్లిన అతడు తిరిగి రాలేదు. గురువారంనాడు గిరేనహళ్లి వద్ద ఉన్న సుత్తకట్టె చెరువులో అతని మృతదేహం లభించింది. అనారోగ్యంతో విరక్తి చెంది చెరువులోకి దూకి ఉంటాడని భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

జూదగాళ్ల అరెస్టు

దొడ్డబళ్లాపురం: పేకాట స్థావరంపై దాడిచేసిన పోలీసులు 11మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసిన సంఘటన కుదూరు వద్ద జరిగింది. మాగడి తాలూకా తిమ్మేగౌడనపాళ్య వద్ద నిర్జన ప్రాంతంలో జూదం ఆడుతుండగా దాడి చేశారు. 11 మందిని అరెస్టు చేసి రూ.3వేలు నగదు, 5 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

ఏనుగు దాడిలో వృద్ధుడు మృతి

దొడ్డబళ్లాపురం: ఏనుగు దాడిలో వృద్ధుడు మృతి చెందిన ఘటన కనకపుర తాలూకా గేరహళ్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పుట్నంజ(65) పొలంలో విశ్రాంతి తీసుకుంటుండగా హఠాత్తుగా వచ్చిన ఏనుగు కాళ్లతో తొక్కి, తొండంతో విసిరేసింది. దాడిలో తీవ్రంగా గాయపడ్డ పుట్నంజ అక్కడికక్కడే మృతిచెందాడు.

ఆనకట్టలు కట్టించారా! ఉద్యోగాలు ఇచ్చారా?

- ప్రధాని మోదీపై సీఎం సిద్ధూ మండిపాటు

బనశంకరి: ఇంధన ధరలు తగ్గిస్తామని చెప్పి విస్మరించారని ప్రధాని నరేంద్రమోదీపై సీఎం సిద్దరామయ్య మండిపడ్డారు. రాజపేటె పట్టణ సంత అన్నమ్మ విద్యాసంస్థ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో సిద్దరామయ్య పాల్గొని మాట్లాడారు. అచ్చేదిన్ అయోగా అని వ్యాఖ్యానించిన నరేంద్రమోదీ ఎక్కడ మీ అచ్చేదిన్ అని ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు తగ్గించారా? ఏడాదికి రూ. 2 కోట్ల ఉద్యోగాల కల్పన ఎక్కడ అని ప్రశ్నించారు. దేశంలో కనీసం ఒక అనకట్ట అయినా కట్టారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఈ దేశానికి ఏమీ చేయలేదని బీజేపీ ఆరోపిస్తోందని, ఈ దేశంలో ఆనకట్టలు కట్టింది కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. అధికారంలోకి రాగానే రాజ్యాంగం మారుస్తామని బీజేపీ ఎంపీ అనంతకుమార్‌హెగ్డే వ్యాఖ్యానించినప్పటికీ బీజేపీలో ఎవరూ వ్యతిరేకించలేదన్నారు. దీంతో బీజేపీ భారత రాజ్యాంగ వ్యతిరేకి అని స్పష్టమైందన్నారు.

డిమాండ్ల సాధనకు ధర్నా


ధర్నాలో పాల్గొన్న ఇంటి పని సిబ్బంది

మండ్య : తమ డిమాండ్లను పరిష్కరించాలని ఇళ్లలో పనిచేసే కార్మికులు ఉద్యమించారు. అఖిల కర్ణాటక గృహ కార్మికుల వృత్తి సంఘం ఆధ్వర్యంలో గురువారం మండ్య నగరంలోని సర్‌ఎం.వి విగ్రహం ముందు ధర్నా నిర్వహించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ యజమానులు ఇచ్చే అరకొర వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. తమకు వేతనాలు పెంచడంతో పాటు ప్రభుత్వం నుంచి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు.

నాటుకోడి కూర రుచిచూసిన సిద్దరామయ్య



బనశంకరి: విరాజపేటె సంత అన్నమ్మసభాంగణంలో గురువారం నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో సీఎం సిద్దరామయ్య పాల్గొన్నారు. మధ్యాహ్నం విరాజపేటె ఎమ్మెల్యే ఏఎస్.పొన్నణ్ణ కొడగు ప్రత్యేక సంప్రదాయ ఆహారమైన బియ్యం రొట్టె, నాటుకోడి కూర, రాగిముద్ద వడ్డించగా సీఎం సిద్దరామయ్య తృప్తిగా ఆరగించారు.

సీఐపైకి కారు దూకించే యత్నం

బనశంకరి: జ్ఞానబారతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ జంట హద్దుమీరి ప్రవర్తించింది. ప్రైవేటు కారులో విచ్చేసిన జంట పార్కు పక్కన వాహనం నిలిపి కామకలాపాల్లో మునిగిపోయారు. ఈ దృశ్యం గమనించిన సీఐ కారు వద్దకు వెళ్లి మందలించేందుకు యత్నించగా ఆ జంట సీఐపైకి కారు దూకించే యత్నం చేసి వేగంగా ఉడాయించారు.

సమైక్యతకు బీజేపీ చిచ్చు: ఉగ్రప్ప

బొమ్మనహళ్లి: కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రధాని నరేంద్రమోదీ సర్కారు మత సామరస్యానికి విఘాతం కలిగించేలా కుట్రలు చేస్తోందని కాంగ్రెస్ నాయకుడు వి.ఎస్ ఉగ్రప్ప ఆరోపించారు. గురువారం హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రం శతాబ్దాలుగా ఆధ్యాత్మిక సమైక్యతకు ప్రసిద్ధి అని, ఎంతోమంది మత గురువులు సామరస్య సంప్రదాయన్ని ప్రబోధించారని అన్నారు. కానీ బీజేపీ కులాల మధ్య, మనుషుల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తోందని అన్నారు. దీనికి నిరసనగా ఈ నెల 30వ తేదీన మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా నగరంలో హోసూరు మెయిన్ రోడ్డులో మడివాళ వద్ద నుంచి బొమ్మనహళ్లి మీదుగా మానవహారం ప్రదర్శన నిర్వహిస్తామని చెప్పారు.

ఘనంగా బాదామి తేరు ఉత్సవం

బనశంకరి: బాగల్‌కోటె జిల్లాలో చరిత్ర ప్రఖ్యాత బాదామి బనశంకరీదేవి బ్రహ్మరథోత్సవం అశేష జనవాహిని మధ్య గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. బనశంకరీ దేవి జాతర మహోత్సవాల సందర్భంగా ఆలయ అర్చకులు మూల విరాట్‌కు ప్రత్యేక అర్చనలు చేసి మధ్యాహ్నం శుభమేష లగ్నంలో తేరు వేడుకను నిర్వహించారు. భక్తులు జై మాతా అంటూ పోటీలు పడి తేరును లాగారు. బాగల్‌కోటె జిల్లావాసులే కాకుండా ఉత్తర కర్ణాటక జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ, అన్నదానం జరిగింది.

యువకుడి ప్రేమ విషాదాంతం

- పెళ్లికి తల్లిదండ్రులు అంగీకరించలేదని ఆత్మహత్య

మైసూరు : యువకుడి ప్రేమ వ్యవహారం విషాదాంతమైంది. పెళ్లికి పెద్దలు అంగీకరించకపోవడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మైసూరు జిల్లా టి.నరసీపుర తాలూకా బన్నూరి రంగాచారి హుండీ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఆవినాష్(30) ఇదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమించాడు. ఆమెతోనే ఏడు అడుగులు నడిచి జీవితాంతం కలిసి ఉండాలని నిర్ణయించుకున్నాడు. ఇదే విషయాన్ని తన ఇంటిలో చెప్పగా కుటుంబ సభ్యులు అంగీకరించలేదు. దిక్కుతోచని స్థితిలో ఇంటిలోనే పురుగుల మందు తాగాడు. కేఆర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. బన్నూరు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బనశంకరీదేవికి పూజలు

తుమకూరు : తుమకూరు జిల్లా హులియారు సమీపంలోని కామశెట్టి పాళ్యలో కొలువైన బనశంకరి అమ్మవారికి పున్నమి వేడుకలను పురస్కరించుకొని గురువారం విశేష పూజలు నిర్వహించారు. వేకువజామునుంచి శ్రీబసవేశ్వర స్వామి, శ్రీబనశంకరి అమ్మవారికి రుద్రాభిషేకం, అష్టోత్తరం, వాస్తు హోమం, నవగ్రహాల హోమం, రుద్ర హోమం, మహాలక్ష్మిహోమం నిర్వహించారు. కుంభాభిషేకం అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేసి అన్నదానం చేశారు.హులియారు, కెంకెరె, సోమజ్జనపాళ్య, లింగప్పనపాళ్య నుంచి భక్తులు తరలివచ్చారు.

ఓటు హక్కుతో ప్రజాస్వామ్య మనుగడ


కృష్ణరాజపురం: ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శివమొగ్గ జిల్లా ప్రధాన న్యాయమూర్తి మంజునాథ్ నాయక్


మండ్య: కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీజీ రమా

కృష్ణరాజపురం : నగరంలోని గార్డెన్ సిటీ కళాశాలలో గురువారం జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి నందీష్ రెడ్డి హాజరై ఓటు హక్కు ఆవశ్యకతను వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకునేందుకు అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అనంతరం ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. పాలికె మాజీ సభ్యుడు వీరన్న పాల్గొన్నారు.

శివమొగ్గ : ఓటు హక్కు వినియోగించుకోవడంతోపాటు చుట్టుపక్కల వారు కూడా ఓటు హక్కును వినియోగించుకునేలా చైతన్యం తేవాలని జిల్లా ప్రధాన న్యాయాలయ న్యాయమూర్తి మంజునాథ్ నాయక్ పిలుపునిచ్చారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని శివమొగ్గ జిల్లా పంచాయతీ, జిల్లా న్యాయసేవల ప్రాధికార, శివమొగ్గ మహానగర పాలికె ఆధ్వర్యంలో శివమొగ్గ నగరంలోని కువెంపు రంగ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జడ్జి పాల్గొని మాట్లాడారు. 1988 వరకు 21 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు ఉండేదని, ప్రస్తుతం ఆది 18 సంవత్సరాలు నిండిన వారికి వర్తింపజేశారన్నారు. యువత ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఎన్నికల్లో ఉత్తమ వ్యక్తులను ఎన్నుకోవాలన్నారు.

మండ్య : ఓటు హక్కు చాలా విలువైనదని మండ్య జిల్లా న్యాయ సేవల ప్రాధికార అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీ.జీ.రమా అన్నారు. గురువారం మండ్యలో ఏర్పాటు చేసిన జాతీయ ఓటరు దినోత్సవాన్ని జడ్జి ప్రారంభించి మాట్లాడారు.

హోసూరు వార్తలు..

ఓటు హక్కు అందరి బాధ్యత

హోసూరు: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఉదయం జిల్లా కేంద్రం క్రిష్ణగిరిలో కలెక్టర్ శరయు అధ్యక్షతన చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల, పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కు భారత పౌరుని హక్కు అని, 18 ఏళ్లు దాటిన యువత ఓటర్ జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికార్లు బాబు, మురుగేష్, జయశంకర్, విజయ్ కుమార్, వెంకటేష్, మహేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

హోసూరులో

హోసూరులో సబ్‌కలెక్టర్ ప్రియాంక అధ్యక్షతన ప్రభుత్వ బాలుర ఆటల మైదానం నుంచి ఊరేగింపు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన, ఉపన్యాస, నృత్య పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ, విద్యా శాఖాధికార్లు పాల్గొన్నారు.

బైక్ ప్రమాదంలో కూలీ మృతి

కెలమంగలం: ద్విచక్రవాహనం ప్రమాదంలో కార్మికుడు మరణించిన ఘటన డెంకణీకోట వద్ద చోటు చేసుకొంది. డెంకణీకోట తాలూకా శాలివారం సమీపంలోని అరుళాలం గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు గోవిందరాజ్ (36). బుధవారం సాయంత్రం ములువనపల్లి వద్ద ద్విచక్రవాహనంలో వెళుతూ అకస్మాత్తుగా అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలేర్పడి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. డెంకణీకోట పోలీసులు చేరుకొని శవాన్ని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.

ఘనంగా తైపూస పూజలు

హోసూరు: తమిళ తైపూస మాసాన్ని పురస్కరించుకొని గురువారం మురుగన్ ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. అందులో భాగంగా మురసునాడు మురుగన్ అరకట్టలై సంస్థ ఆధ్వర్యంలో మురుగన్ నిలువెత్తు విగ్రహాన్ని రథంపై ఉంచి పట్టణంలోని పురవీధుల్లో ఊరేగింపు చేపట్టారు. దాసప్ప కళ్యాణమంటపంలో విశేష పూజా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భక్తి భజనలు నిర్వహించారు. ఏఎస్‌టీసీ హడ్కో ప్రాంతంలోని అరుళ్‌మురుగన్ ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు.


విశేష అలంకరణతో మురుగన్ ఉత్సవమూర్తి

విలేకరిపై దాడికి ఖండన


హోసూరులో విలేకరుల ధర్నా

హోసూరు: తిరుప్పూర్ జిల్లా పల్లాడం ప్రాంత విలేకరిపై దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని హోసూరులో అన్ని విలేకరుల సంఘాలు సంయుక్తంగా ఆందోళన చేశారు. నగరంలోని తాలూకా కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. బాధిత విలేకరి నేశప్రభు ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. దాడి చేసిన దుండగులను గూండా చట్టం కింద అరెస్టు చేయాలని, విలేకరులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు.

భార్య పుట్టింటికెళ్లిందని..

హోసూరు: భార్య పుట్టింటికెళ్లిపోవడంతో రైలు ముందు దూకి భర్త ఆత్మహత్య చేసుకొన్న ఘటన ఊత్తంగేరి సమీపంలో చోటు చేసుకొంది. క్రిష్ణగిరి జిల్లా ఊత్తంగేరి సమీపంలోని గంగప్రాంబట్టి గ్రామానికి చెందిన వేడిస్వామి (24). ఇతనికి మూడేళ్ల క్రితం పెళ్లి జరిగింది. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. రెండు రోజుల క్రితం ఘర్షణ జరిగి భార్య పుట్టింటికెళ్లిపోవడంతో విరక్తి చెందిన వేడిస్వామి గురువారం సామలపట్టి రైల్వేస్టేషన్ వద్దకెళ్లి కోవై- చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలు ముందుకు దూకడంతో ప్రాణాలు పోయాయి. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

వృద్ధుడు ఆత్మహత్య

హోసూరు కార్పొరేషన్ పరిధిలోని జయంతి నగర్ ప్రాంతానికి చెందిన దేవరాజ్ (68) ప్రైవేట్ కంపెనీలో కాపలాదారునిగా పనిచేస్తున్నాడు. ఇతనికి తాగుడు అలవాటుంది. దీంతో అనారోగ్యానికి గురయ్యాడు. ఆస్పత్రుల్లో చూపించుకున్నా నయం కాలేదు. బుధవారం రాత్రి రామాలయం సమీపంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు.

తండ్రి అస్థికలు నదిలో కలిపేందుకు వెళ్లి..

క్రిష్ణగిరి: మూడు రోజుల క్రితం మృతి చెందిన తండ్రి అస్థికలను కావేరి నదిలో కలిపేందుకు బంధువులతో కలిసి హొగేనకల్‌కు వెళ్లి నదిలో స్నానం చేస్తూ నీటిలో కొట్టుకెళ్లి కొడుకు చనిపోయాడు. వివరాల మేరకు క్రిష్ణగిరి జిల్లా ఊత్తంగేరి సమీపంలోని చెన్నప్పనాయకనూరు గ్రామానికి సురేష్ (50) మూడు రోజుల క్రితం మృతి చెందాడు. అతని అస్థికలు కావేరినదిలో వదిలేందుకు కొడుకు సంతోష్‌కుమార్ (22), బంధువులతో హొగేనకల్‌కు వెళ్లారు. ఈ సమయంలో నదిలో స్నానం చేస్తుండగా ఆకస్మాత్తుగా నీటిలో కొట్టుకెళ్లి మృతి చెందాడు. ఈ విషయంపై బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయగా అగ్నిమాపక సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని బయటకు తీసి పెన్నాగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


పారాచూట్ ద్వారా ఎగురుతూ ఓటర్లలో చైతన్యం తెస్తున్న దృశ్యం



- ఓటరన్నా మేలుకో

గురువారం బెళగావిలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఓటరు అవగాహన ర్యాలీలు జరిగాయి. విద్యార్థులు నగరంలో ఓటు హక్కు గొప్పతనాన్ని చాటుతూ ప్రదర్శన నిర్వహించిన దృశ్యం. ఈ సందర్భంగా ఓటు ఘనత గురించి చిత్రాలు గీస్తున్న విద్యార్థినులు



నవతరం వందేమాతరం

కొన్ని తరాల వెనక్కి వెళితే...యువతలో దేశభక్తి వ్యక్తీకరణ పద్యం, పాట, కవిత, నినాదాల రూపంలో కనిపించేది. ఇక నేటి యువత విషయానికి వస్తే... సోషల్ మీడియా క్యాంపెయిన్స్, డిజిటల్ ఎంగేజ్‌మెంట్, వర్చువల్ ఎడ్యుకేషనల్ కంటెంట్ ద్వారా తమలోని దేశభక్తిని చాటుకుంటున్నారు...



దేశభక్తి భావాలను డిజిటల్ ప్రపంచంలోకి తీసుకువచ్చింది యువత. ఒకప్పుడు మన దేశానికి మాత్రమే పరిమితమైన దేశాభిమాన భావాలు ఇప్పుడు ఇంటర్నెట్ పుణ్యమా అని విశ్వవ్యాప్తం అవుతున్నాయి.

ఆనాటి స్వాతంత్య్ర ఉద్యమ వీరోచిత పోరాటగాథలను సోషల్ మీడియా వేదికగా యువత గుర్తు తెచ్చుకుంటుంది. కంటెంట్ క్రియేషన్ ద్వారా కూడా తమలోని దేశభక్తి భావాలను సృజనాత్మకంగా ఆవిష్కరిస్తున్నారు.

'జెన్–జెడ్ ఆర్టిస్టులు తమలోని దేశభక్తి భావాలను పాటలు, చిత్రాల రూపంలో ఆవిష్కరిస్తున్నారు. ప్రపంచ ధోరణులను గమనిస్తూ, విశ్లేషిస్తూనే కంటెంట్ క్రియేషన్‌కు సంబంధించి దేశీయతకు ప్రాధాన్యత ఇస్తున్నారు' అంటుంది కంటెంట్ క్రియేటర్ జాహ్నవి తివారి.

బెంగళూరుకు చెందిన 23 సంవత్సరాల ప్రణవ్ స్కూల్ రోజుల్లో 'హిస్టరీ రొస్టు కంటే రెస్టు మేలు' అన్నట్లుగా ఉండేవాడు. బోర్‌గా ఫీలయ్యేవాడు. అయితే ఇప్పుడు హిస్టరీ అనేది అతడి ఫేవరెట్ సబ్జెక్ట్. హిస్టరీ పుస్తకాలను ఇష్టంగా చదువుతుంటాడు. ది డిస్కవరీ ఆఫ్ ఇండియా, ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్, ది లాస్ట్ మొఘల్, ది వండర్ దట్ వాజ్ ఇండియా...మొదలైనవి అతడి అభిమాన పుస్తకాలు.

'ఒక దేశ గొప్పదనం గురించి తెలుసుకోవాలంటే ఆ దేశచరిత్ర తెలుసుకోవాలి అనే మాట విని చరిత్ర పుస్తకాలపై ఆసక్తి పెరిగింది. బుక్‌లెట్‌లాంటి చిన్న పుస్తకాలతో మొదలు పెట్టి ఇప్పుడు వందల పేజీలు ఉన్న పెద్ద పుస్తకాలు కూడా చదువుతున్నాను' అంటున్నాడు ప్రణవ్.

'దేశాన్ని ముందుకు నడిపించే ప్రతి మంచిపని దేశభక్తిగానే పరిగణించాలి. పర్యావరణ స్పృహ నుంచి స్పోర్ట్స్ వరకు ఏదైనా కావచ్చు' అంటున్న ముంబైకి చెందిన ఇంజనీరింగ్ స్టూడెంట్ తేజస్వీ పర్యావరణ హిత, సామాజిక స్పృహకు సంబంధించిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటుంది. ఇక సినిమాలకు సంబంధించి 'యే జో దేశ్ హై తేరా, స్వదేశ్ హై తేరా' (స్వదేశ్), ఆప్నీ ఆజాదీ కో (లీడర్–1964), యే మేరా ఇండియా–ఐ లవ్ మై ఇండియా (పర్‌దేశ్)...మొదలైన పాటలను ఎక్కువగా షేర్ చేస్తుంటారు. జీ మ్యూజిక్ కంపెనీ 'సలామ్ ఇండియా' 'భారత్ సలామ్' టీ–సీరిస్ 'ఇండిపెండెన్స్ డే స్పెషల్' టిప్స్ 'ఇండిపెండెన్స్ డే సాంగ్స్' సారేగామా మ్యూజిక్ 'రిపబ్లిక్ డే స్పెషల్' నైంటీస్ గానే 'ఐ లవ్ మై ఇండియా–రిపబ్లిక్ డే సాంగ్స్' ఆల్బమ్‌లకు యూట్యూబ్‌లో యువత నుంచి మంచి ఆదరణ లభిస్తోంది.

సింగర్–సాంగ్ రైటర్ వినీత్ సింగ్ మ్యూజిక్ ఇండస్ట్రీలో రికార్డ్‌లు బ్రేక్ చేయడంలో ఘనాపాటీ. 'యుయస్ టాప్ 100 రేడియో చార్ట్స్'లో అతడి పాటలు టాప్‌లో నిలిచాయి. కొత్త దేశభక్తి గీతం 'బార్న్ ఇన్ భారత్, బార్న్ ఫర్ ఇండియా'తో ముందుకు వచ్చాడు వినీత్. డైనమిక్ వోకల్స్, ఎనర్జిటిక్ బేస్‌లైన్‌తో కూడిన ఈ పాట నవభారతాన్ని కళ్ల ముందు ఆవిష్కరిస్తుంది.

'దేశభక్తి పాటలు స్ఫూర్తిని ఇస్తాయి. దేశానికి నా వంతుగా ఏదైనా చేయాలనే సంకల్పాన్ని ఇస్తాయి' అంటున్న ఢిల్లీకి చెందిన అద్విక్ దేశభక్తి పాటలు పాడడంలో మంచి పేరు తెచ్చుకున్నాడు. 'దేశభక్తి గీతాలు కొన్ని రోజులకు మాత్రమే పరిమితమైనవి కావు. అన్ని రోజుల్లో వినాల్సిన విలువైన గీతాలు' అంటాడు 24 సంవత్సరాల అద్విక్.

స్ఫూర్తిదాయక ఏఐ శకటం



ఈ ఏడాది గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వశాఖకు సంబంధించిన ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) శకటాన్ని ప్రత్యేక ఆకర్షణగా చెప్పవచ్చు. కృత్రిమ మేధ(ఏఐ)లో మన దేశం సాధించిన పురోగతికి అద్దం పట్టేల, హెల్త్‌కేర్, లాజిస్టిక్స్, విద్య, ఎలక్ట్రానిక్స్ మ్యానుఫాక్చరింగ్‌పై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావాన్ని ప్రతిఫలించేలా ఈ శకటాన్ని తీర్చిదిద్దారు. శకటంలో ఒక మహిళా రోబోట్ కృత్రిమ మేధస్సును ప్రతిబింబించేలా ఉంటుంది. వివిధ ఎలక్ట్రానిక్ పరికరాల్లో కీలకమైన సెమీకండక్టర్ చిప్ 3డీ మోడల్‌ను శకటంలోఏర్పాటు చేశారు. వివిధ రంగాల్లో భారతదేశ అభివృద్ధిని ముందుకు తీసుకువెళ్లడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగాన్ని తెలియజేసేలా శకటానికి ఇరువైపులా ఎల్‌ఈడీ లైట్లతో అలంకరించిన సర్క్యూట్ డిజైన్ ఆకట్టుకుంటుంది. ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్స్(పీఎల్ఐ)లాంటి కార్యక్రమాల ద్వారా ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్‌లో మన దేశం సాధించిన పురోగతిని కూడా ఈ శకటం హైలెట్ చేస్తుంది. శకటం మధ్య విభాగంలో లాజిస్టిక్స్‌పై దృష్టి పెట్టారు. కలర్ కోడింగ్ ఆధారంగా పార్శిల్ గుర్తింపు, విభజనకు సాంకేతికత ఎలా సహాయపడుతుందో తెలియజేసేలా ఉంటుంది. శకటం వెనుక భాగం విద్యారంగంపై దృష్టిని మళ్లిస్తుంది. వీఆర్ హెడ్‌సెట్ ధరించి వర్చువల్ రియాలిటీ ద్వారా రిమోట్ క్లాసును నిర్వహించే ఉపాధ్యాయుడి లార్జర్ దెన్ లైఫ్ స్టాచ్యూ ఉత్తేజకరంగా ఉంటుంది. పశువుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించడంలో సెన్సర్‌ల ద్వారా ఏఐ అప్లికేషన్‌ల ఉపయోగం, నావిగేషన్‌కు సంబంధించి దృష్టి లోపం ఉన్న వ్యక్తులకు సహాయపడే విషయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహకారాన్ని ఈ ఏఐ శకటం హైలెట్ చేస్తుంది.

అవును... ఇది నిజమే!

● 'రిపబ్లిక్‌డే జనవరి 26న ఎందుకు జరుపుకుంటామో తెలుసా?'

అనే ప్రశ్నకు...'1950, జనవరి 26న రాజ్యాంగం అమల్లోకి వచ్చింది కాబట్టి' అని చెబుతాం. ఇది నిజమే అయినప్పటికీ అసలు కారణం వేరు. భారత రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26న ఆమోదించారు. అయితే రాజ్యాంగాన్ని అమలు చేసే తేదీకి ప్రాముఖ్యత ఉండాలనే ఉద్దేశంతో జనవరి 26ని ఎంపిక చేసుకున్నారు.

జనవరి 26 ప్రాముఖ్యత ఏమిటి?

1930 జనవరి 26న లాహోర్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో తొలిసారిగా సంపూర్ణ స్వరాజ్య తీర్మానం చేశారు. చారిత్రక ప్రాధాన్యత ఉన్న 'జనవరి 26'కి చిరస్థాయి కల్పించాలనే ఉద్దేశంతో 1950 జనవరి 26 నుంచి రాజ్యాంగాన్ని అమల్లోకి తెచ్చారు

● రాజ్యాంగం అసలు ప్రతిని ప్రేమ్ బిహారి నారాయణ్ రైజాదా తన అందమైన చేతి రాతతో హిందీ, ఇంగ్లీష్‌లలో రాశారు. రాయడానికి ఆరు నెలల సమయం తీసుకుంది.

● తొలి రిపబ్లిక్ పరేడ్ (1950) ఢిల్లీలోని ఇర్విన్ యాంఫీథియేటర్ (ప్రస్తుతం మేజర్ ధ్యాన్‌చంద్ స్టేడియం)లో జరిగింది.

● రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్న తొలి విదేశీ సైనిక బృందం...ఫ్రెంచ్ ఆర్మీ సైనికులు (2016).

● ఫస్ట్ రిపబ్లిక్ డే పరేడ్‌కు హాజరైన ఫస్ట్ చీఫ్ గెస్ట్ ఇండోనేషియా ప్రెసిడెంట్ సుకర్ణో.



● టెక్.. టాక్

ఒప్పో ప్యాడ్ నియో




సైజ్: 11.4 అంగుళాలు
రిజల్యూషన్: 2408X1720
రిఫ్రెష్ రేట్: 90 హెచ్‌జడ్
బ్యాటరీ: 8000 ఎంఏహెచ్
బరువు: 538 గ్రా.
ఓఎస్: ఆండ్రాయిడ్ 13
కలర్: గ్రే

రెడ్‌మీ నోట్ 13 ప్రో 4జీ



డిస్‌ప్లే: 6.67 అంగుళాలు
రిజల్యూషన్: 1080X2400 పిక్సెల్స్
మెమరీ: 256జీబి 8జీబి ర్యామ్/ 512జీబి 12జీబి ర్యామ్
వోఎస్: ఆండ్రాయిడ్ 13
బ్యాటరీ: 5000 ఎంఏహెచ్
ఫ్రంట్ కెమెరా: 16 ఎంపీ

కారైకుడిలో మిస్టర్ బచ్చన్


● రవితేజ

కారైకుడికి వెళ్లారు 'మిస్టర్ బచ్చన్'. రవితేజ టైటిల్ రోల్ చేస్తున్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్ తో సునా హోగా' అనేది ఈ సినిమా ఉపశీర్షిక. ఈ సినిమాకు హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంతో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా తెలుగు ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నారు. పనోరమా స్టూడియోస్, టీ–సిరీస్ సమర్పణలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలైంది. కాగా 'మిస్టర్ బచ్చన్' సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ తమిళనాడులోని కారైకుడిలో ప్రారంభమైంది. రవితేజతో పాటు ప్రధాన తారాగణం పాల్గొంటున్న ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల సహ–నిర్మాతగా ఉన్న ఈ సినిమాకు మిక్కీ జే మేయర్ స్వరకర్త.

ఇస్మార్ట్ మ్యూజిక్


● రామ్

'డబుల్ ఇస్మార్ట్' మ్యూజిక్ సిట్టింగ్స్ జోరందుకున్నాయి. 'ఇస్మార్ట్ శంకర్' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో రామ్, దర్శకుడు పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. 'ఇస్మార్ట్ శంకర్' సినిమాకు సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' సినిమా తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో సంజయ్ దత్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. కాగా ఈ సినిమా మ్యూజిక్ సిట్టింగ్స్ మొదలయ్యాయి. ఈ విషయాన్ని 'ఎక్స్'లో షేర్ చేసి, 'డబుల్ ఇస్మార్ట్' అప్‌డేట్‌ను వెల్లడించింది చిత్రబృందం. 'ఇస్మార్ట్ శంకర్'కు సంగీతం అందించిన మణిశర్మనే సీక్వెల్‌కూ సంగీతం అందిస్తున్నారు. గతంలోనూ పూరి–మణిశర్మ కాంబినేషన్‌లో 'పోకిరి' వంటి బ్లాక్ బస్టర్ ఆల్బమ్ వచ్చిన సంగతి తెలిసిందే. అలాగే ఈ సినిమా క్లైమాక్స్ పోర్షన్స్ చిత్రీకరణ కోసం దాదాపు 7 కోట్ల రూపాయలు కేటాయించినట్లుగా సమాచారం. పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ నిర్మిస్తున్న 'డబుల్ ఇస్మార్ట్' సినిమాను మార్చి 18న విడుదల చేస్తున్నట్లుగా చిత్ర యూనిట్ గతంలో ప్రకటించింది. అయితే ఈ సినిమా విడుదల వాయిదా పడే అవకాశాలు ఉన్నాయన్నది ఫిల్మ్‌నగర్ తాజా కబురు.


● నాగార్జున, విజయ్ బిన్నీ, 'అల్లరి' నరేశ్, శ్రీనివాసా చిట్టూరి

అలా సినిమాలు తీయడం సులభం కాదు - నాగార్జున

''నేను దాదాపు 95మందికి పైగా దర్శకులతో పని చేశాను. చక్కని క్లారిటీతో సినిమాలు చేసే కొద్దిమంది దర్శకుల్లో విజయ్ ఒకరు అని నాకనిపించింది. 'నా సామిరంగ' మూవీని ఓ పాటలా అందంగా తీసి, కొరియోగ్రాఫర్ అనిపించుకున్నాడు. సినిమాకి ఎంత కావాలో సరిగ్గా అంతే తీశాడు. ఇలా తీయడం అంత సులభం కాదు'' అని నాగార్జున అన్నారు. ఆయన హీరోగా, 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్, ఆషికా రంగనాథ్, మిర్నా మీనన్, రుక్సార్ ధిల్లాన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'నా సామిరంగ'. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమయ్యారు. శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదలైంది. 'నా సామిరంగ' సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోందని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా తెలుగు ఫిల్మ్ – టీవీ డ్యాన్సర్స్ – డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్లు కలిసి విజయ్ బిన్నీని సన్మానించాయి. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన నాగార్జున మాట్లాడుతూ– ''ఈ వేడుకకు రావడాన్ని ఓ గౌరవంగా భావిస్తున్నాను. మీ అందరి చిరునవ్వులు చూస్తుంటే మనసు ఆనందంతో పొంగిపోయింది. విజయ్‌తో వండర్‌ఫుల్ వర్కింగ్ ఎక్స్‌పీరియన్స్'' అన్నారు. మరో అతిథి 'అల్లరి' నరేశ్ మాట్లాడుతూ– ''దర్శకుడిని కావాలనుకున్న తన కలను సక్సెస్‌ఫుల్‌గా నెరవేర్చుకున్నారు విజయ్. ఇక్కడున్న డ్యాన్స్ మాస్టర్స్‌కి ఆల్ ది బెస్ట్'' అన్నారు. ''నాగార్జునగారు నన్ను దర్శకుడిగా ఎంచుకోవడం నా అదృష్టం'' అన్నారు విజయ్ బిన్నీ. ''విజయ్ గారు డైరెక్టర్‌గా గొప్ప విజయాన్ని అందుకోవడం మా అందరికీ గర్వకారణం'' అన్నారు శేఖర్ మాస్టర్.

ఇళయరాజా కుమార్తె, సంగీత దర్శకురాలు భవతారణి కన్నుమూత



ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఇళయరాజా ఇంట్లో విషాదం చోటు చేసుకుంది. ఆయన కుమార్తె, గాయని భవతారణి రాజా (47) కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ గురువారం రాత్రి శ్రీలంకలో కన్నుమూశారు. నేడు ఆమె భౌతికకాయాన్ని చెన్నైకు తీసుకురానున్నారు. శుక్రవారమే అంత్యక్రియలు జరుగుతాయని తెలిసింది. ఇళయరాజాకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వీరిలో కార్తీక్ రాజా, యువన్ శంకర్ రాజా సంగీత దర్శకులు. కుమార్తె భవతారణి సంగీత దర్శకురాలిగా, గాయనిగా రాణిస్తున్నారు.

మలయాళ త్రీడీ 'మై డియర్ కుట్టి చాత్తాన్' (1984) గాయనిగా భవతారణికి తొలి చిత్రం. ప్రభుదేవా హీరోగా నటించిన 'రాసయ్య' (1995) చిత్రం ద్వారా గాయనిగా కోలీవుడ్‌కి పరిచయమయ్యారు భవతారణి. అదే విధంగా 'భారతి' (2000) చిత్రంలోని 'మైలు పోల పొన్ను..' అనే పాటకు గాను జాతీయ ఉత్తమ గాయనిగా కేంద్ర ప్రభుత్వ అవార్డును అందుకున్నారామె. తెలుగులోనూ పలు పాటలు పాడారు. తండ్రి, సోదరుల సంగీత దర్శకత్వంలో అనేక పాటలను పాడారు భవతారణి. దాదాపు పాతిక చిత్రాల్లో పాటలు పాడారు.

తెలుగు, తమిళ ద్విభాషా చిత్రం 'గుండెల్లో గోదారి' సినిమాలో 'నన్ను నీతో..' పాటను పాడారామె. మెలోడీ పాటలతో సంగీత అభిమానుల హృదయాలలో చోటు దక్కించుకున్నారు. 2002లో నటి రేవతి దర్శకురాలిగా తెరకెక్కించిన తొలి చిత్రం 'మిత్ర్: మై ఫ్రెండ్'తో సంగీత దర్శకురాలిగా మారారు భవతారణి. సల్మాన్ ఖాన్, అభిషేక్ బచ్చన్, శిల్పాశెట్టి ముఖ్య తారలుగా వచ్చిన హిందీ చిత్రం 'ఫిర్ మిలేంగే' (2004) సినిమాకు ఓ సంగీత దర్శకురాలిగా చేశారు. హిందీలో ఆమెకు ఇది తొలి చిత్రం. తెలుగులో 'అవునా'(2003), కన్నడలో 'గియా గియా' (2005) సినిమాలకు సంగీతం అందించారు భవతారణి. దాదాపు పది చిత్రాలకు సంగీత దర్శకురాలిగా చేశారు. అడ్వర్టైజింగ్ ఎగ్జిక్యూటివ్ ఆర్. శబరిరాజ్‌తో భవతారణి వివాహం జరిగింది. వీరికి సంతానం లేరు.

భవతారిణి మృతి పట్ల పలువురు చిత్రరంగ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

మాటలు హత్తుకునేలా ఉన్నాయి - 'దిల్' రాజు


● మోక్ష, 'దిల్' రాజు, కృష్ణవంశీ

''అలనాటి రామచంద్రుడు' చిత్ర దర్శకుడు, నిర్మాత.. ఇలా అందరూ కొత్తవారే. ఈ రోజుల్లో సినిమా తీయడం కంటే దాన్ని థియేటర్లోకి తీసుకెళ్లడం గొప్ప విషయం. ఇకపై ఈ యూనిట్ అంతా చాలా కష్టపడాలి.. సినిమాని ప్రేక్షకుల వద్దకు తీసుకెళ్లాలి'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. కృష్ణవంశీ, మోక్ష జంటగా చిలుకూరి ఆకాష్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'అలనాటి రామచంద్రుడు'. హైమావతి, శ్రీరామ్ జడపోలు నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ని 'దిల్' రాజు విడుదల చేసి, మాట్లాడుతూ–''అలనాటి రామచంద్రుడు' టైటిల్ బాగుంది. మాటలు మనసుని హత్తుకునేలా ఉన్నాయి. ఈ మూవీని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు. ''సరికొత్త ప్రేమకథా చిత్రమిది. చక్కని వినోదం ఉంటుంది'' అన్నారు చిలుకూరి ఆకాష్ రెడ్డి. ''మంచి కంటెంట్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం. మా సినిమా ప్రేక్షకులని అలరిస్తుంది'' అన్నారు శ్రీరామ్ జడపోలు. ''అలనాటి రామచంద్రుడు' వంటి మంచి సినిమాలో అవకాశం ఇచ్చిన దర్శక–నిర్మాతలకు కృతజ్ఞతలు అన్నారు కృష్ణవంశీ, మోక్ష.

సినిమానే మాట్లాడుతుంది


● రవి కస్తూరి

గీతానంద్, నేహా సోలంకి జంటగా దయానంద్ దర్శకత్వంలో రవి కస్తూరి నిర్మించిన చిత్రం 'గేమ్ ఆన్'. ఈ చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం రవి కస్తూరి విలేకరులతో మాట్లాడుతూ– ''ఆస్ట్రేలియాలో నాకు వ్యాపారాలున్నాయి. నిర్మాతగా నాకు ఇది తొలి చిత్రం. గీతానంద్ హీరోగా, నేను నిర్మాతగా సినిమాలు చేయాలనుకున్నాం. కథ సెట్ కావడంతో 'గేమ్ ఆన్' స్టార్ట్ చేశాం. ఇదొక సైకలాజికల్ థ్రిల్లర్ మూవీ. జీవితాన్ని చాలించాలనుకునే ఓ వ్యక్తి దాన్ని ఎలా అధిగమించాడు? అనేది గేమ్ థీమ్‌లో చూపించాం. ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చే సినిమా కూడా. ఓ సినిమాకు మనం ఎంత పబ్లిసిటీ చేసినా మార్నింగ్ షోకు ఆడియన్స్ వెళ్లేంతవరకే. ఆ తర్వాత సినిమానే మాట్లాడుతుంది'' అని చెప్పుకొచ్చారు.

రత్నం రెడీ


● విశాల్

వేసవిలో థియేటర్స్‌కు వస్తున్నాడు 'రత్నం'. విశాల్ హీరోగా నటించిన తాజా యాక్షన్ ఫిల్మ్ 'రత్నం'. ఈ చిత్రంలో ప్రియాభవానీ శంకర్ హీరోయిన్‌గా నటించారు. హరి దర్శకత్వంలో కార్తికేయన్ సంతానం ఈ సినిమాను నిర్మించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. కాగా ఈ సినిమాను వేసవిలో ఏప్రిల్ 26న విడుదల చేయనున్నట్లుగా చిత్రయూనిట్ వెల్లడించింది. ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. ఈ సంగతి ఇలా ఉంచితే.. 'తుప్పరివాలన్' (తెలుగులో 'డిటెక్టివ్')కి సీక్వెల్‌గా 'తుప్పరివాలన్ 2' చేస్తున్నారు విశాల్. ఈ మూవీలో హీరోగా నటించడంతో పాటు దర్శకత్వం వహించనున్నారట విశాల్. ఈ ఏడాదే చిత్రీకరణ ప్రారంభించాలనుకుంటున్నారని సమాచారం.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▼	నిఫ్టీ ▼
360	102
70,701	21,353

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	15,571	▲	87
డోజోన్స్	37,874	▲	67
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,535	▲	8
డాక్స్	16,904	▲	14
షాంఘై	2,906	▲	85
నికాయ్	36,236	▲	10

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,312	▼	279
బంగారం (99.5 స్వచ్ఛత)	62,062	▼	278
వెండి (కిలో)	71,299	▼	227

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.73	83.75
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.63	107.21
€	యూరో	ఎస్‌బీఐ	89.49	94.85
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.58	56.84
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.92	55.85
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.19	62.63
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.21	22.83
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.73	23.53
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.47	12.54

కుమారులకు 'ప్రేమ్'జీ కానుక

కోటి విప్రో షేర్లు బదిలీ



న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం విప్రో లిమిటెడ్ వ్యవస్థాపకుడు అజీమ్ ప్రేమ్‌జీ తన కుమారులకు కంపెనీ ఈక్విటీలో 0.2 శాతం వాటాను కానుకగా ఇచ్చారు. 1.02 కోట్ల ఈక్విటీ షేర్లను రిషద్ ప్రేమ్‌జీ, తారిఖ్ ప్రేమ్‌జీ పేరున బదిలీ చేశారు. విప్రో షేరు ప్రస్తుత మార్కెట్ ధర రూ. 470 ప్రకారం వీటి విలువ దాదాపు రూ. 480 కోట్లు. ప్రస్తుతం రిషద్ ప్రేమ్‌జీ.. విప్రో ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. 'నా వద్దగల 1,02,30,180 విప్రో షేర్లను రిషద్, తారిఖ్‌లకు కానుకగా బదిలీ చేస్తున్నాను' అంటూ అజీమ్ హెచ్ ప్రేమ్‌జీ తెలియజేసినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు విప్రో తాజాగా సమాచారమిచ్చింది. ఇది కంపెనీ ఈక్విటీలో 0.2 శాతం వాటాకాగా.. దీంతో ప్రమోటర్, ప్రమోటర్ గ్రూప్ వాటాలలో ఎలాంటి మార్పులూ చోటుచేసుకోబోవని విప్రో వివరించింది.

హిండెన్‌బర్గ్ ఉదంతానికి ఏడాది

పటిష్టంగా ఎదిగాం..

- రూ. 40 వేల కోట్లు సమీకరించాం; రుణభారం తగ్గించుకున్నాం
- పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు ప్రారంభించాం
- అదానీ గ్రూప్ చీఫ్ గౌతమ్ అదానీ



న్యూఢిల్లీ: హిండెన్‌బర్గ్ ఉదంతంతో గత ఏడాది కాలంగా ఎదురైన పరీక్షలు, సవాళ్లు తమ గ్రూప్‌ను మరింత బలోపేతం చేశాయని అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ తెలిపారు. అన్నింటినీ తట్టుకుని వృద్ధి బాటలో ముందుకు సాగామని, ధారావి సహా పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను ప్రారంభించామని ఆయన వివరించారు. అదానీ గ్రూప్ కంపెనీల్లో, షేర్లలో అవకతవకలు జరుగుతున్నాయన్న అమెరికన్ షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ నివేదిక .. గతేడాది అదానీ సంస్థలను కుదిపేసిన సంగతి తెలిసిందే. ఈ ఉదంతం చోటు చేసుకుని ఏడాది అయిన సందర్భంగా రాసిన కాలమ్‌లో గౌతమ్ అదానీ ఈ విషయాలు తెలిపారు. గత ఏడాది వ్యవధిలో అదానీ గ్రూప్ కొన్ని సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా వచ్చే రెండేళ్ల పాటు రుణాల చెల్లింపునకు సరిపోయేంత స్థాయిలో ఏకంగా రూ. 40,000 కోట్లు సమీకరించిందని ఆయన వివరించారు. అలాగే, మార్జిన్ ఆధారిత ఫైనాన్సింగ్‌కి సంబంధించి రూ. 17,500 కోట్లు తిరిగి చెల్లించేశామని, రుణభారాన్ని తగ్గించుకున్నామని, తమ అసెట్ బేస్ రూ. 4.5 లక్షల కోట్లకు చేరిందని చెప్పారు. కార్యకలాపాలపై మరింతగా దృష్టి పెట్టడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో క్వార్టర్‌లో అత్యధిక స్థాయి త్రైమాసిక లాభాలను ఆర్జించామన్నారు. గ్రూప్‌లో భాగమైన లిస్టెడ్ సంస్థల్లో చాలా మటుకు కంపెనీలు, హిండెన్‌బర్గ్ వివాదంతో వాటిల్లిన నష్టాలను భర్తీ చేసుకోగలిగాయని అదానీ పేర్కొన్నారు. తాము మోసానికి, స్టాక్ మార్కెట్లో అవకతవకలకు పాల్పడ్డామన్న హిండెన్‌బర్గ్ నివేదిక అబద్ధాలపుట్ట అని ఆయన ఆక్షేపించారు. తమ ప్రత్యర్థులు ఎప్పటివో పాతబడిన ఆరోపణలకు మళ్లీ తెరపైకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారన్నారు. ''చచ్చు ఆరోపణలు, బహిరంగంగా అందుబాటులో ఉన్న సమాచారం నుంచి సేకరించిన అర్థ సత్యాలను ఎంపిక చేసుకుని (హిండెన్‌బర్గ్) అబద్ధాల పుట్టను 'పరిశోధన నివేదిక'గా వండి వడ్డించింది. మా స్పందనను తెలియజేశాక నేను దాని గురించి ఇక పట్టించుకోలేదు. కానీ (ఆ తర్వాత పరిణామాలతో) సత్యం చెప్పుల్లో కాళ్లు పెట్టే లోపలే అబద్ధం లోకాన్ని చుట్టి వస్తుందనే విలువైన పాఠాన్ని ఈ ఉదంతంతో తెలుసుకున్నాను. మాపై ఆర్థికంగాను, రాజకీయ కోణంలోనూ దాడి జరిగింది. మా వ్యాపార పటిష్టతపై మాకు ఉన్న విశ్వాసమే వ్యూహంగా వాటిని ఎదుర్కొన్నాం'' అని అదానీ పేర్కొన్నారు.

చిన్న ఇన్వెస్టర్లు నష్టపోవడం బాధించింది..


''సాధారణంగా క్యాపిటల్ మార్కెట్లు హేతుబద్ధంగా కన్నా ఎక్కువగా భావోద్వేగాలతో పని చేస్తాయి. మాపై వచ్చిన తీవ్ర స్థాయి అబద్ధాలు మార్కెట్ క్యాప్‌ను గణనీయంగా హరించేశాయి. అన్నింటి కన్నా ఎక్కువగా వేల మంది చిన్న ఇన్వెస్టర్లు తాము దాచుకున్న సొమ్మును పోగొట్టుకోవడం నన్ను ఎంతో బాధించింది. విరోధుల ప్రణాళికలు పూర్తిగా విజయవంతమై ఉంటే దాని ప్రభావం.. పోర్టులు, విమానాశ్రయాలు, విద్యుత్ సరఫరా వ్యవస్థ వరకు ఎన్నో కీలక మౌలికసదుపాయాలను దెబ్బతీసేది. ఏ దేశానికైనా ఇది పెను విపత్తే'' అని అదానీ తెలిపారు. గతేడాది ప్రారంభంలో ప్రపంచంలోనే 2వ అత్యంత సంపన్నుడిగా వెలిగిన అదానీ.. హిండెన్‌బర్గ్ నివేదిక పరిణామాలతో ఒక దశలో టాప్ 20 జాబితాలో కూడా చోటు కోల్పోయారు. ప్రస్తుతం 14వ స్థానంలో ఉన్నారు.

ఇన్వెస్టర్లు షం'షేర్'..!

గతేడాది భారీగా నమోదు

దేశవ్యాప్తంగా ప్రజలు ఉత్సాహంగా ఈక్విటీ పెట్టుబడుల వైపు అడుగులు వేస్తున్నారు. మార్కెట్ల ర్యాలీ కూడా వారిని ఆకర్షిస్తోంది. ఇందుకు నిదర్శనంగా ఎన్‌ఎస్‌ఈలో రిజిస్టర్డ్ ఇన్వెస్టర్ల సంఖ్య 2023లో 27 శాతం పెరిగి 3.3 కోట్లకు చేరింది. ముఖ్యంగా బిహార్‌లో 42 శాతం, యూపీలో 41 శాతం మేర కొత్త ఇన్వెస్టర్లలో వృద్ధి కనిపించింది. గతేడాది సెన్సెక్స్ 19 శాతం, నిఫ్టీ 50 సూచీలు 20 శాతం మేర ర్యాలీ చేశాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఇంతకంటే అధిక రాబడిని ఇచ్చాయి. విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాల ఒత్తిడిని సర్దుబాటు చేసుకునే స్థాయిలో దేశీ పెట్టుబడులు పెరుగుతుండడం గమనార్హం. ఆధార్, పాన్‌తో సులభంగా కొత్త ఖాతాల ప్రారంభం, మొబైల్ నుంచే లావాదేవీలకు వీలుగా ట్రేడింగ్ అప్లికేషన్లు, యూపీఐ తదితర సాధనాలతో సులభ చెల్లింపులు ఈ జోరుకు మద్దతునిస్తున్నాయి. గతేడాది డీమ్యాట్ ఖాతాలు సైతం 43 శాతం పెరిగి 11.45 కోట్లకు చేరాయి. అయినా ఇప్పటికే దేశ జనాభా 140 కోట్లలో ఆర్థిక సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తున్న వారు కేవలం 8 శాతంగానే ఉండడాన్ని గమనించాలి.

ఏపీ నుంచి 61.8లక్షల మంది, తెలంగాణ నుంచి 47.1 లక్షల మంది ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తున్నారు.



ఐటీ, ఫైనాన్స్ షేర్లలో అమ్మకాలు

- 21,400 స్థాయి దిగువకు నిఫ్టీ
- సెన్సెక్స్‌కు 360 పాయింట్ల నష్టం
- గణతంత్ర దినోత్సవం సందర్భంగా నేడు మార్కెట్లకు సెలవు



మార్కెట్లు సెలవు

గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈ ఎక్స్ఛేంజీలు పనిచేయవు. కమోడిటీ, ఫారెక్స్ మార్కెట్లు కూడా పనిచేయవు.

ముంబై: ఫైనాన్స్, ఐటీ, ఫార్మా, ఎఫ్‌ఎంసీజీ షేర్లలో విక్రయాలు వెల్లువెత్తడంతో స్టాక్ సూచీలు గురువారం అరశాతం నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా సెన్సెక్స్ 360 పాయింట్లు నష్టపోయి 70,701 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 102 పాయింట్లు పతనమై 21,353 వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని బలహీన సంకేతాల ప్రభావంతో సూచీలు ఉదయం స్తబ్దుగా మొదలయ్యాయి. జనవరి ఎఫ్‌అండ్‌ఓ కాంట్రాక్టు ముగింపు సందర్భంగా ట్రేడర్లు అప్రమత్తత వహిస్తూ అమ్మకాలు పాల్పడ్డారు. ఒక దశలో సెన్సెక్స్ 741 పాయింట్లు క్షీణించి 70,319 వద్ద, నిఫ్టీ 207 పాయింట్లు పతనమై 21,247 వద్ద ఇంట్రాడే కనిష్టాలను తాకాయి. అయితే ట్రేడింగ్ చివర్లో మెటల్, సర్వీసెస్, పవర్, వినిమయ ఆటో, మీడియా షేర్లకు అనూహ్యంగా కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు సగానికిపైగా నష్టాలు భర్తీ చేసుకున్నాయి. అమెరికా పటిష్ఠ ఆర్థిక డేటా వెల్లడితో యూఎస్ ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల తగ్గింపు వాయిదా ఆందోళనలు మరోసారి తెరపైకి వచ్చాయి. దీంతో అంతర్జాతీయ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు...

- డిసెంబర్ క్వార్టర్‌లో నికర లాభం 60% క్షీణించడంతో టెక్ మహీంద్రా షేరు 6% నష్టపోయి రూ.1,322 వద్ద స్థిరపడింది.
- ఆకర్షణీయమైన ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో బజాజ్ ఆటో షేరు పరుగులు పెట్టింది. 5% పెరిగి రూ.7,597 వద్ద స్థిరపడింది.
- టెక్ మహీంద్ర పతన ప్రభావంతో. కోఫోర్జ్ 3%, హెచ్‌సీఎల్ టెక్, విప్రో, టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లు 1 నుంచి అరశాతం నష్టపోయాయి.

వేదాంతా క్యూ3 లాభం క్షీణత

రూ. 2,013 కోట్లకు పరిమితం



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ మైనింగ్ దిగ్గజం వేదాంతా లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 18 శాతం క్షీణించి రూ. 2,013 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2022-23) ఇదే కాలంలో రూ. 2,464 కోట్లు ఆర్జించింది. ఫైనాన్స్, ముడి సరుకుల వ్యయాలు పెరగడం, అమ్మకాలు నీరసించడం ప్రభావం చూపాయి. అయితే మొత్తం ఆదాయం రూ. 34,818 కోట్ల నుంచి రూ. 36,320 కోట్లకు ఎగసింది. ఫైనాన్స్ వ్యయాలు 54 శాతం పెరిగి రూ. 2,417 కోట్లను తాకాయి. కాగా.. త్రైమాసికవారీగా ఈ క్యూ3 అత్యుత్తమమని కంపెనీ సీఎఫ్‌వో అజయ్ గోయెల్ పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో వేదాంతా షేరు 0.4 శాతం బలపడి రూ. 264 వద్ద ముగిసింది.

పీఎన్‌బీ లాభం రూ. 2,223 కోట్లు



ముంబై: ప్రభుత్వ రంగ దిగ్గజం పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) మూడో త్రైమాసికంలో పటిష్ఠ ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్ (క్యూ3)లో నికర లాభం మూడు రెట్లు పైగా దూసుకెళ్లి రూ.2,223 కోట్లను తాకింది. గత 15 క్వార్టర్లలో ఇది అత్యధికం కాగా.. ఇందుకు అధిక వడ్డీ ఆదాయం, మెరుగుపడిన రుణ నాణ్యత సహకరించాయి. గతేడాది (2022-23) ఇదే కాలంలో కేవలం రూ. 629 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 25,722 కోట్ల నుంచి రూ. 29,962 కోట్లకు జంప్ చేసింది. నికర వడ్డీ ఆదాయం 12 శాతం ఎగసి రూ. 10,293 కోట్లకు చేరింది. స్థూల మొండిబకాయిలు (ఎన్‌పీఏలు) 9.76 శాతం నుంచి 6.24 శాతానికి, నికర ఎన్‌పీఏలు సైతం 3.3 శాతం నుంచి 0.96 శాతానికి భారీగా దిగివచ్చాయి. నికర వడ్డీ మార్జిన్లు 3 శాతం నుంచి 3.11 శాతానికి మెరుగయ్యాయి.

ఫలితాల నేపథ్యంలో పీఎన్‌బీ షేరు బీఎస్‌ఈలో 2.5 శాతం బలపడి రూ. 105 వద్ద ముగిసింది.



క్వార్టర్ ఫైనల్లో భారత్

మహిళల హాకీ ఫైవ్స్ ప్రపంచకప్ టోర్నీలో భారత జట్టు క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. మస్కట్‌లో నమీబియాతో జరిగిన గ్రూప్ 'సి' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 7-2తో గెలిచింది. . నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో న్యూజిలాండ్‌తో భారత్ తలపడుతుంది. ఈ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి రజని భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తోంది.



కిరణ్ జార్జి సంచలనం

ఇండోనేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత ప్లేయర్, ప్రపంచ 36వ ర్యాంకర్ కిరణ్ జార్జి ప్రిక్వార్టర్ ఫైనల్లో 21-11, 13-21, 21-18తో ప్రపంచ 18వ ర్యాంకర్ లు గ్వాంగ్ జు (చైనా)ను బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్‌కు చేరాడు. భారత్‌కే చెందిన లక్ష్య సేన్, ప్రియాన్షు ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిపోయారు.

భారత్ 'స్పిన్ బాల్'... ఆపై జైస్వాల్...

- తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 246 ఆలౌట్
- ఆదుకున్న బెన్ స్టోక్స్
- భారత్ 119/1
- యశస్వి జైస్వాల్ అర్ధసెంచరీ

'బజ్‌బాల్'... దూకుడైన ఆటకు మారు పేరు అంటూ ఇంగ్లండ్ జట్టు గత కొంత కాలంగా ప్రచారం చేసింది. అయితే భారత్‌లో ఇది సాధ్యమా అనే సందేహాలు వినిపించాయి. ఇంగ్లండ్ ఆశించినట్లుగా ఆ ధాటి పని చేసింది... అయితే అది తొలి ఎనిమిది ఓవర్ల వరకే... ఆ తర్వాత భారత 'స్పిన్ బాల్' దెబ్బకు లెక్క మారిపోయింది... వరుసగా వికెట్లు కోల్పోయిన ఇంగ్లండ్ చివర్లో స్టోక్స్ ఆదుకోవడంతో కాస్త కోలుకుంది. అక్కడక్కడ ఇంగ్లండ్ కాస్త మెరుగైన స్థితిలోనే నిలిచినా చివరకు సాధారణ స్కోరుకే పరిమితమైంది. ఆపై మన గడ్డపై 'బజ్‌బాల్' ఎలా ఆడాలో భారత ఓపెనర్లు చూపించారు. యశస్వి ధాటికి ఆరంభంలో స్కోరు ఆరుకు పైగా రన్‌రేట్‌తో సాగింది. తొలి రోజే ప్రత్యర్థి స్కోరులో దాదాపు సగం స్కోరును జట్టు అందుకుంది... మొత్తంగా అన్ని విధాలా మొదటి రోజు మనదిగా ముగిసింది.


స్టోక్స్ క్లీన్‌బౌల్డ్


అక్షర్, జడేజా, అశ్విన్, బుమ్రా

సాక్షి, హైదరాబాద్: ఇంగ్లండ్‌తో గురువారం ప్రారంభమైన తొలి టెస్టులో భారత్ మొదటి రోజు పైచేయిని ప్రదర్శించింది. టాస్ ఓడిపోవడం మినహా దాదాపు మిగతా రోజంతా టీమిండియాకే అనుకూలంగా సాగింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 64.3 ఓవర్లలో 246 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ బెన్ స్టోక్స్ (88 బంతుల్లో 70; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధసెంచరీ సాధించగా... బెయిర్‌స్టో (58 బంతుల్లో 37; 5 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. స్పిన్నర్లు అశ్విన్, జడేజా చెరో 3 వికెట్లు పడగొట్టగా...అక్షర్ పటేల్ ఖాతాలో 2 వికెట్లు చేరాయి. పేసర్ బుమ్రాకు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం ఆట ముగిసే సమయానికి భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 23 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 119 పరుగులు సాధించింది. యశస్వి జైస్వాల్ (70 బంతుల్లో 76 బ్యాటింగ్; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడగా... రోహిత్ శర్మ (27 బంతుల్లో 24; 3 ఫోర్లు) రాణించాడు. ప్రస్తుతం భారత్ మరో 127 పరుగులు వెనుకబడి ఉండగా... క్రీజ్‌లో యశస్వితో పాటు గిల్ (43 బంతుల్లో 14 బ్యాటింగ్; 1 ఫోర్) ఉన్నాడు. నేడు రెండో రోజూ పూర్తిగా బ్యాటింగ్ చేసి టీమిండియా భారీ స్కోరు సాధిస్తే మ్యాచ్ చేతుల్లోకి వచ్చినట్లే.

ఓపెనర్ల శుభారంభం...



బుమ్రా, సిరాజ్ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ క్రాలీ (40 బంతుల్లో 20; 3 ఫోర్లు), డకెట్ (39 బంతుల్లో 35; 7 ఫోర్లు) వేగంగా పరుగులు రాబట్టారు. 8 ఓవర్లలో వీరు 41 పరుగులు జత చేశారు. తర్వాతి ఓవర్ జడేజా మెయిడిన్‌గా వేయడంతో దూకుడుకు అడ్డుకట్ట పడింది. అశ్విన్, జడేజా చెలరేగడంతో 5 పరుగుల వ్యవధిలో 3 వికెట్లు కోల్పోయి ఇంగ్లండ్ కష్టాల్లో పడింది. ఈ దశలో రూట్ (60 బంతుల్లో 29; 1 ఫోర్), బెయిర్‌స్టో కలిసి 61 పరుగుల భాగస్వామ్యంతో జట్టును ఆదుకున్నారు. అయితే 4 పరుగుల వ్యవధిలో వీరిద్దరు వెనుదిరిగారు. అక్షర్ అద్భుత బంతితో బెయిర్‌స్టోను బౌల్డ్ చేయగా, రూట్ స్వయంకృతంతో వెనుదిరిగాడు. 137/6తో ఇన్నింగ్స్ ముగిసేందుకు ఇంగ్లండ్ చేరువైంది. అయితే స్టోక్స్ తన విలువను చూపించాడు. ఈ స్థితిలో స్టోక్స్ స్కోరు 8 పరుగులు మాత్రమే. కానీ టెయిలెండర్ల సహాయంతో అతను చెలరేగిపోయాడు. జట్టు సాధించిన తర్వాతి 109 పరుగుల్లో 62 అతని బ్యాట్ నుంచే రాగా... హార్లీ (24 బంతుల్లో 23; 2 ఫోర్లు, 1 సిక్స్) తన కెప్టెన్‌కు అండగా నిలిచాడు. జడేజా ఓవర్లో స్టోక్స్ వరుస బంతుల్లో కొట్టిన రెండు సిక్సర్లు, అతని ఓవర్లోనే బాదిన మూడు ఫోర్లు హైలైట్‌గా నిలిచాయి. చివరకు చక్కటి బంతితో స్టోక్స్ ఆటను బుమ్రా కట్టించాడు. తొలి రెండు సెషన్లలో వందకు పైగా పరుగులు సాధించి ఇంగ్లండ్ మెరుగ్గానే ఆడినా... చివరకు వచ్చేసరికి ఆ జట్టు ఆశించిన భారీ స్కోరు మాత్రం సాధ్యం కాలేదు.

మెరుపు ఆరంభం...

వుడ్స్ వేసిన ఇన్నింగ్స్ తొలి బంతినే ఫోర్‌తో మొదలు పెట్టిన యశస్వి, అరంగేట్ర బౌలర్ హార్లీ తొలి టెస్టు బంతిని సిక్సర్ బాది స్వాగతం పలికాడు. మరోవైపు రోహిత్ అండగా నిలవడంతో 6.3 ఓవర్లలోనే టీమిండియా స్కోరు 50 పరుగులకు చేరింది. అనంతరం 47 బంతుల్లోనే యశస్వి అర్ధ సెంచరీ పూర్తయింది. అయితే జట్టుకు అంతా అనుకూలంగా ఉండి టెస్టులో ఇంకా ఎంతో సమయం మిగిలి ఉన్నా... అనవసరంగా అత్యుత్సాహానికి పోయి చెత్త షాట్ ఆడిన రోహిత్ వికెట్ పారేసుకున్నాడు. అనంతరం గిల్ బాగా జాగ్రత్త ప్రదర్శించడంతో వేగం తగ్గింది. అయినా చివరకు 5.17 రన్‌రేట్‌తో భారత్ రోజును ముగించింది.

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలీ (సి) సిరాజ్ (బి) అశ్విన్ 20; డకెట్ (ఎల్బీ) (బి) అశ్విన్ 35; పోప్ (సి) రోహిత్ (బి) జడేజా 1; రూట్ (సి) బుమ్రా (బి) జడేజా 29; బెయిర్‌స్టో (బి) అక్షర్ 37; స్టోక్స్ (బి) బుమ్రా 70; ఫోక్స్ (సి) భరత్ (బి) అక్షర్ 4; రేహాన్ (సి) భరత్ (బి) బుమ్రా 13; హార్లీ (బి) జడేజా 23; వుడ్ (బి) అశ్విన్ 11; లీచ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (64.3 ఓవర్లలో ఆలౌట్) 246. వికెట్ల పతనం:** 1-55, 2-58, 3-60, 4-121, 5-125, 6-137, 7-155, 8-193, 9-234, 10-246. **బౌలింగ్:** బుమ్రా 8.3-1-28-2, సిరాజ్ 4-0-28-0, జడేజా 18-4-88-3, అశ్విన్ 21-1-68-3, అక్షర్ 13-1-33-2. **భారత్ తొలి ఇన్నింగ్స్:** యశస్వి (బ్యాటింగ్) 76; రోహిత్ (సి) స్టోక్స్ (బి) లీచ్ 24; గిల్ (బ్యాటింగ్) 14; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (23 ఓవర్లలో వికెట్ నష్టానికి) 119. వికెట్ల పతనం** : 1-80. **బౌలింగ్:** వుడ్ 2-0-9-0, హార్లీ 9-0-63-0, లీచ్ 9-2-24-1, రేహాన్ 3-0-22-0.

టైటిల్ పోరుకు బోపన్న జోడీ

ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీ

మెల్‌బోర్న్: తన కెరీర్‌లో అందని ద్రాక్షగా ఉన్న పురుషుల డబుల్స్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించేందుకు భారత స్టార్ రోహన్ బోపన్నకు మరో అవకాశం లభించింది. గతంలో రెండుసార్లు (2013, 2023) యూఎస్ ఓపెన్‌లో ఫైనల్‌కు చేరి రన్నరప్ ట్రోఫీలతో సరిపెట్టుకున్న బోపన్న...తాజాగా ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో తొలిసారి ఫైనల్లోకి దూసుకెళ్లాడు. గురువారం జరిగిన సెమీ ఫైనల్లో బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం 6-3, 3-6, 7-6 (10/7)తో టామస్ మెచాక్ (చెక్ రిపబ్లిక్)-జీజెన్ జాంగ్ (చైనా) జోడీపై విజయం సాధించింది. శనివారం జరిగే ఫైనల్లో సిమోన్ బొలెలీ-ఆండ్రియా వవాసోరి (ఇటలీ) ద్వయంతో బోపన్న-ఎబ్డెన్ జంట తలపడుతుంది.



ఫైనల్లో సబలెంకా, కిన్‌వెన్ జెంగ్

మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్, రెండో సీడ్ సబలెంకా (బెలారస్), 12వ సీడ్ కిన్‌వెన్ జాంగ్ (చైనా) ఫైనల్లోకి ప్రవేశించారు. సెమీఫైనల్స్‌లో సబలెంకా 7-6 (7/2), 6-4తో నాలుగో సీడ్ కోకో గాఫ్ (అమెరికా)పై గెలుపొందగా... కిన్‌వెన్ జాంగ్ 6-4, 6-4తో క్వాలిఫయర్ డయానా యాస్ట్రెమ్‌స్కా (ఉక్రెయిన్)ను ఓడించింది.

కోహ్లికి నాలుగోసారి...

ఐసీసీ 'వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు నెగ్గిన భారత స్టార్



దుబాయ్: భారత మేటి క్రికెటర్ విరాట్ కోహ్లి 2023 సంవత్సరానికి అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) 'వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' పురస్కారం గెల్చుకున్నాడు. గత ఏడాది కోహ్లి 27 వన్డేలు ఆడి 1377 పరుగులు సాధించాడు. ఇందులో ఆరు సెంచరీలు, ఎనిమిది అర్ధ సెంచరీలు ఉన్నాయి. స్వదేశంలో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో కోహ్లి 11 మ్యాచ్‌ల్లో 765 పరుగులు సాధించి 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్' అవార్డు దక్కించుకున్నాడు. వన్డే ఫార్మాట్‌లో ఐసీసీ 'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు నెగ్గడం కోహ్లికిది నాలుగోసారి. గతంలో 2012, 2017, 2018లలో కూడా కోహ్లికి ఈ పురస్కారం లభించింది. 2018లో కోహ్లి 'టెస్టు క్రికెటర్ ఆఫ్ ద ఇయర్'తో పాటు 'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్'... 2017లో 'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డులు పొందాడు. ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌కు 2023 సంవత్సరానికి 'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు ... ఆస్ట్రేలియా ఓపెనర్ ఉస్మాన్ ఖ్వాజాకు 'టెస్టు క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు దక్కాయి.


ముషీర్ ఖాన్

యువభారత్ ఘనవిజయం

ముషీర్ ఖాన్ సెంచరీ • రాణించిన ఉదయ్

బ్లూమ్‌ఫోంటెన్ (దక్షిణాఫ్రికా): అండర్-19 వన్డే ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో భారత జట్టు వరుసగా రెండో విజయం సాధించింది. ఐర్లాండ్‌తో గురువారం జరిగిన గ్రూప్ 'ఎ' రెండో లీగ్ మ్యాచ్‌లో భారత్ 201 పరుగుల తేడాతో గెలిచింది. ముందుగా భారత జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 301 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ముషీర్ ఖాన్ (106 బంతుల్లో 118; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీ చేయగా... కెప్టెన్ ఉదయ్ సహారణ్ (84 బంతుల్లో 75; 5 ఫోర్లు) అర్ధసెంచరీ సాధించాడు. వీరిద్దరు మూడో వికెట్‌కు 156 పరుగులు జోడించారు. 302 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఐర్లాండ్ జట్టు 29.4 ఓవర్లలో 100 పరుగులకే ఆలౌటైంది. భారత బౌలర్లు నమన్ తివారి (4/53), సౌమీ పాండే (3/19) ఐర్లాండ్‌ను దెబ్బతీశారు. భారత్ తమ చివరిదైన మూడో లీగ్ మ్యాచ్‌ను ఆదివారం అమెరికా జట్టుతో ఆడుతుంది.

క్లుప్తంగా...

ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన అంగన్‌వాడీలు

సజ్జలను సన్మానించిన అంగన్‌వాడీ వర్కర్లు



సజ్జలను సన్మానిస్తున్న అంగన్‌వాడీలు, చిత్రంలో గౌతమ్‌రెడ్డి

సాక్షి, అమరావతి/తాడేపల్లి రూరల్: తమ సమస్యలను పరిష్కరించేందుకు సానుకూలంగా చర్యలు చేపట్టిన ప్రభుత్వానికి అంగన్‌వాడీలు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీతో సమ్మె విరమించిన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు శుక్రవారం తాడేపల్లిలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని సన్మానించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అంగన్‌వాడీలు వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర అధ్య క్షులు డాక్టర్ పూనూరు గౌతమ్‌రెడ్డి ఆధ్వర్యంలో సజ్జలను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, వర్కర్స్ అసోసియేషన్ యూనియన్ నాయకులు ప్రేమ, హెల్డా మాట్లాడుతూ తమ సమస్యలను సానుకూలంగా అర్థం చేసుకుని పరిష్కారానికి చర్యలు చేపట్టిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీయూసీ జోనల్ ఇన్‌చార్జీ ఎస్.రాజారెడ్డి, ప్రదీప్, నరహరిశెట్టి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యలో... తిరుమల తరహా సేవలు!

సాక్షి, తిరుపతి: అయోధ్యలో బాలరాముని దర్శనం కోసం వచ్చే లక్షలాది మందికి ఇబ్బందులు లేకుండా చూడటంపై ఆలయ కమిటీ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా తిరుమల శ్రీవారి ఆలయంలో భక్తులకు అందుతున్న సేవలు, టీటీడీ తీసుకుంటున్న చర్యలు, వసతి, సంతృప్తికరమైన దర్శనాలు, భద్రత ప్రమాణాలు, క్యూలైన్ సిస్టం తదితర ఏర్పాట్లపై కమిటీ అధ్యయనం చేయనుంది. ఈ విషయాలపై టీటీడీ చైర్మన్ భూమనతో పీఎంవో, అయోధ్య కమిటీ సభ్యులు ఇటీవల చర్చించారు. త్వరలో ఈ కమిటీ తిరుమలకు వచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టనుందని భూమన గురువారం తెలిపారు. అయోధ్యకు వచ్చే భక్తుల రద్దీ దృష్ట్యా టీటీడీ ఇంజినీరింగ్ బృందాన్ని ఇప్పటికే అయోధ్యకు పంపించామని, మరింత సహకారం అందించేందుకు టీటీడీ సిద్ధంగా ఉందని కమిటీకి ఆయన హామీ ఇచ్చారు.

3,67,305 మందికి పునర్జన్మ


ఆరోగ్యశ్రీతో గుండె గుండెకూ భరోసా

పేదల ప్రాణానికి సర్కారు పెద్ద దన్ను • వివిధ కారణాలతో పెరుగుతున్న గుండె పోట్లు



అతనో ఆటో డ్రైవర్.. పేరు పాందూరు విజయ్ కుమార్.. ఊరు పార్వతీపురం. వచ్చే ఆదాయం ఇంట్లో వాళ్లు మూడు పూటలా తినడానికి కూడా సరిగా సరిపోదు.. ఒకరోజు ఉన్నట్టుండి ఛాతిలో నొప్పి రావడంతో వైద్యుడి వద్దకు వెళ్లాడు. గుండెలో మూడు రక్తనాళాలు మూసుకుపోయినట్లు గుర్తించి, వెంటనే బైపాస్ సర్జరీ చేయాలని చెప్పారు. ఆ మాట వినగానే అతడు వణికిపోయారు. తానిక బతకనంటూ కుటుంబ సభ్యుల ఎదుట కన్నీరు పెట్టుకున్నాడు. చేతిలో చిల్లిగవ్వ లేదు. ఏం చేయాలో దిక్కుతోచక కొట్టుమిట్టాడుతుంటే.. 'ఏదో ఒక పెద్దాసుపత్రికి వెంటనే వెళ్లిపోండి.. ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా ఆపరేషన్ చేస్తారు' అని అక్కడి వారు చెప్పారు. విశాఖ మెడికవర్ ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ ఇతనికి వెంటనే రెండున్నర లక్షల రూపాయల ఆపరేషన్‌ను ఉచితంగా చేశారు. రెండు నెలల పాటు విశ్రాంతి తీసుకోవాలని సూచిస్తూ వైఎస్సార్ ఆసరా కింద రూ.10,000 అందజేశారు. ఇప్పుడు చక్కగా ఆటో తోలుకుంటూ ఆనందంగా జీవిస్తున్నాడు.

-సాక్షి, అమరావతి





శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం అరకబద్ర గ్రామానికి చెందిన కె.సాహూ ఇంటి వద్ద చిన్న కొట్టు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. నిరుపేద కుటుంబం. 2020 డిసెంబర్ 23 అర్ధరాత్రి ఛాతీలో నొప్పి రావడంతో తొలుత బరంపురం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వెంటనే గుండె ఆపరేషన్ చేయాలని చెప్పగా, కుటుంబ సభ్యులు విశాఖకు తీసుకెళ్లారు. ఆరోగ్య శ్రీ కింద అక్కడ ఉచితంగా గుండె ఆపరేషన్ నిర్వహించారు. తర్వాత ఆరోగ్య ఆసరా కింద ప్రభుత్వం రూ.5 వేలు అతని ఖాతాలో జమ చేసింది.



గుంటూరు రాజీవ్‌గాంధీనగర్‌లో ఉంటున్న ఆటో డ్రైవర్ రావెల ప్రభాకర్‌దీ అదే పరిస్థితి. రూ.3 లక్షల ఖర్చయ్యే ఆపరేషన్‌ను ఉచితంగా చేయించిన ప్రభుత్వం పునర్జన్మనిచ్చింది. ఇలాంటి వారు తక్కువలో తక్కువ రాష్ట్ర వ్యాప్తంగా ఊరికొకరున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం ఆరోగ్య శ్రీ పథకంలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులతో బతికి బట్టకట్టగలిగారు. ఈ పథకమే లేకపోయి ఉండుంటే తామంతా ప్రాణాలతో ఉండే వాళ్లం కాదంటున్నారు. చేతి నుంచి చిల్లిగవ్వ ఖర్చు పెట్టే పని లేకుండా ఖరీదైన గుండె ఆపరేషన్, గుండె మార్పిడి చికిత్సలను సైతం ప్రభుత్వం ఉచితంగా చేయిస్తోంది. ఏపీతో పాటు, రాష్ట్రం వెలుపల చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లలోని కార్పొరేట్ ఆస్పత్రుల్లో గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులకు ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచిత వైద్య సేవలు అందుతున్నాయి.

3.67 లక్షల మందికి పునర్జన్మ

2019 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో 3,67,305 మంది గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులు ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్య సేవలు అందుకున్నారు. వీరికి 4,87,303 ప్రొసీజర్‌లలో చికిత్సలు అందించడానికి ప్రభుత్వం ఏకంగా రూ.2,229.21 కోట్లు ఖర్చు చేసింది. కాగా, 3.67 లక్షల మందిలో 2,22,571 మంది యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ, హార్ట్‌స్ట్రోక్, స్టెంట్‌లు వంటి కార్డియాలజీ సంబంధిత 2.82 లక్షల ప్రొసీజర్‌లలో చికిత్సలు అందుకున్నారు. మిగిలిన 1,44,734 మంది బైపాస్ సర్జరీలు, వాల్వ్ రిపేర్, కార్డియాక్, కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగంలో 2.05 లక్షల ప్రొసీజర్‌లలో ఉచిత వైద్య సేవలు అందుకున్నారు. మరో వైపు చికిత్స అనంతరం ఆరోగ్య ఆసరా కింద విశ్రాంత సమయానికి నెలకు గరిష్టంగా రూ.5 వేల వరకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది.

రూ.25 లక్షల వరకు వైద్యం ఉచితం

నిరుపేదలు, రూ.5 లక్షల్లోపు వార్షికాదాయం ఉన్న కుటుంబాల ప్రజలకు ఒక్క గుండె సంబంధిత చికిత్సలే కాకుండా అనేక రకాల ఆరోగ్య సమస్యల్లో ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్య సేవలు అందిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం జగన్ ఈ పథకాన్ని విప్లవాత్మకంగా బలోపేతం చేశారు. ఇటీవల వైద్య ఖర్చుల పరిమితిని రూ.25 లక్షలకు పెంచారు. గత ప్రభుత్వంలో 1,059 ప్రొసీజర్‌లు ఉండగా, వాటిని 3,257కు పెంచారు. 2019 నుంచి ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా కోసం ఏకంగా రూ.13 వేల కోట్లకు పైగానే ఖర్చు చేసింది. 40 లక్షల మందికి ఉచితంగా వైద్య సేవలు అందించారు. కొత్తగా 17 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు నడుం బిగించారు. ఇందులో ఐదు కళాశాలలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. మరో ఐదు వచ్చే ఆర్థిక ఏడాదిలో ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. నాడు–నేడు కింద ప్రభుత్వ ఆస్పత్రులన్నింటినీ అభివృద్ధి చేస్తున్నారు. 53 వేల మందికి పైగా వైద్యులు, వైద్య సిబ్బందిని కొత్తగా నియమించారు. ఉద్దానంలో వైఎస్సార్ కిడ్నీ పరిశోధన కేంద్రం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించారు. ఫ్యామిలీ డాక్టర్ పేరుతో గ్రామీణులకు వైద్యాన్ని మరింత చేరువ చేశారు. వీటన్నింటికీ తోడు వైఎస్సార్ ఆరోగ్య సురక్ష క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారు. తొలి విడత 12,423 శిబిరాలు నిర్వహించి, 60.27 లక్షల మందికి ఓపీ సేవలు అందించారు. రెండవ దశలో ఇప్పటి వరకు 2,838 క్యాంపులు నిర్వహించి, 9.48 లక్షల మందికి వైద్యం అందించారు.

2019 నుంచి ఆరోగ్యశ్రీ కింద గుండె సంబంధిత చికిత్సల వివరాలు

సంవత్సరం	వ్యాధిగ్రస్తులు	ప్రొసీజర్‌లు	నిధులు (రూ.కోట్లలో)
2019-2020	23,797	24,027	79.69
2020-2021	24,243	24,599	77.06
2021-2022	36,724	37,645	116.10
2022-2023	66,333	86,398	303.91
2023-2024	71,474	1,09,519	393.41
	2,22,571	2,82,188	970.17

కార్డియాక్, కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగంలో

2019-2020	35,903	50,144	305.89
2020-2021	25,779	37,614	217.37
2021-2022	35,815	53,504	298.94
2022-2023	34,159	48,975	300.63
2023-2024	13,078	14,878	136.22
	1,44,734	2,05,115	1,259.05

దేవుడిలా ఆదుకున్నారు



నాకు 71 ఏళ్లు. అరటిపళ్లు, కొబ్బరికాయలు అమ్ముకునే చిరు వ్యాపారిని. ఆయాసంతో బాధ పడుతున్నాను. దీంతో గత ఏడాది ప్రభుత్వం మా ఊళ్లో ఆరోగ్య సురక్ష క్యాంప్ పెట్టినప్పుడు వైద్యులను సంప్రదించా. రాజమండ్రిలో ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లమన్నారు. అక్కడకు వెళ్లగా పరీక్షలు చేసి రక్తనాళాలు పూడిపోయాయని చెప్పారు. బైపాస్ సర్జరీ చేయాలన్నారు. మా అబ్బాయి ఎలక్ట్రికల్ పనులు చేస్తుంటాడు. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి మాది. ఈ క్రమంలో బైపాస్ సర్జరీ చేయించుకోవడానికి అప్పులు చేయాల్సి వస్తుందని భయపడ్డాను. ఆరోగ్యశ్రీ పథకం దేవుడిలా ఆదుకుంది. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వమే అక్టోబర్ 25న సర్జరీ చేయించింది. డిశ్చార్జి అయ్యాక కోలుకునే సమయానికి రూ.9500 భృతి బ్యాంక్ ఖాతాలో జమ చేసింది. ప్రస్తుతం నా ఆరోగ్యం బాగానే ఉంది. ప్రభుత్వం మేలును ఎన్నటికీ మరువము.

– గుత్తికొండ వెంకటరమణ, తేతలి గ్రామం, పశ్చిమగోదావరి జిల్లా

ఆరోగ్యశ్రీ నా ప్రాణం నిలబెట్టింది



వీధి వ్యాపారం చేసుకుంటూ బతుకుతున్నాను. 2022 జూన్‌లో ఎక్కువగా గుండె నొప్పి వచ్చింది. ఆస్పత్రికి వెళ్లి చూపిస్తే వెంటనే ఆపరేషన్ చేయాలన్నారు. దీంతో నా గుండె ఆగినంత పనైంది. ముగ్గురు ఆడపిల్లల్లో ఇద్దరికి పెళ్లి చేశాను. ఇంకా ఒక అమ్మాయి ఉంది. రోజంతా రోడ్డు మీద కొబ్బరికాయలు, పళ్లు అమ్మితేనే నోటికి కూడు దక్కుతాది. వచ్చే డబ్బుతో కుటుంబ పోషణ, మూడో అమ్మాయి పెళ్లి ఇలా చాలా సమస్యలున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆపరేషన్ అంటే ఏం చేయాలో పాలుపోని పరిస్థితుల్లో ఆరోగ్యశ్రీతో డబ్బులు లేకుండానే ఆపరేషన్ చేస్తారని మా ఊరి నర్స్ చెప్పింది. దీంతో శ్రీకాకుళంలో ఆస్పత్రికి వెళ్లగా అక్కడ ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా ఆపరేషన్ చేశారు. ఈ పథకం లేకపోతే.. నాలాంటి పేదోడికి దిక్కేది? ఈ పథకమే నా ప్రాణం నిలబెట్టింది.

– బోర రామ్మూర్తి, రాందాస్‌పేట, శ్రీకాకుళం జిల్లా

పేదలపై వైద్య ఖర్చుల భారం లేదు




రాష్ట్రంలో వైద్యం కోసం పేదలు, మధ్యతరగతి ప్రజలు అప్పులపాలు కాకూడదు అనేది ప్రభుత్వ లక్ష్యం. ఆ మేరకు పథకానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. అర్హులందరికీ ఉచితంగా చికిత్సలు అందేలా చూస్తున్నాం. గుండె, కాలేయం, కిడ్నీ సంబంధిత, క్యాన్సర్ వంటి పెద్ద పెద్ద జబ్బులకు చికిత్సలు పథకం పరిధిలో ఉన్నాయి. సేవలు పొందడంలో ఏవైనా సందేహాలుంటే 104ను సంప్రదించవచ్చు. వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి పథకం గురించి ప్రజలకు వివరిస్తున్నారు.

– డి.కె.బాలజీ, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సీఈవో

మారు మూలనా 'హలో సెల్'

గిరిజన ప్రాంతాలకు సమర్థవంతమైన టెలికాం సేవలు

400 సెల్ టవర్ల ప్రారంభ కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్



గిరిజన ప్రాంతాల్లో సెల్‌టవర్లను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: మారుమూల గిరిజన ప్రాంతాలకు సమర్థవంతమైన టెలికాం సేవలందించడంతో పాటు సంక్షేమాభివృద్ధి పథకాలు ప్రతి ఇంటికి పారదర్శకంగా అందాలన్న తపన, తాపత్రయంతో అడుగులు వేగంగా వేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఇందులో భాగంగా దాదాపు రూ.400 కోట్లతో 400 సెల్ టవర్లను నిర్మించామని తెలిపారు. గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి వాటిని వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 400 సెల్ టవర్ల ద్వారా 2.42 లక్షల మందికి ప్రయోజనం చేకూరిందన్నారు. ప్రధానంగా అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, ప్రకాశం, ఏలూరు, శ్రీకాకుళం, కాకినాడ జిల్లాల్లోని మారు మూల ప్రాంతాల వారు ఫోన్లలో మాట్లాడే వీలు కలుగుతోందన్నారు. ప్రస్తుతం ప్రారంభించిన టవర్ల ద్వారా 944 గ్రామాలకు కనెక్టివిటీ ఏర్పడుతుందని చెప్పారు. మొత్తంగా రూ.3,119 కోట్లతో 2,900 టవర్లను ఏర్పాటు చేసేలా కార్యాచరణ రూపొందించామని తెలిపారు. తద్వారా 5,549 ఆవాసాలను కనెక్టివిటీలోకి తీసుకొచ్చేందుకు మార్గం ఏర్పడుతుందని తెలిపారు. దీన్ని సఫలీకృతం చేసేందుకు కేంద్రంతో మాట్లాడి.. ఇందులో భాగస్వామ్యం అయ్యేలా ఒప్పించామన్నారు.

సెల్ టవర్ల ఏర్పాటుకు అవసరమైన భూములను 2,900 లొకేషన్లలో ఇప్పటికే ఇచ్చామని స్పష్టం చేశారు. 'ఎటువంటి ఇబ్బంది లేకుండా సెల్ టవర్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చాం. పవర్ కనెక్షన్‌కు చర్యలు తీసుకున్నాం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి చేయాల్సినవన్నీ రెట్టించిన వేగంతో చేశాం. టవర్ల నిర్మాణ కార్యక్రమం ఇప్పటికే మొదలైంది. దేవుడు ఆశీర్వదిస్తే ఇదే మాదిరిగా ప్రతి 3 నెలలకొకసారి...400 నుంచి 500 టవర్ల నిర్మాణం పూర్తి చేసి అన్నింటినీ అందుబాటులోకి తీసుకొస్తాం. మరో ఏడాది కాలంలో అన్ని టవర్ల నిర్మాణం పూర్తి చేస్తాం' అని తెలిపారు.

మారుమూల ఆవాసాల్లో టీవీలు, ఫోన్లు

సెల్ టవర్ల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో.. కనెక్టివిటీ లేని ఆవాసాలను సమాజంతో కనెక్ట్ చేసే కార్యక్రమం జరుగుతోందని.. టీవీలు, ఫోన్లు పనిచేస్తాయని సీఎం వైఎస్ జగన్ అన్నారు. మనం ఇచ్చే పథకాలకు సంబంధించి వివరాలన్నింటినీ వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసే కార్యక్రమం వేగవంతంగా జరుగుతుందని చెప్పారు. మనం బటన్ నొక్కిన వెంటనే వాళ్లకు డబ్బులు ట్రాన్స్‌ఫర్ కావడం కూడా అంతే వేగంగా జరుగుతుందన్నారు. వెంటనే వాళ్లు చూసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ఇవన్నీ వేగవంతంగా, ఎఫెక్టివ్‌గా, పారదర్శకంగా జరగడం కోసమే ఈ కనెక్టివిటీ చాలా అవసరంగా భావించి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని స్పష్టం చేశారు. గ్రామ సచివాలయాలు, ఆర్బీకే వ్యవస్థ, విలేజ్ క్లినిక్‌లు, నాడు–నేడుతో బాగు పడుతున్న ఇంగ్లిష్ మీడియం స్కూళ్లు.. ఇవన్నీ గ్రామ రూపురేఖలను మార్చే దిశగా పడుతున్న అడుగులని, ఈ నేపథ్యంలో కనెక్టివిటీ అన్నది అత్యంత ఉపయోగకరమైన అంశం అవుతుందన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించిన సీఎం క్యాంపు కార్యాలయంలో ఐటీ, పరిశ్రమలు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, సీఎస్ డాక్టర్ కె ఎస్ జవహర్ రెడ్డి, ఐటీ శాఖ కార్యదర్శి కోన శశిధర్, కమ్యూనికేషన్స్ (ఐటీ శాఖ) డైరెక్టర్ సి చంద్రశేఖర్ రెడ్డి, భారతీ ఎయిర్‌టెల్, రిలయెన్స్ సంస్థల ప్రతినిధులు.. డుంబ్రిగుడ మండలం ఈదులపాలెంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, పాడేరు నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుహిన్‌సిన్హా, సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గతంలో ఫోన్ చేయాలంటే కొండ ఎక్కాల్సి వచ్చేది



సార్.. మేం గతంలో చాలా ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు చాలా సంతోషంగా ఉంది. గతంలో ఫోన్ చేయాలంటే కొండల పైకి ఎక్కాల్సి వచ్చేది. ఇప్పుడు మా గ్రామంలోనే సెల్ టవర్ ఏర్పాటు చేశారు. సిగ్నల్ బాగా వస్తోంది. మా గ్రామస్తులందరూ సంతోషంగా ఉన్నారు. మాకు గతంలో సచివాలయం అంటే, కలెక్టర్ అంటే, వలంటీర్ అంటే తెలీదు. ఇప్పుడు అందరి గురించి తెలిసింది. జగనన్న మా బాధలు గమనించి మాకు సాయం చేస్తున్నారు. గతంలో రోడ్లు లేవు. ఇప్పుడు చక్కటి రోడ్లు వేశారు. మీరు (సీఎం) ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలు మాకు అందుతున్నాయి. మీరు మా వెంట ఉన్నామన్న భరోసా ఇచ్చి మమ్మల్ని ముందుకు నడిపిస్తున్నారు. మీ పథకాల ద్వారా లబ్ధి పొంది మా కాళ్లపై మేం నిలబడ్డాం. మేమంతా కూడా మళ్లీ మీరే రావాలని కోరుకుంటున్నాం. గతంలో మీరు పాడేరు వచ్చినప్పుడు దగ్గర నుంచి చూడలేకపోయాను. ఇప్పుడు నేరుగా మీతో మాట్లాడే అవకాశం వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది.

– చిట్టెమ్మ, గిరిజన మహిళ, పాడేరు మండలం, ఏఎస్ఆర్ జిల్లా

ఐదు కిలోమీటర్లు వెళ్లాల్సిన బాధ తప్పింది



అన్నా.. మా గిరిజన గ్రామాలకు ఇన్నాళ్లూ ఫోన్ సిగ్నల్ లేదు. 5 కిలోమీటర్లు వెళ్లి ఫోన్ చేయాల్సి వచ్చేది. ఏదైనా ప్రమాదం జరిగినా అంబులెన్స్ వాళ్లకు చెప్పడానికి కూడా ఫోన్ సిగ్నల్ ఉండేది కాదు. మా బంధువుల కష్టసుఖాలు తెలిసేవి కాదు. కానీ ఇప్పుడు నేరుగా వారితో మాట్లాడుతున్నాం. మా పిల్లలు కూడా బాగా చదువుకుంటున్నారు. నేరుగా టీచర్స్‌తో మాట్లాడుతున్నాం. ఇదివరకు గవర్నమెంట్ స్కీమ్స్ గురించి తెలిసేది కాదు. ఇప్పుడు నేరుగా జగనన్నకు చెబుదాం నెంబర్ 1902కు కాల్ చేసి మాట్లాడగానే మా సమస్య పరిష్కారం అవుతోంది. ఆరోగ్యశ్రీ యాప్, దిశ యాప్ విలువ తెలిసింది. మా సచివాలయంలో ఇదివరకు సిగ్నల్ లేక ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు మీ చొరవ వల్ల ఇంటి నుంచే అన్నీ తెలుసుకుంటున్నాం. ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేకుండా ఊళ్లోనే అన్ని సేవలు అందుతున్నాయి. మీ వల్ల అందరం చాలా సంతోషంగా ఉంటున్నాం.

– చలపతిరావు, గిరిజనుడు, పార్వతీపురం మన్యం జిల్లా

శేషేంద్ర శర్మ రచనల హక్కులన్నీ కుమారుడికే..

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ కవి గుంటూరు శేషేంద్ర శర్మ గ్రంథ హక్కుల వివాదంలో ఆయన కుమారుడు సాత్యకికి తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. తండ్రి పుస్తకాలపై హక్కులన్నీ ఆయనకే చెందుతాయని కోర్టు తీర్పునిచ్చింది. తను రాసిన పుస్తకాలు, గ్రంథాలపై హక్కులను కుమారుడైన సాత్యకికి 1989లో శేషేంద్ర శర్మ రాసిచ్చారు. 2007లో శేషేంద్ర శర్మ మృతిచెందారు. అయితే తనను శేషేంద్ర శర్మ వివాహం చేసుకున్నారని, తనకు కూడా ఆ పుస్తకాలపై హక్కులు ఉంటాయంటూ హైదరాబాద్‌కు చెందిన ఇందిరా ధనరాజ్‌గిర్ వివాదానికి తెరలేపారు. ఈ వివాదం సిటీ సివిల్ కోర్టుకు చేరింది. విచారణ జరిపిన న్యాయస్థానం రచనలపై హక్కులన్నీ కుమారుడికే చెందుతాయని తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఇందిర హైకోర్టులో అప్పీల్ చేశారు. విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ జి.రాధాదేవి గురువారం తీర్పు వెలువరించారు. ఇందిర అప్పీల్‌ను కొట్టివేశారు.

9 మంది ఏపీ పోలీసులకు ప్రతిభా సేవా పతకాలు

సాక్షి, న్యూఢిల్లీ: గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఉత్తమ సేవలు అందించిన పోలీస్, అగ్నిమాపక, హోంగార్డు, సివిల్ డిఫెన్స్ విభాగాల్లోని మొత్తం 1,132 మంది అధికారులకు కేంద్ర ప్రభుత్వం నాలుగు కేటగిరీల్లో పతకాలను ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తొమ్మిది మంది పోలీసు అధికారులు ప్రతిభా సేవా పతకాలకు ఎంపికయ్యారు. కమాండెంట్ కోటనాని వెంకట ప్రేమ్‌జిత్, ఆర్ఎస్ఐ ఆవుల చెన్నయ్య, ఏఎస్ఐ ఆర్.రమణారెడ్డి, ఇన్‌స్పెక్టర్ అద్దంకి వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ బి.ప్రకాశ్‌రావు, ఏఎస్ఐ కరి మస్తాన్‌రావ్, అసిస్టెంట్ కమాండెంట్ పుల్లభొట్ల వెంకట సత్య అనంత దుర్గప్రసాద్‌రావు, ఇన్‌స్పెక్టర్ అక్కిశెట్టి శ్రీహరిరావు, డీఎస్పీ కోటిరెడ్డి పోలీసు ప్రతిభా సేవా పతకాలు దక్కాయి. వీరితో పాటు ఆంధ్రప్రదేశ్ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ పెనికలపాటి వెంకటరమణ, అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ జాస్తి రమణయ్య, లీడింగ్ ఫైర్‌మ్యాన్ షేక్ ఘనీకి ఫైర్ సర్వీసెస్ కేటగిరీలో ప్రతిభా సేవా పతకాలకు ఎంపికయ్యారు. ఈ ఏడాది బీఎస్ఎఫ్‌కు చెందిన ఇద్దరు పోలీసు అధికారులకు వారి మరణానంతరం రాష్ట్రపతి శౌర్య పతకాలను కేంద్రం ప్రకటించింది. దేశవ్యాప్తంగా 275 మంది శౌర్యపతకాలకు, 102 మంది రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలకు, 753 మంది ప్రతిభా సేవా పతకాలకు ఎంపికయ్యారు.

నేటి నుంచి టెస్ట్ మ్యాచ్ టికెట్ల విక్రయాలు

విశాఖ స్పోర్ట్స్: విశాఖపట్నంలోని వైఎస్సార్ స్టేడియంలో ఫిబ్రవరి 2 నుంచి భారత్, ఇంగ్లండ్ మధ్య జరగనున్న రెండో టెస్ట్ మ్యాచ్‌కు శుక్రవారం నుంచి కౌంటర్ల ద్వారా టికెట్లను విక్రయించనున్నారు. వైఎస్సార్ స్టేడియంతో పాటు స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలోనూ టికెట్ల కౌంటర్లు ఏర్పాటు చేశామని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపినాథరెడ్డి తెలిపారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

డ్రైవర్ల విధినిర్వహణ శ్లాఘనీయం



ఆర్‌టీసీ బస్సు డ్రైవర్లతో డిపో మేనేజర్ మంజుల

కంప్లి: ఎంతటి అత్యావసర పరిస్థితిలో కూడా ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చే మహత్తరమైన బాధ్యతను నిర్వర్తించే డ్రైవర్ల కర్తవ్య నిర్వహణ శ్లాఘనీయమని హరపనహళ్లి ఆర్‌టీసీ డిపో మేనేజర్ మంజుల తెలిపారు. ఆమె డ్రైవర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని తమ డిపో పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న డ్రైవర్లకు గులాబీలు అందించి అభినందించి మాట్లాడారు. రోడ్డు రవాణా శాఖలో విధులు నిర్వహించే డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటూ ఉత్తమ రీతిలో పని చేయడం అభినందనీయం అన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడంలో వారి పాత్రకు జోహార్లు అన్నారు.

కరువు పరిహార నిధుల విడుదల



మాట్లాడుతున్న మంత్రి కృష్ణబైరేగౌడ

రాయచూరు రూరల్: రాష్ట్రంలో కరువు ఛాయలు అధికమైనందున రైతులకు ఎకరాకు రూ.2 వేల చొప్పున పరిహారం అందించడానికి సర్కార్ రూ.550 కోట్ల నిధులు విడుదల చేసిందని రాష్ట్ర రెవిన్యూ శాఖా మంత్రి కృష్ణబైరేగౌడ వెల్లడించారు. ఆయన బుధవారం రాత్రి కలబుర్గిలో విలేకరులతో మాట్లాడారు. వారం రోజుల్లో రైతులందరి ఖాతాల్లో సొమ్ము జమ అవుతుందన్నారు. 35 లక్షల మంది రైతులకు గాను ఇప్పటికే 12 లక్షల మంది రైతులకు నిధులు జమ చేశామన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నెలకొనకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా కలబుర్గి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ప్రియాంక్ ఖర్గే, ఎమ్మెల్యేలు పాటిల్, కనీజా ఫాతిమా, రెవిన్యూ శాఖ కమిషనర్ సునీల్ కుమార్, జిల్లాధికారిణి ఫౌజియా తరన్నుమ్, ఏసీ ఆశప్పలున్నారు.

అయోధ్య రామునికి రైతు రూ.91 వేల విరాళం



కర్ణాటక గ్రామీణ బ్యాంక్ నుంచి నగదు పంపిన రసీదు, రైతు సణ్ణకరియప్ప

రాయచూరు రూరల్: కరువు, కష్టకాలంలో అయోధ్యలో శ్రీరామ మందిరానికి రూ.91 వేలు దానం చేసిన రైతు ఉదంతం జిల్లాలో చోటు చేసుకుంది. తన పొలంలో పండించిన జొన్నలను అమ్మగా వచ్చిన మొత్తంలో 75 శాతం దానం చేశారు. సింధనూరు తాలూకా గోమర్సికి చెందిన రైతు సణ్ణకరియప్ప పొలంలో 80 బస్తాల జొన్నలు పండగా, ఇంటి కోసం 30 బస్తాలను నిల్వ ఉంచుకొని 50 బస్తాలు అమ్మగా వచ్చిన సొమ్ములో నుంచి ఈనెల 23వ తేదీన రూ.91,870లను ఆర్టీజీఎస్ ద్వారా శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్రం, అయోధ్య అనే చిరునామాకు కర్ణాటక గ్రామీణ బ్యాంక్ ఖాతా నుంచి పంపి రామునిపై తన భక్తిని చాటుకున్నారు.

సురక్షితంగా గమ్యానికి చేర్చడమే లక్ష్యం



కార్యక్రమం ప్రారంభిస్తున్న అధికారులు

రాయచూరు రూరల్: ఆర్టీసీ బస్ డ్రైవర్లు ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు తరలించడమే ముఖ్య లక్ష్యమని ఎస్పీ నిఖిల్ పేర్కొన్నారు. ఆయన గురువారం ఆర్టీసీ బస్టాండ్‌లో డ్రైవర్ల దినోత్సవంలో మాట్లాడారు. ప్రతి నిత్యం ప్రజలను తమ గమ్యస్థానాలకు చేరవేయడంలో ఆర్టీసీ డ్రైవర్ల కృషి ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీసీ చంద్రశేఖర్, అధికారులు హసన్ అలీ, రవికుమార్, మహంతేష్, అణ్ణప్పలున్నారు.

పేదలకు భూములు పంచాలి



ర్యాలీ నిర్వహిస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: జిల్లాలోని బగర్ హుకుం భూములను పేదలకు పంచాలని అఖిల భారత రైతు, వ్యవసాయ, కార్మిక సంఘం డిమాండ్ చేసింది. గురువారం తహసీల్దార్ కార్యాలయం వరకు చేపట్టిన ర్యాలీలో అధ్యక్షుడు మల్లనగౌడ మాట్లాడారు. వేలాది ఎకరాల భూములను సాగు చేసుకుంటున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు చేసి భూమి లేని పేదలకు పంచి పెట్టాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

వంతెనకు కారు ఢీ.. నలుగురు మృతి

- చిత్రదుర్గ జిల్లాలో ఘోరం
- మృతుల్లో ముగ్గురు చిన్నారులు
- మృతుల స్వస్థలం రాయచూరు జిల్లా



మార్చురీ వద్ద రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు



ఆస్పత్రి మార్చురీలో కారు డ్రైవర్ లింగప్ప(ఇన్‌సెట్‌లో), చిన్నారుల మృతదేహాలు

సాక్షి, బళ్లారి: కళ్లు తెరిచి చూసేలోగా ఘోరం జరిగిపోయింది. ఒకే కుటుంబానికి చెందినవారు రాయచూరు జిల్లా దేవదుర్గ తాలూకా నుంచి పని మీద బెంగళూరుకు బయలుదేరారు. కారులో వెళుతుండగా ప్రమాదం రూపంలో మృత్యువు కబళించడంతో చిన్నారులతో సహా నలుగురు మృతి చెందారు. గురువారం తెల్లవారు జామున చిత్రదుర్గ జిల్లా చెళ్లకెరె తాలూకా సాణికెరె సమీపంలో జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది.



కాలువలో పడిన ఆటోను పరిశీలిస్తున్న స్థానికులు

డ్రైవర్ నిద్రమత్తు వల్లే..

డ్రైవర్ నిద్రమత్తులోకి జారడంతో కారు అదుపు తప్పి వంతెనను ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న డ్రైవర్ లింగప్ప (26), చిన్నారులు అయ్యాళప్ప (5), సింధుశ్రీ (2), రక్షిత (11 నెలలు) అక్కడికక్కడే మృతి చెందారు. యల్లమ్మ, మల్లమ్మ, నాగప్ప అనేవారు తీవ్రంగా గాయపడటంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. స్థానిక ఎస్‌ఐ శివరాజ్‌తో పాటు పలువురు పోలీసులు అక్కడికి బాధితులను, మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. ఘటనపై చెళ్లకెరె పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా.. ఒకరి మృతి

వ్యవసాయ కూలీలు ఆటోలో పనికి వెళ్లి తిరిగి వస్తుండగా ఆటో అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లడంతో ఒకరు మరణించిన ఘటన గురువారం జరిగింది. వివరాలు..హలకుంది గ్రామానికి చెందిన దాదాపు 12 మందికి పైగా వ్యవసాయ కూలీలు ఆటోలో రోజూ మాదిరిగానే బొబ్బుకుంట వద్ద పత్తి, మిరప కాయలు విడిపించేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో హెచ్‌ఎల్‌సీ కాలువ డిస్ట్రిబ్యూటరీలోకి ఆటో దూసుకెళ్లడంతో ఆటోలో ఉన్న వ్యవసాయ కూలి పార్వతి(52) అనే మహిళ మృతి చెందగా, ఈ ఘటనలో మరో 10 మందికి గాయాలు కాగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు. ఈ విషయం తెలిసిన వెంటనే స్థానిక ఏఎస్పీ, డీఎస్పీలు, గ్రామీణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సతీష్‌తో పాటు పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. గాయపడిన వారిని విమ్స్ ఆస్పత్రికి, మృతదేహాన్ని కూడా పోస్టుమార్టం నిమిత్తం విమ్స్ మార్చురీకి తరలించారు. ఈ ఘటనతో ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఆటోలో సామర్థ్యానికి మించి కూలీలను నిత్యం పనులకు తీసుకెళ్లడంతోనే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోయారు. కాగా ఈ ఘటనపై గ్రామీణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ సంబంధాన్ని ప్రశ్నించినందుకు భార్య హత్య

- మృతదేహాన్ని గోనె సంచిలో కుక్కి చెరువులో పడేసిన భర్త
- దావణగెరె జిల్లాలో ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

సాక్షి,బళ్లారి: తన అక్రమ సంబంధాన్ని ప్రశ్నించిన భార్యను అడ్డు తొలగించుకోవాలని ఓ భర్త తన ప్రియురాలితో కలిసి భార్యను హత్య చేసి, ఆపై మృతదేహాన్ని గోనెసంచిలో కట్టి చెరువులో పడేసిన ఘటన దావణగెరె జిల్లాలో వెలుగు చూసింది. వివరాలు..దావణగెరె జిల్లా కొడగనూరు గ్రామానికి చెందిన కావ్య(23) అనే గృహిణి, ఆమె భర్త సచిన్ ఇద్దరూ అన్యోన్యంగా కాపురం చేసుకుంటుండగా చైత్ర అనే మహిళతో సచిన్‌కు అక్రమ సంబంధం ఏర్పడింది. కొంతకాలానికి ఈ విషయం తనకు తెలియడంతో సచిన్‌ను భార్య ప్రశ్నించింది. దీంతో తరచూ గొడవలు జరిగేవి. చివరకు ఎలాగైనా తమ ఆనందానికి ఆటంకంగా ఉన్న భార్యను అడ్డు తొలగించుకునేందుకు పథకం ప్రకారం మూడు రోజుల క్రితం ఆమెను దారుణంగా హత్య చేసి మృతదేహాన్ని గోనెసంచిలో కుక్కి చెరువులో పడేశారు. అయితే కొన్ని రోజుల తర్వాత చెరువులో పడేసిన గోనెసంచిలో మృతదేహం బయట పడడంతో గుర్తించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై దావణగెరె పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టగా అసలు గుట్టు రట్టయింది.

యరగేరా దర్గాలో ఎమ్మెల్యే పూజలు



దర్గాను సందర్శించిన ఎమ్మెల్యే బసనగౌడ

రాయచూరు రూరల్: యరగేరా బడేసాబ్ దర్గా ఉరుసు వైభవంగా ముగిసింది. గురువారం దర్గాను సందర్శించిన గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ నిర్వాహకులతో కలిసి భక్తిశ్రద్ధలతో దర్గాలో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాఫర్ అలీ పటేల్, మహ్మద్ పటేల్ నిజాముద్దీన్, కృష్ణాజుల్లా పాల్గొన్నారు.

సైకిల్ జాతా



సైకిల్ జాతా నిర్వహిస్తున్న విద్యార్థినులు

కంప్లి: ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం అమలు చేసిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జీపీ అధ్యక్షురాలు శ్రీదేవి తెలిపారు. సండూరు తాలూకా తాళూరు గ్రామంలో గురువారం బేటీ బచావో బేటీ పడావో, జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా సైకిల్ జాతాను ప్రారంభించి ఆమె మాట్లాడారు. మహిళలు, ఆడపిల్లల రక్షణపై జాతాలో ప్రచారం చేయాలన్నారు.

కరువు పరిస్థితులపై మంత్రి సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్, చిత్రంలో ఎమ్మెల్యే, అధికారులు

హొసపేటె: జిల్లాధికారి కార్యాలయ సభాంగణంలో బుధవారం జిల్లా ఇన్‌చార్జ్, గృహ నిర్మాణ, వక్ఫ్, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ కరువు పరిస్థితుల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఈ సంవత్సరం వర్షాలు సరిగా కురవక పోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా కరువు ఛాయలు ఏర్పడ్డాయన్నారు. విజయనగర జిల్లాలో కూడా ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. వర్షాభావ పరిస్థితులతో ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. విపత్తు నిర్వహణకు నిధుల కొరత లేదు. సమస్యాత్మక గ్రామాలను జాబితా చేయాలని, అటువంటి ప్రదేశాల్లో అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాధికారి ఎంఎస్ దివాకర్ మాట్లాడుతూ హొసపేటెలో 69, హడగలిలో 112, హగరిబొమ్మనహళ్లిలో 33, హరపనహళ్లిలో 190, కొట్టూరులో 40, హొసపేటె తాలూకాలో 15, హగరిబొమ్మనహళ్లిలో 4, హరపనహళ్లి తాలూకాలో 27, కూడ్లిగి తాలూకాలో 29 కలిపి మొత్తం 473 గ్రామాలకు తాగునీటి కొరత ఎదురు కావచ్చని అంచనా వేశామన్నారు. తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామ వార్డుల్లో 578 బోరు బావులను వేయించాలని తీర్మానించామన్నారు. ఆరు తాలూకాల్లో రానున్న 21 వారాలకు సరిపడా పశుగ్రాసం అందుబాటులో ఉందని అన్నారు.

అధికారులు పారదర్శకంగా పని చేయాలి

ఆయా శాఖల అధికారులు అనవసరంగా సెలవు పెట్టకుండా పారదర్శకంగా పని చేయాలని మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. గురువారం జిల్లాధికారి కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి కర్ణాటక అభివృద్ధి కార్యక్రమం త్రైమాసిక ప్రగతి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టుల అమలుకు నిధుల కొరత లేదన్నారు. తాగునీటి సరఫరా, రోడ్ల అభివృద్ధి, మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు మౌలిక వసతుల కల్పనకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 110 మురికి వాడల్లో మార్పు కనిపించాలన్నారు. ఈ విషయమై అధికారులు ఆయా తాలూకాల ఎమ్మెల్యేలతో చర్చించి మురికివాడల్లో ఇళ్లు, తాగునీటి అవసరాలపై కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి, 15 రోజుల్లోపు సమర్పించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ఎమ్మెల్యేలు గవియప్ప, శ్రీనివాస్, లత, నేమిరాజ్ నాయక్, జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు, జిల్లా ఎస్పీ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఓటరు దినోత్సవం



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

కంప్లి: ప్రజా ప్రభుత్వంపై దృఢ విశ్వాసం గల భారత పౌరులైన తాము తమ దేశపు ప్రజాసత్తాత్మక సంప్రదాయాలు, ముక్త, న్యాయ సమ్మత, శాంతియుత ఎన్నికల ఘనతను ఎత్తి చూపుతామని, ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా, కుల, మత, భాష, విద్య ఎలాంటి ప్రేరేపణలకు ప్రభావితం కాకుండా తాము ఓటు హక్కు వినియోగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. తాలూకా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటర్ల ప్రతిజ్ఞా విధిని తహసీల్దార్ శివరాజ్ బోధించారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు వేయాలి



కార్యక్రమం ప్రారంభిస్తున్న అధికారులు

రాయచూరు రూరల్: ఎన్నికల్లో నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ సూచించారు. గురువారం పండిత సిద్దరామ జంబలదిన్ని రంగమందిరంలో ఏర్పాటు చేసిన జాతీయ ఓటరు దినోత్సవంలో మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలన్నారు. ఎన్నికల్లో సమర్థులను ఎన్నుకోవాలన్నారు. జిల్లా ఆరోగ్య శాఖ భవనంలో బీఎల్ఓ, ప్రజలు, అధికారులతో ప్రమాణం చేయించారు. సమావేశంలో జిల్లా జడ్జిలు మారుతి బగాడే, దయానంద బేలూరు, అదనపు జిల్లాధికారి దురుగేష్, జెడ్పీ సీఈఓ రాహుల్ పాండే తుకారాం, నగరసభ కమిషనర్ గురుసిద్దయ్య, ఆర్‌డీఏ కమిషనర్ మెహబూబీ, తహసీల్దార్ సురేష్‌వర్మలున్నారు.

ఓటు.. ప్రజాస్వామ్యానికి బలం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి పుష్పాంజలిదేవి

బళ్లారిటౌన్: ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును సద్వినియోగ పరుచుకోవాలని జిల్లా న్యాయసేవా ప్రాధికార అధ్యక్షురాలు ఎస్‌హెచ్.పుష్పాంజలి దేవి పేర్కొన్నారు. బీడీఏఏ ఫుట్‌బాల్ సభాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన జాతీయ ఓటరు దినోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఓటు వేయడం ప్రజల బాధ్యత అన్నారు. ప్రజాస్వామ్య భవిష్యత్ యువ ఓటర్లపై ఆధారపడి ఉందన్నారు. యువత, ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా మాట్లాడుతూ ఓటింగ్ శాతాన్ని పెంచే దిశగా ప్రతి ఒక్కరూ శ్రమించాలన్నారు. ఈ సందర్భంగా కొత్త ఓటర్లకు ఐడీ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాధికార సివిల్ జడ్జి రాజేష్, హెచ్.హొసమని, స్వీప్ సమితి అధ్యక్షుడు, జెడ్పీ సీఈఓ రాహుల్ శరణప్ప, ఏడీసీ మహమ్మద్ ఝుబేర, ఏసీ హేమంత్, ఏఎస్పీ నవీన్‌కుమార్, పాలికె కమిషనర్ ఖలీల్ సాబ్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి పునాది ఓటు హక్కు

కోలారు: ఓటు హక్కు విజయవంతం ప్రజాప్రభుత్వ వ్యవస్థ వల్లే సాధ్యమని జిల్లా సెషన్స్ జడ్జి జీపీ మంజునాథ తెలిపారు. గురువారం నగరంలోని కలెక్టరేట్ కార్యాలయ ఆడిటోరియంలో నిర్వహించిన జాతీయ ఓటరు దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఓటరు ఎన్నికల ముందు అభ్యర్థి పూర్వాపరాలు బాగా తెలుసుకుని ఓటు చేయాలన్నారు. న్యాయమూర్తి సునీల్ హొసమని మాట్లాడుతూ 2011 నుంచి ఓటరు దినోత్సవం అమలులోకి వచ్చిందన్నారు. జెడ్పీ సీఈఓ పద్మ, జిల్లాధికారి అక్రంపాషా తదితరులు పాల్గొన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందించారు. డీడీపీఐ రామచంద్రప్ప, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

కనీస వేతనాల కోసం ధర్నా



ఆందోళన చేస్తున్న కార్మికులు

రాయచూరు రూరల్: రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్న కట్టడ కార్మికులు, హమాలీలకు కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయూ సంఘం జిల్లాధ్యక్షురాలు పద్మ డిమాండ్ చేశారు. గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి మాట్లాడారు. తొమ్మిదేళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్న కార్మిక వర్గాలకు చేస్తున్న అన్యాయాలపై ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. బహుళజాతి కంపెనీల ఆధ్వర్యంలో నలిగి పోతున్న సంస్థలను పరిరక్షించాలన్నారు. కనీస వేతనాలను రూ.18 వేల నుంచి 31 వేల వరకు పెంచాలన్నారు. పెట్టుబడిదారుల రూ.14.50 లక్షల రుణాలను రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం కింది స్థాయి కార్మికుల వేతనాలను పెంచాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు. ఆందోళనలో శరణ బసవ, వరలక్ష్మి, రుద్రప్ప, వెంకటేష్, మత్రిస్వామి, రామణ్ణ, అంజప్ప, శబ్బీర్, యంకప్ప, యూసఫ్, అన్వర్, మెహబూబ్‌లున్నారు.

ఇష్టపడి చదివితే లక్ష్యసాధన సులభం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

కోలారు: విద్యార్థులు ఇష్టపడి చదివితే లక్ష్యసాధన సులభతరం అని తహసీల్దార్ జీపీ హర్షవర్ధన్ విద్యార్థులకు హితవు పలికారు. గురువారం నగరంలోని టి.చెన్నయ్య రంగమందిరంలో శ్రీరాం ఫైనాన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థులకు ప్రోత్సాహధనం పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు జ్ఞానార్జన కోసం నిత్యం పత్రికలను చదవాలన్నారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన, కంప్యూటర్ పరిజ్ఞానాన్ని కూడా పెంచుకోవాలన్నారు. ప్రైవేటు సంస్థలు విద్యార్థుల విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం అందించడం హర్షణీయమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆస్తులు సంపాదించి ఇవ్వడానికి బదులుగా వారినే ఆస్తిగా తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో 500 మంది విద్యార్థులకు ప్రోత్సాహధనం అందించారు. కార్యక్రమంలో నగర పోలీస్ ఇన్‌స్పెక్టర్ సదానంద, శ్రీరాం ఫైనాన్స్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ శ్రీధర్, గల్‌పేట పోలీస్ ఇన్‌స్పెక్టర్ అరుణ్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సౌకర్యానికే వంతెనలు



వంతెనను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు



నూతనంగా ప్రారంభించిన అండర్‌పాస్ వంతెన ఇదే

రాయచూరు రూరల్: గ్రామీణ ప్రాంత రైతులు, ప్రజల సౌకర్యం కోసం రైల్వే లైన్లపై వంతెనలు నిర్మించామని లోక్‌సభ సభ్యుడు రాజా అమరేశ్వర నాయక్ అన్నారు. గురువారం మటమారి రైల్వేస్టేషన్ సమీపంలో రూ.5 కోట్లతో నిర్మించిన భూగర్భ అండర్‌పాస్ వంతెనను ప్రారంభించి ఆయన మాట్లాడారు. గత 30 ఏళ్ల నుంచి 45 గ్రామాల వాసుల కోరిక నేటితో నెరవేరిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్, దక్షిణ మధ్య జోనల్ సలహా సమితి సభ్యుడు బాబూరావ్, రైల్వే అధికారులు కృష్ణప్ప, తేజస్వి రెడ్డి, ఉరుకుందప్ప నాయక్, సిరాజ్ అహ్మద్, బసవనగౌడ, మహంతేష్, ముక్తియార్, బసవరాజ్ నాయక్, వెంటేష్ నాయక్‌లున్నారు.

బాలల హక్కులు కాపాడాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: బాలల హక్కుల రక్షణకు ఉపాధ్యాయులు సమాజంతో చేతులు కలపాలని సివిల్ జడ్జి, జిల్లా న్యాయ ప్రాధికార సభ్యుడు సునీల్ హొసమని తెలిపారు. గురువారం తొట్లి గ్రామంలోని శాంతినికేతన ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాల్య వివాహాలు, పోక్సో చట్టాలపై అవగాహన సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. చదువుకునే వయసులో పిల్లలను గ్యారేజీ, ఇటుకల ఫ్యాక్టరీల్లో పనిలో పెట్టరాదన్నారు. పిల్లలు ఇలాంటి చోట పని చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే 1098కు ఫిర్యాదు చేయాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టడానికి బాలగంగాధర తిలక్ వంటి మహనీయులు ఎంతో శ్రమించారన్నారు. యువత ఇలాంటి దురాచారాలను అరికట్టడానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీవేంకటేశ్వరునికి కల్యాణ, పుష్పయాగ ఉత్సవాలు



పూజలు నిర్వహించిన రాజేంద్రరెడ్డి దంపతులు

రాయచూరు రూరల్: నగరంలోని నవోదయ కాలనీలో వెలసిన లక్ష్మీవేంకటేశ్వరాలయంలో ఘనంగా కల్యాణ, పుష్పయాగ ఉత్సవాలు నిర్వహించారు. గురువారం నవోదయ వైద్య సంస్థల ఆధ్వర్యంలో నారాయణపేట మాజీ ఎమ్మెల్యే రాజేంద్రరెడ్డి దంపతులు లక్ష్మీ వేంకటేశ్వరాలయంలో లక్ష్మీవేంకటేశ్వరుడికి పూజలు చేసి పుష్పయాగం జరిపి దేవుడిని ఊరేగించారు.

డిమాండ్లు తీర్చాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

కంప్లి: తమ డిమాండ్లను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పదాధికారులు గురువారం ఎమ్మెల్యే గణేష్‌కు వినతిపత్రం అందించారు. సంఘం తాలూకా అధ్యక్షుడు హెచ్.దొడ్డబసప్ప మాట్లాడుతూ ఉద్యోగుల 7వ వేతన కమిషన్, జ్యోతి సంజీవిని ఆరోగ్య పథకం అమలు, హైస్కూల్ ఉపాధ్యాయుల వేతన తారతమ్య నివారణ తదితరాలను పరిష్కరించాలని కోరారు.

అనుమానాస్పద యువతి అరెస్ట్



పట్టుబడ్డ యువతి

రాయచూరు రూరల్: యాపలదిన్ని దర్గా ఉరుసు ఉత్సవాల్లో భాగంగా గురువారం దర్గా వద్ద ఓ గుర్తు తెలియని యువతి చిన్న పిల్లల కిడ్నాప్‌నకు ప్రయత్నిస్తుండగా యువతిని అరెస్ట్ చేసినట్లు యాలపదిన్ని పోలీసులు తెలిపారు. పట్టుబడ్డ యువతి పేరు తెలంగాణకు చెందిన రాజమ్మ అని తెలిపారు. గ్రామాల్లో తల్లిదండ్రులు చిన్న పిల్లల కదలికలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

భాగ్యలక్ష్మి బాండ్ల పంపిణీ



బాండ్లను అందజేస్తున్న మాజీ మేయర్ రాజేశ్వరి

బళ్లారిటౌన్: 34వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు సుకన్య సమృద్ధి పథకంలో మంజూరైన భాగ్యలక్ష్మి బాండ్లను గురువారం మాజీ మేయర్ రాజేశ్వరి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్రముఖులు సుబ్బారాయుడు, మహేష్, పరమేష్, యోగానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అజ్మీర్ యాత్రకు శ్రీకారం



ఎమ్మెల్యే, ప్రముఖులను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

బళ్లారిఅర్బన్: విశ్వశాంతి కోసం అమ్మ చారిటబుల్ సంస్థాపకుడు, మాజీ కార్పొరేటర్ గాజుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో నగరం నుంచి 120 మంది భక్తులకు అజ్మీర్ యాత్రను చేపట్టడం హర్షనీయమని ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ట్రస్ట్ ఆధ్వర్యంలో అజ్మీర్ యాత్రను ఆయన ప్రారంభించి మాట్లాడారు. హిందూ ముస్లింలు ఐకమత్యంతో అన్నదమ్ముల్లా కలిసి ఉండటానికి ఇదే నిదర్శనమన్నారు. ఆరు రోజుల తర్వాత వీరంతా యాత్ర ముగించుకుని తిరిగి వస్తారన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మత గురువు యదులాసాహెబ్ ఖలీల్, ఖాజాసాబ్‌తో పాటు ముస్లిం బాంధవులు, కార్పొరేటర్లు ప్రభంజన్, రామాంజిని, ప్రముఖులు జబ్బార్, లోకేష్, సలార్‌బాషా, రాధిక శివ తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించండి



మాట్లాడుతున్న రుద్రగౌడ

రాయచూరు రూరల్: యరమరస్ స్పిన్నింగ్ మిల్లులో విధులు నిర్వహించిన కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని స్పిన్నింగ్ మిల్లు కార్మికుల సంఘం జిల్లాధ్యక్షుడు రుద్రగౌడ డిమాండ్ చేశారు. ఆయన గురువారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 27 ఏళ్ల పాటు పని చేసిన కార్మికులకు బకాయి వేతనాలు, గ్రాచ్యుటీ, పీఎఫ్, జీపీఎఫ్ మొత్తం రూ.3 కోట్లు చెల్లించకుండా సహకార సంఘం అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. మిల్లులోని సామగ్రిని విక్రయించారన్నారు. 40 ఎకరాల భూమిని ఇతరులకు అద్దెకిచ్చి తమ పేరు మీద చేయించుకున్నారని ఆరోపించారు.